శుక్రవారం
14-07-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 23
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam
www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

3 లక్షల దళాలు సిద్ధం చేయాలి

అంతర్జాతీయ సమాజం నుంచి వ్యతిరేక, సభ్యుల మధ్య భిన్నాభిప్రాయాల నడుమ లిథువేనియన్ రాజధాని విల్నియస్‌లో రెండు రోజులు జరిగిన నార్త్ అట్లాంటిక్ ట్రీటీ ఆర్గనైజేషన్ (నాటో) సదస్సు బుధవారం ముగిసింది. ఈ సదస్సులో భాగంగా ప్రచ్ఛన్న యుద్ధాన్ని ముగింపు క్రమంలో సమగ్ర రక్షణ ప్రణాళికలను నాటో ఆమోదించింది.

2 లో

మళ్లీ మంత్రుల లొల్లి

మహోగ్ర యమున

- ఢిల్లీ జల దిగ్బంధం
- ఎర్రకోటను తాకిన వరద
- ప్రధాన రోడ్లు, ఇళ్లు జలమయం
- సీఎం కేజ్రీవాల్ ఇంటివద్దకు నీరు 2 లో
- 45 ఏళ్లలో ఎన్నడూ ఎరుగని వరద
- 208 మీటర్లు దాటిన నీటిమట్టం
- విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించిన ఢిల్లీ ప్రభుత్వం

యమునా నది ప్రమాదకరస్థాయిని మించి మహోగ్రంగా ప్రవహిస్తోంది. ఢిల్లీని ముంచెత్తుతోంది. 45 ఏళ్లలో ఎన్నడూ ఎరుగని వరదలకు దేశ రాజధాని వీధులు నదిలా మారాయి. లోతట్టు ప్రాంతాలే కాదు... ప్రధాన రోడ్లు, ఇళ్లు నీటిలో చిక్కుకున్నాయి.

- తెలంగాణ విద్యావ్యవస్థపై నోరు జారిన బొత్స
- రాజధాని లేని రాష్ట్రమంటూ శ్రీనివాస్‌గౌడ్ కౌంటర్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి:
వివాదాస్పద వ్యాఖ్యలకు తరచూ కేంద్ర బిందువు అవుతున్న మంత్రి బొత్స సత్యనారాయణ మళ్లీ నోరు జారారు. విజయవాడలో గురువారం ట్రిపుల్ ఐటీ ప్రవేశాలకు సంబంధించి నిర్వహించిన విలేకరుల సమావేశంలో తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ పనితీరు అస్తవ్యస్తంగా ఉందంటూ బొత్స తీవ్ర విమర్శలకు పాల్పడ్డారు. ఏపీ విద్యావిధానం గురించి గొప్పగా చెప్పే ప్రయత్నంలో మన విద్యావిధానాన్ని తెలంగాణతో పోల్చిచూడటం సరికాదన్నారు. అక్కడంతా చూచిరాతలు, కుంభకోణాలు రోజూ చూస్తున్నాం కదా అని వ్యాఖ్యానించారు. ఉపాధ్యాయ బదిలీలను కూడా సక్రమంగా చేసుకోలేని దుస్థితిలో తెలంగాణ ప్రభుత్వం ఉందని విమర్శించారు. మన విద్యావిధానం మనదని, మన ఆలోచనలు మనవంటూ వ్యాఖ్యానించారు. దీనిపై కొద్దిసేపటికే తెలంగాణ మంత్రి శ్రీనివాస్ గౌడ్ మండిపడుతూ ఘాటైన సమాధానం ఇచ్చారు. మంత్రి బొత్స సత్యనారాయణ చూసి రాత పరీక్షల్లో పాసయ్యారు. కాబట్టే అలా మాట్లాడుతున్నారని, తెలంగాణలో అభివృద్ధిని చూసి ఓర్వలేనితనం, అక్కసుతోనే బొత్స అలా మాట్లాడుతున్నారని విమర్శించారు. తాము తెలంగాణలోనే చదువుకుంటామని ఏపీ విద్యార్థి ఒకరు ఇటీవల కోర్టుకు వెళ్లారని గుర్తు చేశారు. బొత్స పిల్లలు కూడా ఇక్కడే చదివి ఉంటారని వ్యంగ్యంగా అన్నారు. గతంలో ఏపీపీఎస్సీలో ఎన్ని స్కామ్‌లు జరిగాయో చూసుకోవాలని హితవు పలికారు. బదిలీల కోసం వారి హయాంలో సూట్ కేసులు పట్టుకుని లాడ్జిల్లో ఉండేవారని గుర్తు చేశారు. తమ దగ్గర వోక్స్ వ్యాగన్ స్కాములు ఏమైనా ఉన్నాయా అంటూ ఎద్దేవా చేశారు. ఏపీలో అంతా కులపిచ్చి తప్ప అభివృద్ధి ఏమీ లేదన్నారు. అన్ని విషయాలపై ఎక్కడైనా చర్చకు సిద్ధమా అని బొత్సకు సవాల్ విసిరారు. బాధ, ఈర్ష్య, ద్వేషంతో మాట్లాడారా? లేక రాజకీయంగా ఉపయోగపడుతుందని మాట్లాడారా అని బొత్సను సూటిగా ప్రశ్నించారు. తెలంగాణను కించపర్చేలా మాట్లాడితే సహించబోమని హెచ్చరించారు.

ఆంధ్రప్రదేశ్‌లోనూ బీఆర్ఎస్‌ను విస్తరిస్తామని, అధికారం ఇస్తే తెలంగాణ తరహాలో ఏపీని కూడా అభివృద్ధి చేస్తామని చెప్పారు. ఇకనైనా ఏపీ అభివృద్ధిపై దృష్టి సారించాలని, మనుషులు కలిసి మెలసి ఉండేలా చూడాలని బొత్సకు మంత్రి శ్రీనివాస్ గౌడ్ హితవు చెప్పారు.

నేడు చంద్రయాన్ ప్రయోగం

కౌంట్‌డౌన్ ప్రారంభం

శ్రీహరికోట:
భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న చంద్రయాన్-3 ప్రయోగానికి సర్వం సిద్ధమైంది. ఈ ప్రయోగానికి తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని సతీశ్ ధవన్ స్పేస్ సెంటర్ (షార్)లో గురువారం మధ్యాహ్నం 1.05 గంటలకు కౌంట్‌డౌన్ ప్రారంభమైంది.

ఈ కౌంట్‌డౌన్ దాదాపు 25:30 గంటల పాటు సాగనుంది. శుక్రవారం మధ్యాహ్నం 2:35 గంటలకు రెండో ప్రయోగ వేదిక నుంచి ఎల్‌వీఎం3-ఎం4 రాకెట్ నింగిలోకి దూసుకెళ్లనుంది. చంద్రయాన్ సిరీస్‌లో ఇది మూడో ప్రయోగం కాగా ఎల్‌వీఎం3-ఎం4 భారీ వాహకనౌక ద్వారా ఈ ప్రయోగం చేపట్టనున్నారు. ఈ ఉపగ్రహాన్ని ల్యాండర్, రోవర్ ప్రొపల్షన్ మాడ్యూల్‌తో అనుసంధానించారు. సుమారు 3,84,000 కి.మీ. ప్రయాణించి చంద్రుని నుంచి వంద కిలోమీటర్ల ఎత్తులోని కక్ష్యలోకి ఇది చేరుకుంటుంది. ఆ తర్వాత జాబిల్లి దక్షిణ ధ్రువంలోని నిర్దేశిత ప్రదేశంలో ల్యాండ్ అవుతుందని ఇస్రో తెలిపింది.

బోధనలో సమూల మార్పులు

విశ్వవిద్యాలయాల వైస్‌ఛాన్సలర్ల సమావేశంలో సీఎం

విద్యా బోధనలో సమూల మార్పులకై ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రూపంలో నాలుగో విప్లవం దిశగా అడుగులు వేస్తున్నామని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి చెప్పారు. గురువారం విద్యాశాఖ అధికారులు, విశ్వ విద్యాల యాల వైస్ ఛాన్స్‌లర్లతో తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో సీఎం సమావేశం నిర్వహించారు.

8 లో

బంధం బలోపేతమే లక్ష్యం

పారిస్‌లో మోదీకి ఘన స్వాగతం

భారత్-ఫ్రాన్స్ మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యానికి ఈ ఏడాదితో 25 ఏళ్లు పూర్తి అయ్యాయి. ఈ సందర్భంగా తమ రెండు దేశాల మధ్య వ్యూహాత్మక బంధాన్ని మరింత బలోపేతం చేసుకోవాలన్నదే తన పారిస్ పర్యటన ఉద్దేశమని భారత ప్రధాని మోదీ తెలిపారు. ఆయన గురువారం ఫ్రాన్స్ రాజధాని పారిస్ చేరుకున్నారు.

ఈయూకు వ్యతిరేకంగా క్యూబాకు వెనిజులా మద్దతు

2 లో

శ్రీ చైతన్య విద్యాసంస్థల అధినేత బీఎస్ రావు కన్నుమూత

భౌతికకాయం విజయవాడకు తరలింపు



విశాలాంధ్ర బ్యూరో- అమరావతి:
శ్రీచైతన్య విద్యాసంస్థల వ్యవస్థాపకులు, ఛైర్మన్ డాక్టర్ బొప్పన సత్యనారాయణరావు (బీఎస్‌రావు-75) కన్నుమూశారు. గురువారం మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు వెంటనే అపోలో హాస్పిటల్‌కు తరలించారు. అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. దీంతో ఆయన భౌతికకాయాన్ని స్వస్థలం అయిన విజయవాడలోని తాడిగడపకు తరలించారు. విజయవాడలోనే అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు బంధువులు తెలిపారు. బీఎస్ రావుకు ఇద్దరు కుమార్తెలు కాగా, వారిలో సీమ

- మిగతా 2 లో

ఇదీ లోకం!

నిరుద్యోగులకు ఝలక్

- ఆచార్యుల సేవలకు కేబినెట్ ఓకే
- జగన్ సర్కారుపై ఆగ్రహజ్వాలలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:
కాబోయే ఆచార్యులకు జగన్ సర్కారు మరో షాక్ ఇచ్చింది. విశ్వవిద్యాలయాల్లో బోధనా సిబ్బంది కొరతను తీర్చేందుకు రాష్ట్ర కేబినెట్ ప్రత్యామ్నాయ ఏర్పాటు చేసింది. పదవీ విరమణ చేయబోతున్న ఆచార్యులు, సిబ్బంది సేవలను కాంట్రాక్టు పద్ధతిలో వినియోగించుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇది నిరుద్యోగుల పాలిట శాపంగా మారింది. కోర్టు కేసుల దృష్ట్యా పోస్టుల భర్తీలో జాప్యాన్ని సాకుగా చూపి... దానికి ప్రత్యామ్నాయంగా ఈ ఆలోచనను ప్రభుత్వం ముందుకు తెచ్చింది. 62 ఏళ్లకు పదవీ విరమణ చేస్తున్న బోధనా సిబ్బందిని 65 ఏళ్ల వరకూ కాంట్రాక్టు పద్ధతిలో వినియోగించుకోవడానికి కేబినెట్ ఆమోదం తెలిపింది. దీనిపై నిరుద్యోగుల నుంచి పెద్దఎత్తున వ్యతిరేకత నెలకొంది. ఇప్పటికే ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును జగన్ సర్కారు 60 నుంచి 62 ఏళ్లకు పెంచింది. ఈ నాలుగేళ్లలో కొత్త నియామకాలు చేపట్టలేదు. అన్ని విభాగాల్లోనూ ఉద్యోగ నియామకాల ప్రక్రియ నిలిచిపోయింది. నాలుగేళ్ల నుంచి విశ్వవిద్యాలయాల్లో ఆచార్యుల పోస్టుల భర్తీ కోసం లక్షలాది మంది యువత ఎదురు చూస్తోంది. ఆ పోస్టులు వస్తాయనే ఆశతో భారీ వ్యయంతో పీహెచ్‌డీలు పూర్తి చేసి, యూజీసీ నిబంధనల మేరకు నెట్‌లో అర్హత పొంది ఉన్నారు. మరోవైపు, ఆచార్య పోస్టుల భర్తీ ప్రక్రియ న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉంది. దీనిని దృష్టిలో ఉంచుకుని జగన్ సర్కార్ పదవీ విరమణ చేసిన వారి సేవలు ఉపయోగించుకోవాలని నిర్ణయం తీసుకుంది. పదవీ విరమణ అనంతరం ఆచార్యులను, బోధన సిబ్బందికి మరో మూడేళ్లు పెంచడమంటే అప్పటి వరకు కొత్త నియామకాలు లేనట్లే. పదవీ విరమణ చేసిన వారికి మళ్లీ అవకాశం ఇవ్వకుండా, ఆయా స్థానాలకు ప్రకటన విడుదల చేసి వయోపరిమితి

- మిగతా 2 లో

పవన్ కల్యాణ్‌పై కేసు నమోదు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:
వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌పై కేసు నమోదైంది. విజయవాడ కృష్ణలంక పోలీస్‌స్టేషన్‌లో పవన్‌పై గురువారం కేసు నమోదు చేశారు. ఏలూరు వారాహి యాత్రలో వలంటీర్ల వ్యవస్థపై పవన్ తీవ్ర ఆరోపణలు చేశారు. మహిళల అక్రమ రవాణాలో వలంటీర్లు భాగస్వాములవుతున్నారని ఆయన

- మిగతా 2 లో

మంత్రి పదవుల చిచ్చు

- నేడు మహారాష్ట్ర కేబినెట్ విస్తరణ
- అజిత్ వర్గానికే కీలక శాఖలు!
- అధికార కూటమిలో మల్లగుల్లాలు
- షిండే వర్గానికి మొండిచేయి: శివసేన(యూబీటీ)

ముంబై:
మహారాష్ట్ర మంత్రివర్గ విస్తరణ శుక్రవారం జరగనున్నట్లు అధికార శివసేన గురువారం వెల్లడించింది. కీలక శాఖల కేటాయింపు అదే రోజు ఉంటుందని తెలిపింది. అయితే కొత్త మంత్రివర్గంలో అసలు షిండే వర్గానికి స్థానం దక్కుతుందా అన్న అనుమానాలు ప్రతిపక్షంలోని వారు వ్యక్తంచేస్తున్నారు. నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సీపీ) నేత అజిత్ పవార్ ఉప ముఖ్యమంత్రిగా, మంత్రులుగా మరో ఎనిమిది మంది ఎమ్మెల్యేలు ఈనెల 2న ప్రమాణ స్వీకారం చేశారు. ఈ ఆకస్మిక పరిణామం శరద్ పవార్ పార్టీని చీల్చేసింది. అయితే ఎన్‌సీపీ నేతలు పాలకపక్షంలో చేరడం శివసేన-బీజేపీ సంకీర్ణంలో అసమ్మతి జ్వాలను రగిల్చింది. మంత్రిత్వశాఖల కేటాయింపుపై గొడవ మొదలైంది. దీంతో మంత్రివర్గ విస్తరణకు ప్రాధాన్యత ఏర్పడింది. అజిత్ పవార్ నేతృత్వ ఎన్‌సీపీని అణగిమణగి ఉంచాలనుకున్న ఏక్‌నాథ్ షిండే, దేవేంద్ర ఫడ్నవీస్ వర్గాలకు షాకిచ్చేలా కీలక శాఖలను అజిత్ వర్గం ఎగరేసుకుపోనున్నట్లు తెలుస్తోంది. దేవేంద్ర ఫడ్నవీస్ వద్ద ఉన్న ఆర్థిక శాఖను అజిత్ పవార్‌కు అప్పగిస్తారని విశ్వసనీయ వర్గాల సమాచారం. తమ పార్టీ మంత్రులకు కీలక శాఖలను అజిత్ డిమాండ్ చేస్తున్నారని, ఆర్థిక, ప్రణాళిక, సహకార శాఖల కోసం పట్టుబడుతున్నట్లు తెలిసింది. శాఖల కేటాయింపుపై ఈనెల 10,11 తేదీల్లో షిండే, ఫడ్నవీస్, అజిత్ చర్చలు జరుపగా శాఖల కేటాయింపు సమస్య పరిష్కారమైనట్లు ఎన్‌సీపీ కార్యనిర్వాహక అధ్యక్షుడు ప్రఫుల్ పటేల్ బుధవారం తెలిపారు. మరో ఒకటి లేక రెండు శాఖలపై నిర్ణయం జరగాల్సి ఉందన్నారు. మంత్రిత్వశాఖల కేటాయింపు విషయంలో అధికార కూటమిలో వివాదాలు ఏమీ లేవని తెలిపారు. ఇదిలావుంటే, కేబినెట్‌లో అసలు షిండే వర్గానికి స్థానం దక్కుతుందా అన్న సందేహాన్ని శివసేన (యూబీటీ) వ్యక్తంచేసింది. ఆ వర్గంలోని ఆశావహులకు నిరాస తప్పబోదని వ్యాఖ్యానించింది. అధికార కూటమిలోకి చేర్చుకున్న కొత్త వారిని సంతృప్తిపర్చడం బీజేపీకి కష్టసాధ్యమని శివసేన (యూబీటీ) నేత, మహారాష్ట్ర శాసనమండలిలో ప్రతిపక్ష నేత అంబదాస్ దాన్వే అన్నారు. మూడు పార్టీల నుంచి మంత్రులు కావాలనుకునే ఎమ్మెల్యేల సంఖ్యకు... ఉన్న పదవుల సంఖ్యకు మధ్య సమతుల్యత లేదని చెప్పారు. ఈ విషయంలో బీజేపీ నేతల్లో తీవ్రస్థాయిలో అసంతృప్తి ఉందని దాన్వే తెలిపారు. ఈపరిస్థితుల్లో కేబినెట్ విస్తరణ సవాళ్ల భరితమేనన్నారు. పాలక పక్షంలోని వారికి ఆగ్రహం తెప్పించే అవకాశాలు ఉన్నందున కేబినెట్ విస్తరణ జరగకపోవచ్చన్న అనుమానాన్ని శివసేన (యూబీటీ) ఎంపీ సంజయ్ రౌత్ వ్యక్తంచేశారు. అజిత్ పవార్ వర్గంలోని మంత్రులంతా గతంలో ఉప ముఖ్యమంత్రిగా, హోంమంత్రిగా పనిచేసిన వారని, అదే స్థాయి పదవిని వారు ఇప్పుడూ కోరుకుంటారని, వారిని సంతృప్తిపర్చడం బీజేపీకి కష్టమని రౌత్ తెలిపారు.

జిల్లా కోర్టుల్లో 3,546 మందికి ఉద్యోగాలు

- ఎంపిక జాబితా విడుదల
- నెలాఖరుకు నియామకాలు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి:
రాష్ట్రంలోని జిల్లా కోర్టుల్లో వివిధ రకాల పోస్టుల భర్తీకి సంబంధించి ప్రాథమికంగా ఎంపిక చేసిన అభ్యర్థుల రెండో జాబితాను గురువారం హైకోర్టు విడుదల చేసింది. గతేడాది రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కోర్టుల్లో జూనియర్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్, ఎగ్జామినర్, రికార్డ్ అసిస్టెంట్, ప్రాసెస్ సర్వర్, ఆఫీస్ సబార్డినేట్, స్టెనోగ్రాఫర్ గ్రేడ్-3, డ్రైవర్ పోస్టులన్నీ కలిపి 3,546 ఉద్యోగాల భర్తీకి హైకోర్టు చర్యలు చేపట్టింది. వీటికి నిర్వహించిన రాత పరీక్ష ఫలితాలు మార్చిలో విడుదల కాగా...మొదటి జాబితాలో ఎంపికైన అభ్యర్థులు ఇప్పటికే విధుల్లో చేరారు. మిగిలిన సీట్ల భర్తీ నేపథ్యంలో తాజాగా రెండో ఎంపిక జాబితాను హైకోర్టు అధికారికంగా విడుదల చేసింది. వివిధ విభాగాల్లోని ఉద్యోగాలకు ప్రాథమికంగా ఎంపికైన అభ్యర్థుల ధృవపత్రాల పరిశీలన ఈనెల 17వ తేదీ నుంచి 31 వరకు జరుగుతుందని తెలిపింది. ధృవపత్రాల పరిశీలన అనంతరం అభ్యర్థులకు ఉద్యోగ నియామక పత్రాలు పంపిణీ చేస్తారు.

20 నుంచి ట్రిపుల్ ఐటీ కౌన్సెలింగ్

- ప్రథమ సంవత్సర ప్రవేశాలకు జాబితా విడుదల
- 4,400 మంది ఎంపిక
- ఆగస్టులో తరగతులు
- ప్రతి క్యాంపస్‌లో 1100 సీట్లు
- విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ

2 లో

3 లక్షల దళాలు సిద్ధం చేయాలి

లిథువేనియన్ సదస్సులో నాటో తీర్మానం

ఉక్రెయిన్‌కు సభ్యత్వంపై కుదరని ఏకాభిప్రాయం

విల్నియస్: అంతర్జాతీయ సమాజం నుంచి వ్యతిరేక, సభ్యుల మధ్య భిన్నాభిప్రాయాల నడుమ లిథువేనియన్ రాజధాని విల్నియస్‌లో రెండు రోజులు జరిగిన నార్త్ అట్లాంటిక్ ట్రీటీ ఆర్గనైజేషన్ (నాటో) సదస్సు బుధవారం ముగిసింది. ఈ సదస్సులో భాగంగా ప్రచ్ఛన్న యుద్ధాన్ని ముగింపు క్రమంలో సమగ్ర రక్షణ ప్రణాళికలను నాటో ఆమోదించింది. కొత్త రక్షణ కార్యాచరణ ప్రణాళికలను ప్రవేశపెట్టింది. కొత్త ప్రణాళికల్లో భాగంగా 3,00,000 దళాలను పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉంచుకోవాలని నాటో లక్ష్యంగా పెట్టుకుంది. తమ వార్షిక జీడీపీలో కనీసం రెండు శాతాన్ని రక్షణ కోసం పెట్టుబడిగా పెట్టేందుకు కట్టుబడి ఉన్నట్లు నాటో మిత్రపక్షాలు వెల్లడించినట్లు అధికారిక ప్రకటన పేర్కొంది. 31 మిత్రదేశాల్లో 11 దేశాలు మాత్రమే ఈ లక్ష్యాన్ని 2014 నుంచి ఇప్పటివరకు చేరుకోగలిగినట్లు సదస్సులో విడుదల చేసిన పత్రాలు పేర్కొన్నాయి. ఉక్రెయిన్‌కు దీర్ఘకాలిక మద్దతు ఇచ్చేందుకు నాటో నేతలు ప్రతిజ్ఞబూనారు. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో కొత్త నాటో-ఉక్రెయిన్ మండలి సమావేశాన్ని ప్రారంభించారు. తమ కూటమిలోకి ఉక్రెయిన్‌ను చేర్చుకునేందుకు టైమ్‌టేబుల్‌ను ఖరారు చేయడంలో విఫలమయ్యారు. దీనిపై జెలెన్‌స్కీ ఒకింత అసహనాన్ని కూడా వ్యక్తం చేశారు. తమ కూటమికి ఉక్రెయిన్‌కు సాన్నిహిత్యం ఎలా అనే విషయంలో నాటో సభ్యుల మధ్య భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. తూర్పు ఐరోపా సభ్యులు ఈ విషయంలో నిబద్ధతను కోరగా అమెరికా, జర్మనీ మాత్రం స్పష్టతివ్వడానికి విముఖంగా ఉన్నట్లు నివేదికలు పేర్కొన్నాయి. అధికారిక ప్రకటనలో చైనా గురించి 15సార్లు ప్రస్తావన ఉంది. తమ కూటమికి చైనా వ్యూహాత్మక సవాళ్లు విసురుతోందని నాటో ఆరోపించింది. ఈ ఆరోపణలను చైనా బుధవారం తోసిపుచ్చింది. వాస్తవాలకు భిన్నంగా నాటో వర్ణన ఉన్నదని చైనా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి వాంగ్ వెంబిన్ వెల్లడించారు. నిరాధార ఆరోపణలు చేయడాన్ని నాటో మానుకోవాలని తేల్చిచెప్పారు. రెచ్చగొట్టే విధంగా వ్యవహరిస్తూ చైనాను లక్ష్యంగా చేసుకునే మనస్తత్వాన్ని విడనాడాలని, ప్రచ్ఛన్న యుద్ధం తరహా ఆలోచన విధానం కాలం చెల్లిందని హితవు పలికారు. యూరప్ విషయంలో నాటో చేసిందేమిటో చూశామని, ఆసియా-పసిఫిక్ లేక ప్రపంచంలోని ఇతర భాగాల్లో గందరగోళం సృష్టించేందుకు నాటో ప్రయత్నించరాదని వాంగ్ సూచించారు. నాటో సదస్సుకు వ్యతిరేకంగా ఐరోపా దేశాల్లో అనేక చోట్ల పెద్దఎత్తున నిరసనలు, ప్రదర్శనలు జరిగాయి. బ్రిటన్, ఫ్రాన్స్‌లోనూ ఆందోళనలు జరిగాయి.

బైడెన్‌తో జెలెన్‌స్కీ భేటీ

నాటో సదస్సులో భాగంగా ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ, అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ భేటీ అయ్యారు. తమ దేశానికి అందించిన సహాయ, సహకారాలు ముఖ్యంగా సైనిక తోడ్పాటుకుగాను బైడెన్‌కు జెలెన్‌స్కీ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. తాజా పరిణామాలు, ఉక్రెయిన్ ఆపరేషన్లు, వ్యూహాత్మక ప్రణాళికలను బైడెన్‌కు వివరించారు. ఉక్రెయిన్‌కు అమెరికా ఇప్పటివరకు 43 బిలియన్ డాలర్ల సాయం అందించినట్లు జెలెన్‌స్కీ వెల్లడించారు. బైడెన్ స్పందిస్తూ ఉక్రెయిన్‌కు అండగా నిలుస్తామని భరోసానిచ్చారు. అవసరమైనప్పుడల్లా తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. అనంతరం జెలెన్‌స్కీ సామాజిక మాధ్యమం ద్వారా ఈ భేటీ గురించి తెలిపారు. ఉక్రెయిన్‌కు దీర్ఘకాల మద్దతు, ఆయుధాలు, రాజకీయాలు, నాటోకు సంబంధించిన అంశాలపై బైడెన్‌తో చర్చించినట్లు ఆయన పేర్కొన్నారు.

ఖుర్‌ఆన్ తగలబెట్టడాన్ని ఖండిస్తూ ఐరాస తీర్మానం

అనుకూలంగా ఓటేసిన భారత్, చైనాతో సహా 28 దేశాలు

జెనీవా : స్వీడన్‌లో ఖుర్‌ఆన్‌కు నిప్పుపెట్టడాన్ని ఖండిస్తూ ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల మండలి (యూఎన్‌హెచ్‌ఆర్‌సీ) తీర్మానం చేసింది. దీనికి భారత్‌తో పాటు 28 దేశాలు అనుకూలంగా ఓటు వేశాయి. ముస్లింల పవిత్ర గ్రంథాన్ని అపవిత్రం చేసే విధంగా ఇటీవల చోటుచేసుకున్న ఘటనను అనేక దేశాలు తీవ్రంగా ఖండించినాగానీ ఐరాస ప్రవేశపెట్టిన తీర్మానానికి అనుకూలంగా ఓటు వేసేందుకు కొన్ని దేశాలు వెనుకాడాయి. తద్వార వాక్ స్వేచ్ఛకు విఘాతం కలుగుతుందన్న అభిప్రాయాన్ని వ్యక్తంచేశాయి. 'వివక్ష, శత్రుత్వం లేదా హింసను ప్రేరేపించే మతపరమైన విద్వేషాన్ని నిరోధించడం' అనే ముసాయిదా తీర్మానాన్ని 47 దేశాలు సభ్యులుగా ఉన్న యూఎన్‌హెచ్‌ఆర్‌సీ ఆమోదించింది. దీనికి వ్యతిరేకంగా 12 దేశాలు ఓటు వేయగా మరో ఏడు దేశాలు ఓటింగ్‌కు హాజరు కాలేదు. భారత్, పాకిస్తాన్, చైనా, బంగ్లాదేశ్, అర్జెంటైనా, దక్షిణాఫ్రికా, వియత్నాం, క్యూబా, మలేసియా, మాల్దీవులు, ఉక్రెయిన్, యూఏఈ, ఖతార్ వంటి దేశాలు తీర్మానానికి మద్దతిచ్చాయి. అమెరికా, బ్రిటన్, యూరోపియన్ యూనియన్ దేశాలు, ఫ్రాన్స్, జర్మనీ, బెల్జియం, ఫిన్లాండ్, కాస్టరికా, మొంటెనెగ్రో దేశాలు వ్యతిరేకించాయి. గైర్హాజరైన దేశాల్లో బెనిన్, చిలీ, మెక్సికో, నేపాల్, పరాగ్వే ఉన్నాయి. యూఎన్‌హెచ్‌ఆర్‌సీ హైకమిషనర్ వోల్కర్ టర్క్ మాట్లాడుతూ పవిత్ర ఖుర్‌ఆన్‌ను తగులబెట్టే ఘటనలు ఇటీవల పెరిగాయన్నారు. బక్రీద్ రోజున స్వీడన్‌లోని స్టాకహోమ్‌లో ఖుర్‌ఆన్‌ను తగులబెట్టడంతో ఇస్లామిక్ దేశాలు మండిపడ్డాయి. తీవ్రస్థాయిలో ఖండించాయి. ఇదే అంశమై చైనా రాయబారి చెన్ గ్జు మాట్లాడుతూ 'ఇస్లామాఫోబియా ఎక్కువైంది. పవిత్ర ఖుర్‌ఆన్‌ను అవమానించే ఘటనలు మళ్లీ మళ్లీ జరుగుతున్నాయి. మత స్వేచ్ఛ, మతపరమైన నమ్మకాలు, మనోభావాలను గౌరవిస్తామని చెప్పుకునే దేశాలు వాటిని అమలు చేయడం లేదు' అని అన్నారు.

థాయిలాండ్ ప్రధాని ఎన్నికకు మళ్లీ ఓటింగ్

విశాలాంధ్ర ప్రపంచం

బ్యాంకాక్: థాయిలాండ్ కొత్త ప్రధానిని ఆదేశ పార్లమెంటు ఎన్నుకోలేక పోయింది. ఏకైక అభ్యర్థి, మూవ్ ఫార్వర్డ్ పార్టీ నేత పిటా లింజారోయర్నాట్‌కు పూర్తి మెజారిటీ రాకపోవడమే ఇందుకు కారణం. గురువారం నిర్వహించిన ప్రతినిధుల సభ, సెనేట్ సంయుక్త సమావేశంలో ఓటింగ్ జరిగింది. మెజారిటీ సాధించేందుకు కావాల్సిన దాని కంటే 375 ఓట్లు తగ్గాయి. దీంతో ఈనెల 19న మళ్లీ ఓటింగ్ నిర్వహించాలన్న నిర్ణయం జరిగింది. కన్జర్వేటివ్ పార్టీలు తమ తరపున అభ్యర్థిని నిలబెట్టలేదుగానీ ఓటింగ్‌కు గైర్హాజరయ్యాయి. హాజరైన నేతలు పిటాకు వ్యతిరేకంగా ఓటేశారు.

ఈయూకు వ్యతిరేకంగా క్యూబాకు వెనిజులా మద్దతు

కారకాస్: ఈనెల 17, 18 తేదీల్లో ఈయూ-సీఈఎల్‌సీ సదస్సు బెల్జియం, బ్రస్సెల్‌లో జరగబోతోంది. ద్వైపాంతీయ భాగస్వామ్యాన్ని పునరుద్ధరించకోవడం, శాంతి, సుస్థిరాభివృద్ధిని బలోపేతం చేసుకునే లక్ష్యంతో సదస్సు జరగనుంది. ఈయూ-కమ్యూనిటీ ఆఫ్ లాటిన్ అమెరికన్ అండ్ కరేబియన్ స్టేట్స్ (సీఈఎల్‌ఏసీ) సదస్సు నిర్వహించే విషయంలో ఈయూ వ్యవహారాన్ని కూబా తీవ్రంగా ఖండించింది. ఈయూ-లాటిన్, కరేబియన్ సదస్సును యూరోనియన్ యూనియన్ (ఈయూ) ప్రభావితం చేస్తోందని ఆరోపించింది. ఈ వైఖరిని ఖండిస్తున్నామని క్యూబా పేర్కొంది. ఈ విషయంలో క్యూబాకు వెనిజులా మద్దతు ప్రకటించింది. క్యూబా విదేశాంగ వ్యవహారాల మంత్రి బ్రూనో రాడ్రిగ్స్ ప్రకటనకు మద్దతిస్తున్నట్లు వెనిజులా విదేశాంగ శాఖ అధికారిక ప్రకటన వెలువరించింది. సదస్సు ఏర్పాట్లలో రెండు ప్రాంతీయ కూటముల మధ్య పారదర్శకత లోపించిందని, ఈ వైఖరి సదస్సు విజయంపై రాజీ పడటమే అవుతుందని వ్యాఖ్యానించింది. సదస్సును తమ పద్ధతిలో నిర్వహించేలా ఈయూ ఒత్తిడి చేస్తున్నట్లు ఆరోపించింది. అయితే నిర్మాణాత్మక స్ఫూర్తి, గౌరవం, పరస్పర కట్టుబాట్లు, ప్రాంతీయ సహకారం నేపథ్యంలో ఈ సదస్సుకు వెనిజులా హాజరవుతుందని ఆ దేశ విదేశాంగ మంత్రిత్వశాఖ ప్రకటన వెల్లడించింది.

మహోగ్ర యమున

న్యూఢిల్లీ: యమునా నది ప్రమాదకరస్థాయిని మించి మహోగ్రంగా ప్రవహిస్తోంది. ఢిల్లీని ముంచెత్తుతోంది. 45 ఏళ్లలో ఎన్నడూ ఎరుగని వరదలకు దేశ రాజధాని వీధులు నదిలా మారాయి. లోతట్టు ప్రాంతాలే కాదు... ప్రధాన రోడ్లు, ఇళ్లు నీటిలో చిక్కుకున్నాయి. ఢిల్లీలోని చారిత్రక కట్టడం 'ఎర్ర కోట'ను కూడా వరద నీళ్లు తాకాయి. యమునా ఘాట్ నుంచి ఎర్రకోటకు రెండు కిలోమీటర్ల దూరం ఉంటుంది. అయినప్పటికీ అంత దూరం వరద నీళ్లు వచ్చాయంటే... పరిస్థితి ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ఎర్రకోట చుట్టూ ఉన్న రోడ్లన్నీ నీళ్లతో నిండిపోయాయి. సీఎం అరవింద్ కేజ్రీవాల్, మంత్రుల కార్యాలయాలు సైతం జల దిగ్బంధంలో ఉన్నాయి. ఇండియా గేట్ కూడా వరద నీటితో నిండిపోతుందని అంచనా వేస్తున్నారు. యమునా నది ఒడ్డు నుంచి కేవలం దాదాపు 4 కిలోమీటర్ల దూరంలో, వరద నీటిలో చిక్కుకున్న రింగ్ రోడ్డుకు సమీపంలో ఇండియా గేట్ ఉంది. ఇక రోడ్లు... కాలువలను తలపిస్తున్నాయి. మోకాలి లోతుకుపైగా వరదనీరు నిలిచిపోయింది. లోతట్టు ప్రాంతాలతో పాటు రాజ్‌ఘాట్ నుంచి ఢిల్లీ సచివాలయం వరకు ఉన్న ప్రాంతాలన్నీ జల దిగ్బంధంలో చిక్కుకున్నాయి. ఇంత దూరం వరదలు వస్తాయని ఊహించని స్థానికులు...ఇప్పుడు ఇళ్లు ఖాళీ చేసి వెళ్లిపోతున్నారు. ఎర్రకోట చుట్టూ ఉండే వ్యాపారులు దుకాణాలు మూసివేసి వెళ్లిపోతున్నారు. ఎర్రకోట దాకా వచ్చిన వరద... ఇంకెంత దూరం పోతుందనేది ఆందోళన కరంగా మారింది. ఎర్రకోట వరకు యమునా నది నీళ్లు రావటం 45 ఏళ్లలో ఇదే తొలిసారి. యమునా నది ఈ స్థాయిలో ప్రవహించటం కూడా ఇదే మొదటిసారి. హిమాచల్‌ప్రదేశ్, హరియాణా నుంచి నదిలోకి వరద పోటెత్తటంతో ఈ పరిస్థితి వచ్చిందని ఢిల్లీ ప్రభుత్వం చెబుతోంది. ఇప్పటికే లక్షల మంది సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లారు. ప్రస్తుతం యమునా నదిలో నీటి ప్రవాహం 208 మీటర్ల ఎత్తులో సాగుతోంది. ఢిల్లీ పాత రైల్వే వంతెన వద్ద యమునా నది నీటిమట్టం 208 మీటర్లను దాటేసింది. గురువారం మధ్యాహ్నం ఒంటి గంట వరకు 208.62 మీటర్ల ఎత్తులో ప్రవాహం కొనసాగుతున్నట్లు అధికారులు తెలిపారు. నదీ ప్రవాహం మరింత పెరిగే ప్రమాదం ఉందని అధికారులు అంచనా వేశారు. ఇది తీవ్రమైన పరిస్థితి అని కేంద్ర జల సంఘం పేర్కొంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం 45 పడవలతో 16,500 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించింది. ఈ బ్యారేజి నుంచి నీటిని విడుదల చేయకుండా చర్యలు తీసుకోవాలని ఢిల్లీలోని కేజ్రీవాల్ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. దీనిపై కేంద్రం స్పందిస్తూ, బ్యారేజ్‌లో సామర్థ్యాన్ని మించి ఉన్న నీటిని విడుదల చేయవలసి ఉంటుందని స్పష్టం చేసింది. భారీ వర్షాల వల్ల హిమాచల్ ప్రదేశ్‌లో విపరీతమైన విధ్వంసం జరిగింది. అక్కడి నుంచి నీరు ఈ జలాశయంలోకి వస్తోంది. ఢిల్లీలోని సివిల్ లైన్స్ ఏరియాలో రింగ్ రోడ్డు వరదలో చిక్కుకుంది. మజ్నూ కా తిల-కశ్మీరీ గేట్ ఐఎస్‌బీటీ మార్గాన్ని మూసివేశారు. ఇక్కడి నుంచి దాదాపు 500 మీటర్ల దూరంలో కేజ్రీవాల్ నివాసం, ఢిల్లీ శాసన సభ ఉన్నాయి. హరియాణాలోని బ్యారేజ్ నుంచి నీటి ప్రవాహం గురువారం మధ్యాహ్నం 2 గంటల నుంచి తగ్గే అవకాశం ఉందని కేంద్ర జల కమిషన్ తెలిపింది. పాత ఢిల్లీ వరద ప్రభావిత ప్రాంతం కావడంతో నిగంబోధ్ ఘాట్ శ్మశాన వాటికను ఉపయోగించవద్దని అధికారులు హెచ్చరించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో 12 ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు సేవలందిస్తున్నాయి. నిజానికి ఢిల్లీ నగరంలో రెండు రోజుల నుంచి భారీ వర్షాలు లేవు. అయితే యమునా నదిలోకి హరియాణా నుంచి నీటిని విడుదల చేస్తుండటం వల్ల పరిస్థితి ఆందోళనకరంగా మారింది. వేలాది మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. వజీరాబాద్‌లోని సిగ్నేచర్ బ్రిడ్జ్ సమీపంలో, గర్హి మండు గ్రామం వరద నీటిలో మునిగిపోయింది. ఐటీఓ, కశ్మీరీ గేట్, జీటీ కర్నాల్ రోడ్, బోట్ క్లబ్, మోనాస్టరీ మార్కెట్, నీలి ఛత్రి టెంపుల్, యమునా బజార్, నీమ్ కరోలీ గోశాల, విశ్వకర్మ కాలనీ, న్యూ ఉస్మాన్‌పూర్ తదితర ప్రాంతాల్లో నీరు చేరింది.

కేంద్రం జోక్యం చేసుకోవాలని సీఎం కేజ్రీవాల్ విజ్ఞప్తి

యమునా నదిలో నీటి ప్రవాహం గంటగంటకూ తీవ్రరూపం దాలుస్తుండటం వల్ల కేంద్రం జోక్యం చేసుకోవాలని ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ విజ్ఞప్తి చేశారు. హరియాణాలోని హత్నికుండ్ బ్యారేజ్ నుంచి తక్కువ మొత్తంలో నీటిని విడుదల చేసేలా ఆ రాష్ట్ర ప్రభుత్వానికి సూచించాలని ఢిల్లీ కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాను అభ్యర్థించారు. కొన్నివారాల్లో ఢిల్లీ జీ-20 సదస్సుకు ఆతిథ్యం ఇవ్వనుందన్న విషయాన్ని గుర్తు చేశారు సీఎం కేజ్రీవాల్. రాజధానిని వరద ముంచెత్తిందన్న సమాచారం ప్రపంచ దేశాలకు తప్పుడు సంకేతాలను పంపుతుందన్న కేజ్రీవాల్... ఈ సంకట పరిస్థితుల నుంచి ఢిల్లీ ప్రజలను కలిసికట్టుగా కాపాడుకోవాల్సి ఉందని అమిత్ షాను కోరారు. నది సమీపంలోని రోడ్లు వినియోగించొద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రాణాలు కాపాడడం చాలా ముఖ్యమని... అందుకోసం ప్రజలు సహకరించాలని సీఎం కోరారు. మరోవైపు వరద ప్రభావిత ప్రాంతాల్లో 144 సెక్షన్ విధించారు. యమునా నది మహోగ్రరూపం దాల్చడంతో తలెత్తే పరిస్థితులపై చర్చించేందుకు డీడీఎంఏ సమావేశమైనట్లు కేజ్రీవాల్ వెల్లడించారు. ఢిల్లీలోని పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలన్నింటికీ ఆదివారం వరకు సెలవులు ప్రకటించారు. అత్యవసరం కాని ప్రభుత్వ కార్యాలయాల సిబ్బంది ఇంటి నుంచి పనిచేసేందుకు అవకాశం కల్పించిన కేజ్రీవాల్ సర్కార్... ప్రైవేటు కార్యాలయాలకు సైతం వర్క్‌ఫ్రమ్ హోంకు అవకాశం కల్పించాలని సూచించింది. అత్యవసర సేవలతో కూడిన భారీ వాహనాలను మాత్రమే ఢిల్లీ లోపలికి అనుమతించనున్నట్లు సీఎం కేజ్రీవాల్ తెలిపారు. ఢిల్లీ ప్రజలంతా సంయమనంతో ఉండాలని.. త్వరలోనే యమునా నది నీటి మట్టం తగ్గి సాధారణ పరిస్థితులు నెలకొంటాయని ట్విట్టర్‌లో విజ్ఞప్తి చేశారు. కాగా ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా ఢిల్లీ విపత్తు నిర్వహణ బృందంతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి పరిస్థితిని సమీక్షించారు.

20 నుంచి ట్రిపుల్ ఐటీ కౌన్సెలింగ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాజీవ్ గాంధీ యూనివర్శిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీ (ఆర్‌జేకేటీ) ట్రిపుల్ ఐటీలలో 2023-2024 విద్యా సంవత్సర ప్రవేశాలకు కౌన్సెలింగ్‌ను ఈనెల 20 నుంచి 25వరకు నిర్వహిస్తామని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ వెల్లడించారు. విజయవాడలో గురువారం ఆర్‌జేకేటీ ప్రథమ సంవత్సర ప్రవేశాల జాబితాను మంత్రి విడుదల చేశారు. ప్రథమ సంవత్సర తరగతులు ఆగస్టు మొదటి వారంలో ప్రారంభమవుతాయన్నారు. పదో తరగతి ఫలితాల్లో చూపిన ప్రతిభ, రోస్టర్ ఆధారంగా ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్స్ ట్రిపుల్ ఐటీ ప్రథమ సంవత్సరానికి ప్రవేశాలు చేపట్టామన్నారు. 2023-2024 ఏడాది ప్రవేశాలకు రాష్ట్ర వ్యాప్తంగా 38,355 మంది దరఖాస్తు చేసుకున్నారని వివరించారు. రాష్ట్రంలోని నాలుగు ట్రిపుల్ ఐటీ విద్యాసంస్థలైన నూజివీడు, ఆర్.కె.వ్యాలీ(ఇడుపులపాయ), ఒంగోలు, శ్రీకాకుళం క్యాంపస్‌లలో మొత్తం 4,400 సీట్లు ఉన్నాయని, విద్యార్థుల నుంచి పెద్ద ఎత్తున దరఖాస్తులు రావటం...ట్రిపుల్ ఐటీలో ఉన్న పోటీకి నిదర్శనమని తెలిపారు. ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులు 23,628 (83 శాతం)మంది దరఖాస్తు చేసుకోగా, 14,727 (17 శాతం) మంది ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని వివరించారు. ఇక ప్రతిభ ప్రకారం చూస్తే పదో తరగతిలో 599 మార్కులు వచ్చిన విద్యార్థి ట్రిపుల్ ఐటీలో ప్రథమ సంవత్సర ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవడం గర్వకారణమన్నారు. జనరల్ విద్యార్థుల కటాఫ్ మార్కులు 583 అని తెలిపారు. ట్రిపుల్ ఐటీ ప్రవేశ జాబితాలో టాప్-20 అభ్యర్థులు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులే కావటం రాష్ట్ర ప్రభుత్వం విద్యకు ఇస్తున్న ప్రాధాన్యతకు నిదర్శనమన్నారు. ఈ నెల 20, 21 తేదీల్లో నూజివీడు, 21, 22 తేదీల్లో ఆర్‌కే వ్యాలీ(ఇడుపులపాయ), 24, 25 తేదీల్లో ఒంగోలు క్యాంపస్, 24, 25 తేదీల్లో శ్రీకాకుళం క్యాంపస్‌లో కౌన్సెలింగ్ నిర్వహించనున్నామని వివరించారు. ప్రతి క్యాంపస్‌లో 1100 సీట్లు ఉన్నాయని, వాటిలో 911 జనరల్‌కు కేటాయించినట్లు చెప్పారు. మొత్తం 4400 సీట్లలో బాలికలకు 63.98 శాతం, బాలురకు 36.01శాతం ప్రవేశాలు కల్పిస్తామన్నారు. ఇప్పటికే ట్రిపుల్ ఐటీలలో పీజీ, పీహెచ్‌డీ కోర్సులను ప్రవేశపెట్టామని చెప్పారు. ట్రిపుల్ ఐటీల్లో మౌలిక వసతుల కల్పనపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని, అధ్యాపకుల నియామకాలు త్వరలోనే చేపట్టనున్నట్లు వెల్లడిరచారు. ఒంగోలు ట్రిపుల్ ఐటీ క్యాంపస్ నిర్మాణానికి అతి త్వరలో టెండర్లు పిలవడమే కాకుండా త్వరితగతిన నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ట్రిపుల్ ఐటీలకు దరఖాస్తులు చేసుకున్న విద్యార్థులకు, తల్లిదండ్రులకు మంత్రి అభినందనలు తెలిపారు. ఉన్నత విద్యలో చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు విద్యా కానుక మూడవ విడతతో పాటు నాల్గవ విడత నిధులు కూడా విడుదల చేస్తున్నామన్నారు. దీంతో అకడమిక్ పూర్తి చేసుకుంటున్న విద్యార్థులకు ఉపయుక్తంగా ఉంటుందన్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విద్యారంగంలో తీసుకుంటున్న విప్లవాత్మక చర్యల ఫలితంగా దేశం మొత్తం రాష్ట్రం వైపు చూస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఛాన్సలర్ ప్రొఫెసర్ కేసీ రెడ్డి, వైస్ ఛాన్స లర్ ప్రొఫెసర్ ఎం. విజయ్‌కుమార్, ప్రొఫెసర్లు సంధ్యారాణి, జయరామిరెడ్డి, జగదీశ్వరరావు, గోపాలరాజు, జీవీఆర్ శ్రీనివాసరావు, ఆర్.జె.కె.టి ఉన్నతాధికారులు, అధికారులు పాల్గొన్నారు.

బీఎస్ రావు కన్నుమూత

(మొదటిపేజీ తరువాయి)

ప్రస్తుతం విదేశాల్లో ఉన్నారు. ఆమె వచ్చిన తర్వాతే అంత్యక్రియలు నిర్వహించనున్నారు. బొప్పన సత్యనారాయణ రావు తొలినాళ్లలో బ్రిటన్, ఇరాన్‌లో డాక్టర్‌గా పని చేశారు. ఆయన సతీమణి కూడా వైద్యురాలే. గుంటూరు వైద్య కళాశాలలో విద్యనభ్యసించారు. 1986లో తన సతీమణి డాక్టర్ ఝాన్సీ లక్ష్మీభాయితో కలిసి శ్రీ చైతన్య విద్యాసంస్థలను స్థాపించారు. అందులో భాగంగా తొలుత విజయవాడ పోరంకిలో బాలికల జూనియర్ కాలేజీని స్థాపించి, ఆ తర్వాత అంచెలంచెలుగా విస్తరించారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా మొత్తం 321 జూనియర్ కాలేజీలు, 322 శ్రీ చైతన్య టెక్నో స్కూళ్లు, 107 సీబీఎస్ఈ స్కూళ్లను నడుపుతున్నారు. మొదట్లో కేవలం ఉభయ తెలుగు రాష్ట్రాల్లో విస్తరించిన శ్రీ చైతన్య విద్యాసంస్థలు 2006లో హిమాచల్ ప్రదేశ్, చండీగడ్, జార్ఖండ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు విస్తరించారు. ఆయా రాష్ట్రాల్లో ఐఐటీ-జేఈఈ, ఏఐఈఈఈ, మెడికల్ కోచింగ్ సెంటర్లను ఏర్పాటు చేశారు. ఆ సమయంలోనే అప్పటివరకు అమెరికాలో ఉన్న తన కుమార్తెలు సీమ, సుష్మలను కూడా భారత్‌కు తీసుకొచ్చి విద్యాసంస్థల నిర్వహణ బాధ్యతలను అప్పగించారు. వారు కూడా తల్లిదండ్రులకు అండగా ఉంటూ విద్యాసంస్థలను మరిన్ని రాష్ట్రాలకు విస్తరించడానికి విశేష కృషి చేశారు. మొత్తంగా ప్రస్తుతం శ్రీ చైతన్య విద్యాసంస్థలన్నింటిలో కలిపి దాదాపు 8.5 లక్షల మంది విద్యార్థినీ, విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు.

బండారు దత్తాత్రేయ సంతాపం: శ్రీ చైతన్య విద్యా సంస్థల అధినేత డాక్టర్ బొప్పన సత్యనారాయణ రావు మృతి పట్ల హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. ఆయన ఒక విద్యావేత్తగా శ్రీ చైతన్య విద్యా సంస్థలను ఏర్పాటు చేసి రెండు తెలుగు రాష్ట్రాల్లో లక్షలాదిమంది యువతీ యువకులకు ఒక గుణాత్మకమైన విద్యనందించి, వారికి ఉపాధి అవకాశాలు పొందేందుకు సహకరించారన్నారు. ఆయన మృతి విద్యారంగానికి తీరని లోటు అన్నారు.

చంద్రబాబు సంతాపం:

బీఎస్ రావు మృతికి టీడీపీ అధినేత చంద్రబాబు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విద్యారంగంలో సేవలకు తన జీవితాన్ని అంకితం చేశారని కొనియాడారు. బీఎస్ రావు మృతికి ప్రగాఢ సంతాపాన్ని, కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు.

నారాయణ, రామకృష్ణ సంతాపం: బీఎస్ రావు మృతికి సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టరు కె. నారాయణ, ఏపీ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రగాఢ సంతాపాన్ని, కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు. 1986లో శ్రీ చైతన్య విద్యాసంస్థలను స్థాపించిన బీఎస్ రావు కొద్ది కాలంలోనే దేశవ్యాప్తంగా సంస్థలను విస్తరించారని పేర్కొన్నారు. విద్యారంగ అభివృద్ధికి ఆయన సుదీర్ఘకాలంగా సేవలు అందించారన్నారు.

పవన్ కల్యాణ్‌పై కేసు నమోదు

(మొదటిపేజీ తరువాయి)

ఆరోపించారు. తన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని, తమకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ వలంటీర్లు రాష్ట్రవ్యాప్తంగా మూడు రోజుల నుంచి పెద్దఎత్తున నిరసనలకు దిగారు. వారికి సచివాలయ ఉద్యోగులు, ప్రజలు సంఘీభావం తెలుపుతున్నారు. కాగా, విజయవాడకు చెందిన వలంటీర్ దిగమంటి సురేశ్‌బాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పవన్‌పై సెక్షన్ 153, 153 (ఏ), 505 (2) కింద కేసు నమోదైంది. తాజాగా పవన్ కల్యాణ్‌కు వలంటీర్లు లేఖ రాశారు. 'అయ్యా జల్సారాయుడు గారు, వీటికి బదులిస్తారా' అంటూ ప్రశ్నలు సంధించారు. 'వలంటీర్లు అంటే ప్యాకేజీ కోసం నువ్వు ఎత్తుకోమన్న ప్రతి జెండాను భుజానికెత్తుకునే బానిస బ్యాచ్ అనుకున్నావా?' అని వలంటీర్లు నిలదీశారు.

వైసీపీ మహిళా విభాగం ఫిర్యాదు

వైసీపీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్సీ పోతుల సునీత అధ్వర్యంలో మహిళా నాయకులు, కార్యకర్తలు డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డికి గురువారం ఫిర్యాదు చేశారు. పవన్ చేసిన అనుచిత వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలని కోరారు. సీఎం జగన్ ప్రవేశపెట్టిన వలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శనీయంగా ఉందన్నారు.

వలంటీర్లలో అధికంగా మహిళలే ఉన్నారని, మహిళలపై పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలు తక్షణమే ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. అలాగే, పవన్‌పై వైసీపీ లీగల్ సెల్ అధ్వర్యంలోనూ ఎన్టీఆర్‌జిల్లా డీసీపీ మోకా సత్తిబాబుకు న్యాయవాదులు ఫిర్యాదు చేశారు. అటు జగన్ సర్కారు ఎన్ని కేసులు పెట్టినా తగ్గేది లేదంటూ పవన్ కల్యాణ్ నుంచి ఆ పార్టీ శ్రేణులు నొక్కిచెబుతున్నారు. వలంటీర్ల నిరసనలకు పోటీగా అక్కడక్కడా జనసేన శ్రేణులు నిరసనలు తెలపడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

నిరుద్యోగులకు ఝలక్

(మొదటిపేజీ తరువాయి)

నిర్ణయించాలని నిరుద్యోగ, యువజన సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. అభ్యర్థుల వయోపరిమితి పెంచాలని నిరుద్యోగ సంఘాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాయి. దీనిపై ఇంతవరకు ప్రభుత్వం నుంచి స్పందన రాలేదు. ఇది పూర్తిగా తమను దగా చేయడమేనని నిరుద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆచార్యులను వినియోగించుకోవాలన్న ప్రతిపాదనను తక్షణమే ప్రభుత్వం విరమించాల్సిన అవసరముంది. లేకుంటే ఉద్యమం తప్పదని హెచ్చరిస్తున్నారు.

నర్సుల సమస్యల్ని పరిష్కరించండి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ వైద్యశాలల్లో నర్సుల పోస్టుల భర్తీ ప్రక్రియను చేపట్టాలని, నర్సుల సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ నర్సెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు డి.మంజులదేవి విజ్ఞప్తి చేశారు. ఇటీవల ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి (కోవిడ్-19)గా డాక్టర్ మంజుల డి.హొసమని నియమితులయ్యారు. ఈ సందర్భంగా గురువారం ఆమెను మంజులదేవి అసోసియేషన్ తరపున కలిసి వివిధ సమస్యల్ని వివరించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ముగ్గురే స్టాఫ్ నర్సులు ఉండటం వల్ల వారిపై పనిఒత్తిడి ఎక్కువగా ఉందని, అదనంగా నాలుగో స్టాఫ్ నర్సును నియమించాలని కోరారు. స్టాఫ్ నర్స్ నుంచి నర్సింగ్ ఆఫీసర్లుగా పదోన్నతి ఉత్తర్వుల్ని అమలు చేయాలని, చాలా ప్రాంతాల్లో రాత్రి వేళ ఒక నర్సు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారని, అక్కడ నైట్ వాచ్‌మన్‌ను నియమించాలన్నారు.

వైసీపీలోకి అహ్మద్ అలీఖాన్



విశాలాంధ్రబ్యూరో-అమరావతి: కర్నూలు జిల్లా డీసీసీ మాజీ అధ్యక్షుడు అహ్మద్ అలీఖాన్, ఇతర నేతలు పోరెడ్డి వేణుగోపాలరెడ్డి, తకియాసాహెబ్, వినయ్ కుమార్ వైసీపీలో చేరారు. ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో సీఎం వైఎస్ జగన్ వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి (మైనార్టీ సంక్షేమం) అంజాద్ బాషా, కర్నూలు ఎంపీ సంజీవ్ కుమార్, కర్నూలు ఎమ్మెల్యే అబ్దుల్ హఫీజ్ ఖాన్, ఎమ్మెల్సీ పీ రామసుబ్బారెడ్డి, కడప జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి పాల్గొన్నారు.

ముగిసిన జీ20 3వ సంస్కృతి కార్యవర్గ సమావేశం

బెంగళూరు: భారతదేశం జీ20 ప్రెసిడెన్సీలో భాగంగా మూడవ కల్చర్ వర్కింగ్ గ్రూప్ (సీడబ్ల్యుజీ) సమావేశం కర్ణాటకలోని హంపిలో జరిగింది. పట్టాభిరామ ఆలయంలో ప్రత్యేక యోగాసనాలు వేయడంతో నాలుగురోజుల సమావేశం ముగిసింది. సాంస్కృతిక మంత్రిత్వ శాఖ డిక్లరేషన్‌కు సంబంధించిన అంశాలపై ఏకాభిప్రాయాన్ని సాధించడం ఈ సమావేశ ప్రధాన లక్ష్యం. ఈ సమావేశంలో సభ్యదేశాలు, తొమ్మిది అతిథి దేశాలు, ఏడు అంతర్జాతీయ సంస్థలు పాల్గొన్నాయి. భారత అధ్యక్షునిగా సీడబ్ల్యుజీ గుర్తించిన నాలుగు ప్రాధాన్యతల చుట్టూ సిఫార్సులు, ఉత్తమ పద్ధతులపై ఏకాభిప్రాయాన్ని సాధించడంపై ఈ సమావేశం దృష్టి సారించింది. అంతేకాదు, వచ్చే నెలలో వారణాసిలో జరగనున్న సాంస్కృతిక మంత్రివర్గ సమావేశానికి సంబంధించి సభ్య దేశాల మధ్య సంయుక్త ప్రకటనను రూపొందించడంపై చర్చలు జరిపింది. కల్చర్ వర్కింగ్ గ్రూప్ మూడు సమావేశాల నుండి చర్య-ఆధారిత ఖచ్చితమైన ఫలితాలతో బలమైన ప్రకటన ఆశిస్తున్నారు. ఇంకా, వారణాసిలో జరిగే సాంస్కృతిక మంత్రివర్గ సమావేశంలో ప్రపంచ నేపథ్య వెబ్‌నార్‌పై నివేదికను విడుదల చేస్తారు.

హంపిలో మూడో జీ20 సదస్సు ప్రారంభం

బెంగళూరు: భారతదేశ జీ20 ప్రెసిడెన్సీలో భాగంగా 3వ జీ20 షెర్పా సమావేశం కర్ణాటకలోని చారిత్రాత్మక నగరం హంపిలో గురువారం ప్రారంభమైంది. ఇది జూలై 16 వరకు కొనసాగుతుంది. ఈ సమావేశానికి భారత జీ20 అధ్యక్షుడు అమితాబ్ కాంత్ అధ్యక్షత వహిస్తున్నారు. నాలుగు రోజుల పాటు జరిగే ఈ సమావేశానికి ఆయా షెర్పాల నేతృత్వంలో 120 మందికి పైగా ప్రతినిధులు, జీ20 సభ్యదేశాలు, ఆహ్వానిత దేశాలు, అంతర్జాతీయ సంస్థల అధిపతులు హాజరవుతున్నారు. న్యూఢిల్లీ శిఖరాగ్ర సదస్సులో జీ-20 దేశాధినేతలు ఆమోదించనున్న లీడర్స్ డిక్లరేషన్‌పై ఈ సమావేశంలో చర్చిస్తున్నారు. సమావేశం మొదటి రోజు డ్రాఫ్టింగ్ సెషన్‌తో ప్రారంభమైంది, తరువాత ఒక రౌండ్ ద్వైపాక్షిక సమావేశాలు జరిగాయి. ఆస్ట్రేలియాకు చెందిన షెర్పా డాక్టర్ ఏంజెలినా గ్రాంట్‌తో భారత జీ20 షెర్పా కాంత్ వేర్వేరుగా సమావేశమయ్యారు. ఇందులో వారు జీ20 ప్రాధాన్యతలపై భారతదేశం, ఆస్ట్రేలియా మధ్య సహకార రంగాలపై చర్చించారు.

అంతేకాకుండా జర్మన్ షెర్పా జోర్గ్ కుకిస్‌తో ద్వైపాక్షిక చర్చలు జరిపారు. ఇంధన రంగ పరివర్తన, ఎలక్ట్రిక్ వాహనాల పురోగతి, అంతర్జాతీయ ఆర్థిక నిర్మాణాన్ని సంస్కరించడం, నేటి ప్రపంచంలో స్థానిక విలువ సృష్టిని ప్రోత్సహించడంపై ఇరువురు ప్రతినిధులు ఫలవంతమైన చర్చలు జరిపారు.

ఏపీలో రూ.లక్షల కోట్లతో రహదారుల అభివృద్ధి

- మౌలిక వసతుల కల్పనతోనే ఉపాధి, ఉద్యోగ అవకాశాలు
- కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ

విశాలాంధ్ర బ్యూరో- తిరుపతి: తిరుపతికి అంతర్జాతీయ ప్రమాణాలు గల మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత నివ్వడం జరిగిందని కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. గురువారం ఉదయం స్థానిక ఎస్వీ యునివర్సిటీ స్టేడియంలో రాష్ట్రంలో కొత్తగా నిర్మించనున్న 3 జాతీయ రహదారుల శంకుస్థాపన కార్యక్రమంలో కేంద్రమంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. నెల్లూరు జిల్లా కృష్ణపట్నం పోర్టుకు కనెక్టివిటీ ప్యాకేజ్ 2,3,4 జాతీయ రహదారుల నిర్మాణానికి డిజిటల్ విధానంలో శంకుస్థాపన చేసి ప్రసంగించారు. ఆంధ్రప్రదేశ్ లో దాదాపు రూ. 2 లక్షల కోట్లతో రహదారుల అభివృద్ధి పనులు జరుగుతున్నాయని గడ్కరీ చెబుతూ... ఒక్క తిరుపతి జిల్లాలోనే రూ.17 వేల కోట్లతో పనులు జరుగుతున్నాయన్నారు. 2024 నాటికీ ఇవి పూర్తి కానున్నాయని, జిల్లా ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలని అన్నారు. ఇప్పటికే రూ.4 వేల కోట్లతో పనులు పూర్తి కాగా, మరో రూ.13 వేల కోట్లతో జరుగుతున్న కడప- రేణిగుంట, తిరుపతి- మదనపల్లి, రేణిగుంట-నాయుడుపేట 6 లేన్ రహదారులు 2025 నాటికి పూర్తవుతాయన్నారు. కృష్ణపట్నం పోర్టు సమీపంలో నాయుడుపేట- తూర్పు కనుపూరు 35 కి.మీ.లు 6 లేన్ల రహదారి (రూ.1399 కోట్లు వ్యయం), 36 కి.మీ. చిల్లకారు క్రాస్ నుండి తూర్పు కాన్పూర్ వరకు 4 లేన్ల రహదారి, తూర్పు కాన్పూర్ నుండి కృష్ణపట్నం పోర్టు

సౌత్ గేట్ 6 లేన్ల రహదారి (రూ. 909 కోట్లు వ్యయం), 16 కి.మీ. తమ్మినపట్నం నుంచి నారికెళ్లపల్లెను కలుపుతూ గ్రీన్ ఫీల్డ్ రోడ్డు 4 లేన్లు, పోర్ట్ రోడ్డు పొడిగింపు 6 లేన్ల రహదారి (రూ. 610 కోట్లు వ్యయం)కి శంకుస్థాపనలు చేయడం జరిగిందని మంత్రి తెలిపారు. కృష్ణపట్నం పోర్టుకు వేగవంతమైన కనెక్టివిటీ కోసం నేషనల్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నేషనల్ మాస్టర్ ప్లాన్ నోడ్స్. చెన్నై-బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్, నెల్లూరు వద్ద ఎస్ఈ జెడ్ పారిశ్రామిక నోడ్‌ల వల్ల అందుబాటులోకి రానున్నదని చెప్పారు. తిరుపతి ఇంటర్ మాడల్ సెంట్రల్ బస్ టర్మినల్ నిర్మాణానికి 2022 ఆగష్టు 18న ఏపీఎస్ ఆర్టీసీతో ఎంఓయు జరిగిందని, టెండర్ ఈ జులై లో పూర్తి కానున్నదని తెలిపారు. గ్రీన్ ఫీల్డ్ ఎక్స్ ప్రెస్ హై వే నిర్మాణం పై దృష్టి పెట్టామని, ఏపీలో 7 గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే ల నిర్మాణాలు చేపట్టడం జరిగిందన్నారు. ఇందులో బెంగళూరు - చెన్నై, బెతమంగల - గుడిపాల, చిత్తూరు - తచ్చురు ప్రధానంగా ఉన్నాయని తెలిపారు. ప్రస్తుతం బెంగళూరు-చెన్నై ప్రయాణ సమయం 6 నుండి 7 గంటలు వుందని, గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే పూర్తి అయితే 2.30 గంటల సమయం మాత్రమే పడుతుందని తెలిపారు. దేశంలో కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు సూరత్, చెన్నై, మనాలి, శ్రీనగర్ -జమ్ము వంటి ప్రాజెక్టులు వివిధ దశల్లో ఉన్నాయని అన్నారు. దక్షిణ ప్రాంత రాజధాని నగరాలను అనుసంధానం చేయనున్నామని గడ్కరీ వెల్లడించారు. బెంగళూరు -విజయవాడ గ్రీన్ ఫీల్డ్ ఎక్స్ ప్రెస్ హై వే ఏపీలో 5 జిల్లాల మీదుగా వెళ్లనున్నదని తెలిపారు. అత్యధికంగా పారిశ్రామిక అభివృద్ధికి ఈ రహదారులు దోహదం కానున్నాయని పేర్కొన్నారు. ఏపీలో పారిశ్రామిక అభివృద్ధికి అన్ని విధాలుగా సౌకర్యాలున్నాయన్నారు. 2014 లో తాను మంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటికి ఆంధ్రప్రదేశ్‌లో 4193 కి.మీ జాతీయ రహదారులు వుంటే, అవి 2023 నాటికి 8744 కి.మీ లకు చేరి దాదాపు రెండింతల నిర్మాణాలు జరిగాయని అన్నారు. మౌలిక సదుపాయాలతోనే నిరుద్యోగ నిర్మూలన చేయగలం అని నమ్మిన మన ప్రధాని నరేంద్ర మోదీ... నీరు, విద్యుత్, రహదారులు, కమ్యునికేషన్ వంటి వాటికి అత్యధిక ప్రాధాన్యతనిస్తున్నారని చెప్పారు. పరిశ్రమల స్థాపనకు మౌలిక సదుపాయాలు లేకుంటే పారిశ్రామిక పెట్టుబడులు రాక నిరుద్యోగ సమస్యను తీర్చలేమని అన్నారు. ఆంధ్రప్రదేశ్ కు దేశంలోనే ప్రముఖ పోర్టుగా ప్రసిద్ధి గాంచిన విశాఖపట్నం ఉందని అన్నారు. ఏపీ ప్రభుత్వం మరో 3 పోర్టుల ఏర్పాటుకు ఆసక్తి కనబరిచిందని చెప్పారు. పోర్టులు దేశాభివృద్ధికి తోడ్పతాయని గడ్కరీ అన్నారు. 2023 నాటికి 91 వివిధ ప్రాజెక్టులు 3240 కి.మీ మేర రూ.50 వేల కోట్లతో పూర్తి చేస్తున్నామని మరో రూ.75 వేల కోట్లతో చేపట్టిన 190 ప్రాజెక్టులు వివిధ దశల్లో ఉన్నాయని తెలిపారు. రూ 20 వేల కోట్లతో 25 ప్రాజెక్టులు 800 కి.మీ, రూ.50 వేల కోట్లతో 45 ప్రాజెక్టులు 1800 కి.మీ ఏర్పాటు కానున్నాయన్నారు. ప్రత్యేకంగా రూ.19 వేల కోట్లతో 430 కి.మీ పోర్టుల అనుసంధాన పనులు జరుగుతున్నాయన్నారు. తిరుపతి ఎంపీ గురుమూర్తి మాట్లాడుతూ తిరుపతి జిల్లాలో రూ.17 వేల కోట్ల తో జాతీయ రహదారుల అభివృద్ధి చేయడం సంతోషమని, అడిగిన వెంటనే కాదనకుండా సహృదయంతో మంజూరు చేస్తారన్న కేంద్రమంత్రిగా మంచి పేరు ఉన్నవారు గడ్కరీ అన్నారు. కేంద్రం మంజూరు చేసిన ప్రాజెక్టులను రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో వేగవంతంగా పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా, జిల్లా కలెక్టర్ కె వెంకటరమణారెడ్డి, ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి తదితర అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు అధిక పెన్షన్

- రూ.15 వేల నుంచి రూ.40 వేలుకు
- రవాణాశాఖ మంత్రి విశ్వరూప్ వెల్లడి

విశాలాంధ్ర బ్యూరో -అమరావతి: దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఆర్టీసీ)లో అత్యధిక పెన్షన్ విధానం అమలు కానుందని, అందుకు ఏపీఎస్ఆర్టీసీ కార్మికులు అర్హులయ్యారని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పినిపె విశ్వరూప్ వెల్లడించారు. తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం మంత్రి విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. అత్యధిక పెన్షన్ కోసం పీఎఫ్ ఫండ్ ట్రస్ట్‌కు తెలంగాణతో సహా వేరే రాష్ట్రాల సంస్థలు దరఖాస్తు (అప్‌లోడ్) చేసినా, కేవలం మన ఆర్టీసీకే ఆ అవకాశం వచ్చిందని, అందుకు ప్రధాన కారణం సీఎం జగన్ చూపిన చొరవేనని స్పష్టం చేశారు. 50వేలకు పైగా ఆర్టీసీ కార్మికులు ప్రభుత్వంలో విలీనం కాగా... వారితో పాటు 2014 తర్వాత పదవీ విరమణ అయిన దాదాపు 10,200 మంది ఉద్యోగులు, కార్మికులు అత్యధిక పెన్షన్ విధానంలో ప్రయోజనం పొందుతారని వివరించారు. దీనిపై ఆర్టీసీ కార్మికులు, ఉద్యోగులు సీఎంకు ధన్యవాదాలు తెలియజేస్తున్నారని, త్వరలో సీఎంను కలుస్తారన్నారు. ఆర్టీసీ కార్మికులు, ఉద్యోగులకు ఒక్కొక్కరికి రూ. 15 వేల నుంచి రూ. 40 వేల వరకు పెన్షన్ వస్తుందని, గతంలో వారికి కేవలం రూ.3 వేల నుంచి రూ.4 వేల పెన్షన్ మాత్రమే వచ్చేదని గుర్తుచేశారు. దీంతో ఆర్టీసీ కార్మికులు, వారి కుటుంబాలు ఎంతో సంతోషంగా ఉన్నాయని, ప్రభుత్వం ఇప్పటి వరకు ఆర్టీసీ కార్మికులకు దాదాపు రూ.10,570 కోట్ల జీతాలు చెల్లించిందన్నారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లోనూ ఆర్టీసీ మూలధనాన్ని ముట్టుకోక పోవడం వల్ల, సంస్థ మనుగడ కొనసాగిస్తోందని వివరించారు. సీఎం జగన్ తన సుదీర్ఘ పాదయాత్రలో ఇచ్చిన మాట నిలబెట్టుకుంటూ, ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేశారని మంత్రి గుర్తుచేశారు. ఈ నాలుగేళ్లలో ఆర్టీసీ ఎంతో పురోగతి సాధించిందని, పదవీ విరమణ వయస్సు 58 ఏళ్ల నుంచి 60 ఏళ్లకు పెంచామని, వారికి కూడా ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా పీఆర్సీ అమలు చేస్తున్నామని, కారుణ్య నియామకాలు చేపడుతున్నామని వివరించారు. కొత్తగా 1500 డీజిల్ బస్సులు, 1000 విద్యుత్ బస్సులు కొనుగోలు చేస్తున్నామని, ప్రతి ఉద్యోగికి రూ. 40 లక్షల ప్రమాద బీమా, రూ.5లక్షల సహజ మరణ బీమా సదుపాయం కల్పిస్తున్నామని చెప్పారు. రవాణా శాఖ చెక్‌పోస్టుల్లో ఎక్కడా అవినీతి లేదన్నారు. 55 ఏళ్లకు పైబడిన డ్రైవర్లకు వేరే బాధ్యతలు అప్పగించే విధంగా చూడాలని సీఎంగారిని కోరాలని నిర్ణయించామన్నారు. విలేకరులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిస్తూ, వలంటీర్ల సేవలు గణనీయమని, వారిపై విషం చిమ్ముతూ దుష్ప్రచారం చేయడాన్ని తప్పుపట్టారు.

క్రమశిక్షణ పేరుతో తొలగింపు తగదు

జేవీ సత్యనారాయణమూర్తి

విశాలాంధ్ర - పెదగంట్యాడ: క్రమశిక్షణ పేరుతో ఉద్యోగుల తొలగింపు సరైంది కాదని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి అన్నారు. తమ సమస్యలపై గంగవరం పోర్టు కార్మికులు చేపడుతున్న నిరవధిక నిరసన దీక్షలు గురువారం 10వ రోజుకు చేరుకున్నాయి. దీక్షా శిబిరాన్ని ఉద్దేశించి సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ, గంగవరం పోర్టు కార్మికులు కనీస వేతనం కోసం గత 10 రోజులుగా ఆందోళన చేస్తున్నా అదానీ గంగవరం పోర్టు యాజమాన్యం స్పందించక పోవడం దుర్మార్గమని అన్నారు. కార్మికులకు చట్ట ప్రకారం రావలసిన వేతనాలను అమలు చేయాల్సిన బాధ్యత పోర్టు యాజమాన్యం పైన ఉందన్నారు. గంగవరం పోర్టు నిర్మాణం కోసం భూములు ఇచ్చిన నిర్వాసితులను మోసం చేయడం భావ్యం కాదన్నారు .గంగవరం పోర్టు కార్మికులు ఉద్యమానికి సీపీఐ అండగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమం లో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, గాజువాక నియోజక వర్గం కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ, పల్లేటీ పోలయ్య, జి.ఆనంద్, వై.నందన్న, కరకు పోతయ్య, పల్లెటీ అప్పారావు, మహిళా నేతలు ఏ.విమల, బేగం, న్యాయవాది ఘంటా మోహన్ రావు, ప్రొఫెసర్ సూరప్పడు, పులి వెంకట రమణా రెడ్డి పాల్గొన్నారు.

మోదీ, జగన్ ప్రభుత్వాలను తరిమికొడదాం

- సీపీఐ బస్సుయాత్రను విజయవంతం చేద్దాం
- హరినాథరెడ్డి, జగదీశ్

విశాలాంధ్ర- తిరుపతి: ప్రధాని నరేంద్ర మోదీ దేశాన్ని దారిద్ర్యంలోకి నెడితే... మన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆంధ్రప్రదేశ్‌ను అప్పులపాలు చేశారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పి.హరినాథరెడ్డి. డి.జగదీశ్ విమర్శించారు. తిరుపతి బైరాగిపట్టెడ సీపీఐ కార్యాలయంలో పార్టీ జిల్లా కార్యవర్గ సమావేశం సీహెచ్ ప్రభాకర్ అధ్యక్షతన గురువారం జరిగింది.

హరినాథరెడ్డి మాట్లాడుతూ మోదీ అరాచక పాలన, జగన్ అప్పుల పాలన నుండి ప్రజల్ని విముక్తి చేయాలనే సంకల్పంతో సీపీఐ రాష్ట్రవ్యాప్త ఆందోళనకు శ్రీకారం చుట్టిందన్నారు. ఆగస్టు 16 నుండి సెప్టెంబరు 6 వరకు 'రాష్ట్రాన్ని రక్షించుకుందాం-దేశాన్ని కాపాడుకుందాం' అనే నినాదంతో బస్సుయాత్ర నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. బస్సుయాత్ర విశాఖపట్నంలోని ఉక్కు పరిశ్రమ దీక్షా శిబిరం వద్ద ప్రారంభమై తిరుపతిలో భారీ బహిరంగ సభతో ముగుస్తుందని వివరించారు. సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా బస్సుయాత్ర ప్రారంభిస్తారని, సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ, రాజ్యసభసభ్యుడు వినయ్ విశ్వం పాల్గొంటారని చెప్పారు. త్యాగాలతో సాధించుకున్న విశాఖ ఉక్కును ప్రైవేటీకరించవద్దని 700 రోజులుగా కార్మికులు నిరాహార దీక్ష చేస్తున్నా...సీఎం జగన్ పట్టించుకోలేదని, కనీసం శిబిరాన్ని సందర్శించి కార్మికులకు సంఘీభావం తెలపలేదని హరినాథరెడ్డి విమర్శించారు. పాలన ఇలాగే కొనసాగితే రాష్ట్రం అధోగతి పాలవుతుందని హెచ్చరించారు. నీటి ప్రాజెక్టులు లేకపోవడం వల్ల రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాల నుంచి వలసలు పెరిగిపోయాయన్నారు. వలసలు ఆగాలంటే సత్వరమే నీటి ప్రాజెక్టులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 6న తిరుపతిలో జరిగే భారీ బహిరంగసభ జయప్రదానికి కార్యవర్గసభ్యులు శక్తి వంచన లేకుండా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.

జగదీశ్ మాట్లాడుతూ ప్రధాని మోదీ 9 ఏళ్లలో 100 లక్షల కోట్ల అప్పు చేశారని విమర్శించారు. దేశాన్ని దారిద్ర్యంలోకి నెట్టారన్నారు. 2014లో ఇచ్చిన ఒక్క హామీని మోదీ అమలు చేయలేదని, పైగా ప్రభుత్వ రంగాన్ని నిర్వీర్యం చేస్తున్నారని మండిపడ్డారు. లాభాల బాటలో నడుస్తున్న ఎల్ఐసీ, బీఎస్ఎన్ఎల్, పోస్టల్ తదితర ప్రభుత్వ రంగ సంస్థలను తన కార్పొరేట్ మిత్రులకు కట్టబెడుతున్నారన్నారు. విభజన రాజకీయాల ద్వారా లౌకిక విధానాన్ని మంటగలుపుతున్నారన్నారు. మోదీ నియంతృత్వ పాలన నుండి దేశాన్ని కాపాడుకోవాలన్నారు. జగన్ అనుభవరాహిత్య పాలనతో రాష్ట్రాన్ని దివాలా తీయించారని, రానున్న రోజుల్లో ప్రభుత్వాన్ని నడిపే పరిస్థితి కనిపించడం లేదన్నారు. రాష్ట్రానికి కొత్త పరిశ్రమలు తీసుకురాలేకపోగా...ఉన్న పరిశ్రమలను తరిమేస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి, జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

అంతా మాఫియామయం

సీపీఐ బస్సుయాత్రను జయప్రదం చేయండి: ఈశ్వరయ్య

విశాలాంధ్ర-మదనపల్లి: భారత కమ్యూనిస్టు పార్టీ అధ్వర్యంలో ఆగస్టు 16 నుంచి సెప్టెంబర్ 6వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా జరిగే బస్సు యాత్రను జయప్రదం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జి.ఈశ్వరయ్య కోరారు. మదనపల్లి రెడ్డి భవన్‌లో సీపీఐ నాయకులతో కలిసి ఈశ్వరయ్య విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈశ్వరయ్య మాట్లాడుతూ జగన్ ప్రభుత్వ వైఫల్యాలపై విరుచుకుపడ్డారు. హామీల అమలులో విఫలమైన జగన్ ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధిని గాలికొ వదిలేసిందని ఆరోపించారు. జగన్ ప్రభుత్వ కబంధ హస్తాల నుంచి కాపాడాల్సిందిగా ప్రజలు కోరుతున్నారని చెప్పారు. ఇసుక, భూమి, మద్యం, గనులు, బియ్యం మాఫియా ఆగడాలు పెరిగాయని మండిపడ్డారు. ఎక్కడ ఖాళీ భూములు కనిపించినా వైసీపీ నాయకులు ఆక్రమించుకుంటున్నారన్నారు. రాష్ట్రంలో రౌడీయిజం పెరిగిందని, భూకబ్జాలు, హత్యలకు అంతం కనిపించడం లేదని ఈశ్వరయ్య ఆరోపించారు. విభజన హామీలు సాధించడంలో సీఎం జగన్ విఫలమయ్యారని, 25 మంది ఎంపీలను గెలిపిస్తే కేంద్రం మెడలు వంచుతానని ప్రగల్భాలు పలికారని చెప్పారు. కడప స్టీల్ ప్లాంట్‌కు ప్రారంభోత్సవాలు తప్ప పనులు ప్రారంభించడం లేదన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత పాలన పడకేసిందని, శాంతి భద్రతలు క్షీణించాయన్నారు. దళితులపైనా, మైనారిటీలపైనా దాడులు పెరిగాయని, ప్రభుత్వమే దాడులను ప్రోత్సహిస్తున్నదని విమర్శించారు. జగన్ హయాంలో కడప-బెంగళూరు రైల్వేలైన్ పడకేసిందన్నారు. మదనపల్లి ప్రాంతంలో పరిశ్రమల హామీ గాలికిపోయిందన్నారు. జగన్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిందని, అభివృద్ధి కనిపించడం లేదన్నారు. మోదీ ప్రభుత్వం సైతం దీనికన్నా భిన్నమైందేమీ కాదన్నారు. మతోన్మాదాన్ని పెంచి పోషించడం, రాజ్యాంగానికి, లౌకిక విలువలకు తూట్లు పొడవడం, కులాలు, మతాల మధ్య విభేధాలు సృష్టించి... రాజకీయ లబ్ధి పొందటం పనిగా పెట్టుకున్నదని విమర్శించారు. మోదీ రక్తపు చేతుల నుండి భారతదేశాన్ని కాపాడాల్సిన అవసరం ఉందన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు, సహాయ కార్యదర్శి మహేశ్, జిల్లా కార్యవర్గ సభ్యులు కృష్ణప్ప, సాంబశివ, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సురేశ్ కుమార్, ప్రజానాట్య మండలి నాయకులు బుల్లెట్ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

అనంతపురంలో 21న రజక వృత్తిదారుల రాష్ట్ర సదస్సు

జయప్రదానికి రామాంజనేయులు పిలుపు



విశాలాంధ్ర-విజయవాడ: వృత్తి రక్షణ, సామాజిక భద్రత, సంక్షేమమే లక్ష్యంగా జులై 21న అనంతపురంలో జరిగే రజక వృత్తిదారుల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని చేతివృత్తి దారుల సమాఖ్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె రామాంజనేయులు పిలుపు నిచ్చారు. ఆహ్వానసంఘం ముద్రించిన రాష్ట్ర సదస్సు కరపత్రాలను గురువారం ఇక్కడి దాసరి భవన్‌లో ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ సమాజంలో శ్రమ విభజన జరిగిన నాటి నుంచి తరతరాలుగా ఎంతో వృత్తి నైపుణ్యంతో బట్టలు ఉతుకుతూ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతున్నారన్నారు. సమాజానికి సేవలందిస్తున్న రజక వృత్తిదారులు అగ్రవర్ణాల వారి నుండి చిన్న చూపుకు గురవుతూ అనేక అవమానాలను, సామాజిక వివక్షతను దళితుల తర్వాత ఆ స్థాయిలో ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రజకులకు రక్షణ కరువైందని, సొంత భూమి లేని రజకులు శారీరక శ్రమకు పరిమతమై వృత్తిని కొనసాగిస్తూ అక్షరాస్యతకు నోచుకోక అభివృద్ధికి ఆమడ దూరంలో జీవిస్తున్నారని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర పాలకులు అధికారంలోకి రావడానికి రజక వృత్తిదారుల జీవితాల్లో మార్పులు తెస్తామని అనేక వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిన తర్వాత విస్మరిస్తున్నారని విమర్శించారు. గతంలో బీసీ కార్పొరేషన్‌ల ద్వారా సబ్సిడీ రుణాలు పొంది తమ వృత్తిని కొనసాగిస్తున్న రజకులకు ముఖ్యమంత్రి జగన్ ప్రకటించిన ఉచిత పథకాలు అందరికి అందకపోగా ఆయన ఏర్పాటు చేసిన కుల వృత్తుల కార్పొరేషన్ లకు నిధులు లేక వృత్తి దారులను ఆదుకోలేక ఘోరంగా వైఫల్యం చెందిందన్నారు. జనాభా ప్రాతిపదికన రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలని, రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని, వారిపై జరిగే దాడులను అరికట్టి సామాజిక భద్రత చట్టాన్ని తీసుకొని రావాలని డిమాండ్ చేశారు. అనంతపురం లో జరిగే రాష్ట్ర సదస్సులో రజకుల సమస్యలను చర్చించి భవిష్యత్తు కార్యాచరణను రూపొందిస్తామని చెప్పారు. సదస్సుకు రాష్ట్ర నలుమూలల నుంచి అధిక సంఖ్యలో రజకులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఉమ్మడి కృష్ణాజిల్లా ప్రధాన కార్యదర్శి బి.వెంకట్రావు మాట్లాడుతూ ఈ సదస్సులో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, మాజీ ఎమ్మెల్సీ పీజే చంద్రశేఖరరావు, అఖిల భారత మత్స్య కార్మిక సమాఖ్య జాతీయ అధ్యక్షులు జేవీ. సత్యనారాయణ మూర్తి, చేనేత కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి జింకా చలపతి, సామాజిక హక్కుల వేదిక రాష్ట్ర నాయకులు డి.జగదీశ్, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దోనేపూడి శంకర్, సీపీఐ అనంతపురం జిల్లా కార్యదర్శి సి.జాఫర్ తదితరులు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ శ్రామిక మహిళా ఫోరం (ఏఐటీయూసీ)రాష్ట్ర కార్యదర్శి కల్లేపల్లి శైలజ, రజక సంఘం నాయకులు శ్రీనివాస్ రావు పాల్గొన్నారు.

విశాఖలో వైసీపీకి ఎదురుదెబ్బ

పంచకర్ల రమేశ్‌బాబు రాజీనామా

విశాలాంధ్ర బ్యూరో -విశాఖపట్నం: ఎన్నికలకు ముందు విశాఖలో వైసీపీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. వైసీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు పార్టీకి గుడ్ బై చెప్పారు. తన రాజీనామాపై గురువారం ఉదయం ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పంచకర్ల రమేశ్‌బాబు మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలకు న్యాయం చేయలేకపోయానని, క్షమించాలని వేడుకున్నారు. జిల్లా పార్టీ అధ్యక్ష పదవికి, పార్టీకి రాజీనామా చేస్తున్నానని ప్రకటించారు. ఏడాదిగా ఎన్నో సమస్యలను సీఎం జగన్ దృష్టికి తీసుకెళ్లడానికి ప్రయత్నించానని, కానీ వీలు కాలేదన్నారు. ప్రజా సమస్యలు పరిష్కరించ లేనప్పుడు పదవిలో ఉండటం సమంజసం కాదన్నారు. అధ్యక్షుడిగా పనిచేయడానికి స్వేచ్ఛ లేదని, సామాజిక వర్గాల

వారీ సమావేశాలకు అనుమతివ్వ లేదని ఆరోపించారు. పార్టీ ఉత్తరాంధ్ర ఇన్‌చార్జి వైవీ సుబ్బారెడ్డితో తనకు ఎలాంటి విభేదాలు లేవన్నారు. తన అనుచరులతో సమావేశమై భవిష్యత్తు కార్యాచరణ నిర్ణయించుకుంటానని రమేశ్‌బాబు తెలిపారు. ఎమ్మెల్యే అదీప్‌రాజుకు అనుకూలంగా వైవీ సుబ్బారెడ్డి మాట్లాడినందుకే రాజీనామా చేశారా అని మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా... అలాంటిదేమీ లేదని చెప్పారు. టికెట్‌కు సంబంధించి వైవీ సుబ్బారెడ్డిది తుది నిర్ణయం కాదని, ఓ ప్రాంతంలో మాట్లాడుతు న్నప్పుడు స్థానిక శాసనసభ్యులకు అనుకూలంగా మాట్లాడటం రాజకీయ సంప్రదాయమన్నారు. తన 20 ఏళ్ల రాజకీయ జీవితంలో వివాదాలకు తావు లేకుండా పనిచేశానని చెప్పారు. కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో పార్టీలు మారాల్సి వచ్చిందని వివరించారు. కాగా, పంచకర్ల రమేశ్‌బాబు తెలుగుదేశం పార్టీలో చేరతారా... జనసేన గూటికి వెళతారా అన్నది చర్చనీయాంశమైంది. కార్యకర్తలు, ఇతర శ్రేణులతో చర్చించిన మేరకు రెండు, మూడు రోజుల్లో నిర్ణయం తీసుకుంటానని పంచకర్ల చెప్పారు. పెందుర్తి టికెట్‌ను రమేశ్‌బాబు ఆశిస్తున్నారు. పెందుర్తి టికెట్‌ను మళ్లీ ఎమ్మెల్యే అదీప్‌రాజుకు ఇస్తామని వైవీ సుబ్బారెడ్డి ప్రకటించడంతో రమేశ్‌బాబు పార్టీ మారినట్లు వైసీపీ వర్గాలు ప్రచారం చేస్తున్నాయి. రమేశ్‌బాబు 2009లో ప్రజారాజ్యం పార్టీ ద్వారా రాజకీయ ప్రవేశం చేశారు. ప్రజారాజ్యం తరపున పెందుర్తి నియోజకవర్గంలో పోటీ చేసి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. తర్వాత ప్రజారాజ్యం కాంగ్రెస్‌లో విలీనమైంది. ఇక రాష్ట్ర విభజన అనంతరం రమేశ్‌బాబు కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి...2014 ఎన్నికల సమయంలో గంటా శ్రీనివాస్, అవంతి శ్రీనివాస్‌తో పాటు టీడీపీలో చేరారు. 2014 ఎన్నికల్లో టీడీపీ తరుపున ఎలమంచిలి నుంచి పోటీ చేసి గెలుపొందారు. 2020 ఆగస్ట్‌లో టీడీపీని వీడి వైసీపీలో చేరారు.

అన్నింటా వైసీపీ ప్రభుత్వ ఘోర వైఫల్యం

బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురంధేశ్వరి

విశాలాంధ్ర- విజయవాడ: రాష్ట్రం బాగుకు నాలుగేళ్లుగా వైసీపీ ప్రభుత్వం చేసిందేమీ లేదని, ఘోరంగా వైఫల్యం చెందిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి విమర్శించారు. సమస్యలు పరిష్కరించక, అభివృద్ధి చేయక, ఉపాధి అవకాశాలు కల్పించక, మద్యం, ఇసుక ద్వారా దోపిడికి తెరతీసిందని, పేదరికాన్ని మరింత పెంచిందని ఆమె అన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలిగా విజయవాడలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో గురువారం ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వ అస్తవ్యస్త విధానాల వల్ల విలువైన ప్రజాధనంతో పాటు సమయం కూడా వృథా అవుతూ పోలవరం పథకం లక్ష్యం నెరవేరడం లేదన్నారు. అరాచకాన్ని ప్రోత్సహించడంతో సమాజంలో శాంతి భద్రతలు క్షీణించాయని ధ్వజమెత్తారు. 2024 ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ గెలుపే లక్ష్యంగా వైసీపీ వైఫల్యాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లి పనిచేయాలని నాయకులు, కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. పీఎం ఆవాస్ యోజన ఇళ్ల నిర్మాణ జాప్యంపై వైసీపీ ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలని పురంధేశ్వరి డిమాండ్ చేశారు. కేంద్రం దేశంలో పేదల కోసం 4 కోట్ల ఇళ్లను నిర్మించతలిస్తే అందులో ఆంధ్రప్రదేశ్‌కు 22 లక్షల ఇళ్లను కేటాయించిందని, ఇప్పటి వరకు 65 శాతం నిర్మాణం పూర్తికావాల్సి ఉండగా 35 శాతం కూడా నిర్మాణం కాలేదన్నారు. రాష్ట్రంలో అయిదేళ్లుగా ధ్వంసమైన రోడ్లను వైసీపీ ప్రభుత్వం పునర్నిర్మించుకోలేని పరిస్థితిల్లో ఉందని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో పరిశ్రమల ప్రోత్సాహానికి ఎలాంటి చర్యలు తీసుకోకపోగా ఉన్నవాటిని కూడా తరలిపోయేలా కక్ష సాధింపు చర్యలకు పాల్పడిందని ఆమె విమర్శించారు. అమర్‌రాజా, లులూ వంటి ఎన్నో సంస్థలు మన రాష్ట్రం నుంచి తరలివెళ్లి ఇతర రాష్ట్రాల్లో పెట్టుబడులు పెడుతున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం సహకరిస్తున్నా రాష్ట్రం అందిపుచ్చుకోవడంలో వైఫల్యం చెందిందన్నారు. రాష్ట్రానికి పోలవరం ప్రాజెక్టును పూర్తిచేసే సామర్థ్యం లేకపోతే ఆ ప్రాజెక్టును కేంద్రానికి అప్పగించాలని ఆమె సూచించారు. నాణ్యతలేని మద్యాన్ని రెట్టింపు ధరలకు విక్రయిస్తూ పేదలను దోపిడి చేయడమేనా మద్య నిషేధ హామీ అని ప్రశ్నించారు. ఇసుక ధర విపరీతంగా పెరగడంతో నిర్మాణరంగం కుదేలై లక్షలాది మంది నిర్మాణ కార్మికులు రోడ్డున పడ్డారని ఆమె అన్నారు. పార్టీలు చేసిన దుష్ప్రచారంతో కేంద్రం రాష్ట్రానికి సహకరించడంలేదనే భావన ఏర్పడిందని ఆది పూర్తిగా అవాస్తవం అన్నారు. పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని, కార్యకర్తలను కలుపుకుంటూ ముందుకెళ్తానని చెప్పారు. ఇప్పటి వరకు పనిచేసిన అధ్యక్షుల సలహాలు, మార్గదర్శకత్వంతో ముందుకెళతానని తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర బీజేపీ మాజీ అధ్యక్షులు సోము వీర్రాజు, రాజ్యసభ సభ్యులు జీవీఎల్ నరసింహారావు, సీఎం రమేష్, మాజీ ముఖ్యమంత్రి, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి కిరణ్‌కుమార్‌రెడ్డి, జాతీయ కార్యదర్శి సత్యకుమార్, మాజీ ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి పాల్గొన్నారు.

మావోయిస్టు సీనియర్ నేత లొంగుబాటు

విశాలాంధ్ర బ్యూరో- పాడేరు: సీపీఐ (మావోయిస్టు) డివిజన్ కమిటీ సభ్యుడు, గుత్తికోయ తెగకు చెందిన దేవ భగత్ పోలీసులకు లొంగిపోయారు. పాడేరు జిల్లా పోలీస్ కార్యాలయంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో భగత్‌ను మీడియా ముందు ప్రవేశపెట్టారు. జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా మాట్లాడుతూ మడకం దేవ భగత్ పీఎల్ ఏ బెటాలియన్ 2వ కంపెనీ 2వ ప్లాటూన్ కమాండర్ అయిన సుక్మా జిల్లా చింతగుప్ప పోలీస్ స్టేషన్ పరిధిలోని దబ్బకుంట గ్రామానికి చెందిన వారన్నారు. గత 17 సంవత్సరాలు మావోయిస్టు పార్టీలో పనిచేశారన్నారు. ఆయన మీద రూ.5 లక్షల రివార్డ్ ఉందని చెప్పారు. లొంగిపోయిన వారి పునరావాస విధానం ప్రకారం లొంగిపోయిన తర్వాత ప్రశాంత జీవితాన్ని గడపడానికి మడకం దేవభగత్‌కు మొత్తం 5 లక్షల రివార్డ్‌ను, అర్హత ఉన్న అన్ని ఇతర సౌకర్యాలు అందిస్తామన్నారు. భగత్ 2004 సంవత్సరంలో 6వ తరగతి చదువుతున్నప్పుడు మావోయిస్టు పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షితులై పార్టీలో చేరారు. 2005 సంవత్సరంలో కుంట దోర్నపాల్ ఎసీ ఇన్చార్జ్ విజయ్ వద్దా గన్‌మాన్‌గా పనిచేశారు. మావోయిస్టు పార్టీలో వివిధ హోదాల్లో పనిచేసిన అనంతరం 2018 బెటాలియన్‌లో 2వ కంపెనీకి 2వ ప్లాటూన్ కమాండర్‌గా నియమితులయ్యారని ఎస్పీ తెలిపారు. అనేక నేరాలతో ఆయనకు సంబంధముందన్నారు. మావోయిస్టు పార్టీ విధానాలతో విసిగిపోయి భగత్ లొంగిపోయినట్టు ఎస్పీ చెప్పారు. మావోయిస్టు ప్రాబల్యం తగ్గడం, పోలీస్ పహారా పెరగడంతో పాటు ప్రాణభయం కారణంగా లొంగి పోయారన్నారు.

సంపాదకీయం

మోదీ సర్కారుకు కళ్లెం వేయని సుప్రీం తీర్పు

కేంద్రప్రభుత్వ అధీనంలోఉన్న వ్యవస్థలను వినియోగించుకుని రాజకీయ ప్రత్యర్థులను వేధించాలనుకుంటే తమ చెప్పుచేతల్లో ఉండే అధికారులు కూడా కావాలి. గత అయిదేళ్ల నుంచి ఎన్‌ఫోర్స్‌మెంటు డైరెక్టొరేట్ లో డైరెక్టర్‌గా ఉన్న సంజయ్ కుమార్ మిశ్రా మోదీ ప్రభుత్వం చెప్పినట్టల్లా చేశారు. అందుకే ఆయన పదవీ కాలాన్ని మరోసారి పొడిగించి ఈ ఏడాది నవంబర్ దాకా కొనసాగించాలని తలిస్తే సుప్రీంకోర్టు అలాంటి ఆదేశాలు చెల్లవని మంగళవారం ఆదేశించి ప్రభుత్వ ఆలోచన మీద నీళ్లు చల్లింది. సంజయ్ కుమార్ మిశ్రాను కొనసాగించడానికి కేంద్ర ప్రభుత్వం వినిపించిన వాదనలను సుప్రీంకోర్టు అంగీకరించలేదు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ పదవిలో ఎవరూ ఉండకూడదని సుప్రీంకోర్టు చెప్పలేదు. కానీ మిశ్రానే కొనసాగించవలసిన అవసరం ఏమిటి అని నిలదీసింది. ఈ పదవికి అర్హులైన వారు మరెవరూ లేరా అని ప్రశ్నించింది. మిశ్రా పదవీ కాలాన్ని పొడిగించడం చట్ట విరుద్ధం అని సుప్రీంకోర్టు స్పష్టంగాచెప్పింది. ఆయనను ఈ నెలాఖరులోగా రాజీనామా చేయాలని ఆదేశించింది. అయితే కేంద్ర నిఘాకమిషన్ అధికారాలను పెంచడాన్ని మాత్రం సుప్రీంకోర్టు తప్పు పట్టలేదు. ఒక అధికారి సమర్థుడు అని అనుకున్నప్పుడు, ఆయన ప్రారంభించిన మంచిపని కొనసాగడానికి ఆ వ్యక్తే పదవిలో ఉండడం మేలని ప్రభుత్వం భావించినప్పుడు ఒక సంవత్సరం పొడిగించడం ఆనవాయితీ. అవసరం అనుకుంటే మరో సంవత్సరం పొడిగించిన సందర్భాలూ ఉన్నాయి. కానీ ఈ సంప్రదాయాలను జవదాటి మోదీ ప్రభుత్వం సంజయ్ మిశ్రా పదవీ కాలాన్ని మరో ఏడాది పొడిగించడం విచిత్రంగా ఉంది. రాజకీయ ప్రత్యర్థులను వేధించాలనుకునే ప్రభుత్వానికి తాము చెప్పినట్టు వినే అధికారులే ఉండాలి. మిశ్రా విషయంలో ఇదే జరిగింది. కానీ సుప్రీంకోర్టు అడ్డుకుని చట్టబద్ధంగా వ్యవహరించక తప్పని పరిస్థితి కల్పించింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టొరేట్ డైరెక్టర్ పదవీ కాలాన్ని పొడిగించడాన్ని సవాలు చేసిన పిటిషన్లలో పసలేదని అందువల్ల ఈ పిటిషన్లను తోసి పుచ్చాలని కేంద్ర ప్రభుత్వం వాదించింది. ఈ పొడిగింపును సవాలు చేసిన వారికి స్వార్థ ప్రయోజనాలున్నాయని, ఇందులో ప్రజా ప్రయోజనం ఏమీలేదని కూడా వాదించి ప్రభుత్వం ఈ అంశానికి రాజకీయ రంగు పులిమింది. ఈ వితండవాదాన్ని సుప్రీంకోర్టు ఖాతరు చేయకపోవడం గమనించవలసిన అంశం. అధికార పార్టీకి ప్రత్యర్థులైన వారిని వేధించే అధికారులకు ఇష్టానుసారంగా పొడిగింపులు ఇవ్వడాన్ని ప్రతిపక్షాలు తప్పు పట్టడంలో అనౌచిత్యం ఏమీ లేదు. రాజకీయ నాయకులను, పౌరసమాజానికి చెందిన వారిని వేధించడానికి సంజయ్ మిశ్రాను మోదీ సర్కారు వాటంగా వినియోగించుకుంది. ఇది పూర్తిగా అధికార దుర్వినియోగం అన్న పిటిషనర్ల వాదనను పరిశీలించిన సుప్రీంకోర్టు తన పరిభాషలో చట్టవిరుద్ధం అని తేల్చింది.

తమ అధీనంలో ఉన్న కేంద్ర దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేసి వేధింపులకు పాల్పడడం బీజేపీ నాయకులు పన్నిన పక్కా వ్యూహం. మిశ్రా పదవీ కాలాన్ని పొడిగించడం చెల్లదని సుప్రీంకోర్టు చెప్పినందుకు అమితానందపడిపోతున్న వారు భ్రమలో ఉన్నారని అమిత్ షా వ్యాఖ్యానించారు. పార్లమెంటు ఆమోదించిన కేంద్ర నిఘా కమిషనర్ చట్టాన్ని అత్యున్నత న్యాయస్థానం సమర్థించిందని షా గుర్తు చేశారు. దీన్ని షా తనకు అనుకూలంగా మలుచుకుని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టొరేట్ అవినీతిపరుల మీద దాడులు కొనసాగిస్తుందని తేల్చి చెప్పారు. ఎవరు డైరెక్టర్‌గా ఉన్నారన్నది ప్రధానం కాదని అమిత్ షా అన్నారు. ఆ పదవిలో ఎవరున్నా అవినీతిపరులైన ఆనువంశిక పాలనకోసం పరితపించే వారిపైన కొరడా ఝుళిపిస్తూనే ఉంటుందని అమిత్ షా చేసిన వ్యాఖ్యలను ప్రత్యేకంగా గమనించాలి. అవినీతిని కట్టడి చేయడాన్ని ఎవరూ వ్యతిరేకించడం లేదు. కానీ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టొరేట్‌తో సహా ఇతర దర్యాప్తు సంస్థలను మోదీ ప్రభుత్వం దుర్వినియోగం చేస్తోందన్నదే ముఖ్యమైన అంశం. దీన్ని కట్టడి చేయడానికి సుప్రీంకోర్టు తీర్పు ఏ రకంగానూ ఉపకరించదు. అనువంశిక పాలనకు, అవినీతికి, దానిని కట్టడి చేస్తుందంటున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టొరేట్ కు సంబంధం ఏమిటో మాత్రం అమిత్ షా వివరించలేదు. సుప్రీంకోర్టు తీర్పును కూడా రాజకీయ ప్రయోజనాలకు వినియోగించే ఆత్రుత మాత్రం స్పష్టంగా కనిపిస్తోంది. పైగా ఆనువంశిక పాలకులు అభివృద్ధికి వ్యతిరేకులని కూడా కేంద్ర హోం మంత్రి వక్రభాష్యం చెప్తున్నారు. తమ ప్రభుత్వం తీసుకున్న చర్యను సుప్రీంకోర్టు తోసిపుచ్చిందన్న వాస్తవాన్ని కప్పి పుచ్చడానికి అమిత్ షా ఇలాంటి కువ్యాఖ్యానాలకు పాల్పడుతున్నారు. అత్యున్నత న్యాయస్థానం తీర్పు కేంద్ర ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టిందని షా ఎలాగూ అంగీకరించరు. సుప్రీంకోర్టు సంజయ్ మిశ్రా పదవీ కాలాన్ని చట్ట వ్యతిరేకంగా పొడిగిస్తూ పోవడాన్ని తప్పు పట్టడం అమిత్ షా లాంటి వారికి అంతరాంతరాల్లో ఆగ్రహం కలిగించక తప్పదు. ఎన్‌ఫోర్స్ మెంట్ డైరెక్టొరేట్ కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ పరిధిలోకి వస్తుంది. కానీ ఆ శాఖ మంత్రి ప్రస్తావించకుండా హోం మంత్రి భాష్యాలు చెప్తుంటారు. ఈ తీర్పు ప్రకంపనలు ఏ మేరకు వ్యాపించాయో తెలుసుకోవడానికి అమిత్ షా వ్యాఖ్యల్ని గమనించాలి. అయితే తీర్పులో అత్యున్నత న్యాయస్థానం ఈ విషయాన్ని ఎక్కడా ప్రస్తావించలేదు. తీర్పులోని న్యాయపరమైన అంశాలు ఎంత ముఖ్యమైనవో దాని పర్యవసానాలు కూడా అంతే ప్రధానమైనవి.

సుప్రీంకోర్టు తీర్పువల్ల తమ అధీనంలోని దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేసి రాజకీయ ప్రత్యర్థుల మీద కసితీర్చుకునే మోదీ ప్రభుత్వం ధోరణి మారదు అని అమిత్ షా వ్యాఖ్యలవల్ల తేలిపోతోంది. మోదీ ప్రభుత్వ బాధల్లా కొత్తగా ఎన్‌ఫోర్స్ మెంట్ డైరెక్టర్ అయ్యే వ్యక్తి సంజయ్ మిశ్రా లాగా తమకు అనుకూలంగా వ్యవహరిస్తారో లేదో అన్న భయం కూడా ప్రభుత్వాన్ని పీడిస్తోంది. కొత్తగా బాధ్యతలు చేపట్టబోయే అధికారి సుప్రీంకోర్టు తీర్పు అంతస్సారాన్ని, మోదీ వ్యతిరేకంగా వీస్తున్న గాలిని గమనించకుండా ఉండేంత అమాయకుడిగా మెలగక పోవచ్చు. అదీ మోదీ షా అక్కసు. సుప్రీం కోర్టు తీర్పు మిశ్రా పదవీకాలాన్ని పొడిగించడం చట్టవ్యతిరేకం అని చెప్పిందే తప్ప అలాంటి చట్ట వ్యతిరేక పనులకు పాల్పడ్డ కేంద్ర ప్రభుత్వం మీద ఎలాంటి వ్యాఖ్యలూ చేయలేదు. బిహార్ దాణా కుంభకోణం కేసులో పశుసంవర్ధక శాఖ అధికారి ఎస్.బి.సిన్హా పదవీ కాలాన్ని పొడిగించడాన్ని పట్నా హైకోర్టు తప్పు పట్టడమే కాక ఈ విషయంలో లాలూ ప్రసాద్ యాదవ్‌కు శిక్ష కూడా విధించింది. ప్రభుత్వ అక్రమ చర్యలను కట్టడి చేయడానికి సుప్రీంకోర్టు ఎలాంటి ఆదేశాలూ జారీ చేయలేదు. కనక చట్ట వ్యతిరేకంగా పనిచేయడానికి అలవాటు పడ్డ మోదీ సర్కారు అదే దుర్నీతిని అనుసరించకుండా ఉండదుగదా!

ఉంటే హిందువులా ఉండు పోతే నీ దేశం పోరా!

ఉంటే ఈ ఊళ్లో ఉండు, పోతే నీ దేశం పోరా చుట్టుపక్కల ఉన్నావంటే మనసు ఆగదురా. అబ్బో ఏంటి బావ ఈరోజు పాత సినిమా పాట పాడుతున్నావ్. దాంతోపాటు ఈలవేస్తున్నావు. ఏంటి ఈ హుషారుకు కారణం. చెబుతా ముందు కాస్త కాఫీతో గొంతు తడిపి ఆ

తరువాత చెబుతా. పాడి పాడి గొంతు ఆరిపోయిందనుకో. అంత అవసరం ఏమొచ్చిందయ్యా. వచ్చింది నాకు కాదు దేశంలో అతిపెద్ద రాష్ట్రమైన ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రికి. అయినా మన మనసు కవి ఆత్రేయ దూరదృష్టి బహు గొప్పది. ఏనాడో ప్రేమనగర్ సినిమాలోనె మన యోగి ఆదిత్యనాథ్ మనసు గ్రహించాడయ్యా. అందుకె ఆ పాట రాశాడు. ఆయన రాసినట్టుగానె మన యోగి ఆ పల్లవి అందుకున్నాడు. యోగి ఏమన్నాడయ్యా. అదె నీతో వచ్చిన చిక్కు. ఊరు,వాడ గోలగోలగా మాట్లాడుకుంటున్నా ఏమీ తెలియనట్లు ఏమన్నాడని అడుగుతావు. సరె చెప్తా. అదే పల్లవిలో ఉంటె హిందువుగ ఉండు, పోతే నీ దేశం పోరా అని అన్నాడుగ. మరి ఇతరదేశాల వారు కూడ అలాగంటె అన్ని దేశాల్లో ఉన్న హిందువులు మన దేశానికి వస్తే అడుక్కు తినవలసిందె. నిజమె ఇప్పుడె ఆకలిచావులు. అప్పుడు మరింతగా పెరగవచ్చు. అదలా ఉంచవయ్యా. అసలు యోగికి బుర్ర ఉందా అని. ఇతర దేశాలతో సంబంధాలు లేకుండా ఎలా. అందుకె ఆ యోగిని హిమాలయాల్లో తపస్సు చేసుకోవడానికి పంపించాలి. ఆసలు ఆయన యింత కుచ్చిత బుద్ధితో రాష్ట్రాన్ని ఎలా పరిపాలిస్తున్నాడో అర్థం కావడం లేదు. భలే వాడివి ఇవాళ పరిపాలించడానికి కావలసిన అన్ని అర్హతలు ఆయన కున్నాయి. యోగి, మోది, అద్వాని, అశోక్‌సింఘాల్, భగవత్ చివరకు వాజపేయిలకు మూలం రాష్ట్రీయ స్వయంసేవక్. ఆ ఆర్.యస్.యస్ అనుబంధంగా పదికి పైగా సంఘాలు తయారయ్యాయి. వీటన్నిటి లక్ష్యం హిందూ మతాన్ని ఉద్ధరించడమే. అందరి కంటె యోగికి అదనపు అర్హతలున్నాయి. దౌర్జన్యం, ఎన్‌కౌంటర్ లాంటివి. అంతకంటె ఈ రోజుల్లో పాలనకు కావలసినవి ఏమున్నాయి. అందుకె దేశంలో అతిపెద్ద రాష్ట్రాన్ని అవలీలగ పాలించగల్గుతున్నాడు. అంతెందుకు ఈ మధ్య మహిళా మల్లయోధులపై అసభ్యంగా ప్రవర్తించిన పార్లమెంటు సభ్యుడు బ్రిజ్‌భూషణ్‌పై ఇంతవరకు మన గ్రేట్‌ప్రధాని ఎటువంటిచర్య తీసు కోలేదు. ఎందుకంటె ఆయన మూలాలు అవేకనుక. నిజమె బావ ప్రస్తుతం దేశంలో మంచి, చెడు అనేవి చూడకుండ పార్టీ సభ్యుల్ని కాపాడి పార్టీని కాపాడుకోవడం నేటి నేతలకు ముఖ్యంగా కనబడుతోంది. మనువును తలదాల్చి ఆనాటి పంచమ వర్ణం సమాజంలోకి తీసుకు వెళ్లడమే బీజేపీ కర్తవ్యంగా కనబడుతోంది. అందుకు కావల్సిన కార్యాచరణ రూపొందించుకుని అంచలంచెలుగా ఒక్కొక్కటి ప్రవేశ పెట్టబోతున్నట్లు అందులో ముందుగా ఉమ్మడి పౌరస్మృతిని తలకెత్తు కున్నారు. సమాజంలో ఒకవర్గం, ఒకకులం బతకలేనట్లుగానె ప్రపంచంలో ఒక హిందూజాతి ఎలా బతకగలదో అర్థంకావడంలేదు. ఏనాటి మనువునో యిపుడు ప్రవేశపెట్టాలనుకోవడం ఎంత దుర్లభమో వారికి అర్థం కావడం లేదు. ఏది ఏమైనా తిరిగి పంచమ వర్ణ వ్యవస్థ నెలకొల్పడమె బీజేపీ లక్ష్యంగా కనబడుతోంది. కాకపోతె అందరికంటె ముందు మన కాషాయ వేషధారి యోగి ఒక అడుగు ముందుకేస్తున్నారు. ఒకప్పుడు మనల్ని పాలించిన ఔరంగజేబు తనకు మత సిద్ధాంతాలు నేర్పిన గురువుకు ఒక ఉత్తరం రాశాడట. తన బాల్యాన్ని ఎందుకు పనికి రాని మత బోధనలతో నాశనం చేశారని. ఇంతకాలం తరువాత కూడ మన మనువాదులకు ఆ యింగిత జ్ఞానం బోధ పడటం లేదు. హిందూ మతం చెప్పిందె దేముడు చెప్పినట్లుగ బోధకులు చెప్పి సర్వ జనులను బానిసలుగ, ఇతరులపై ఆధారపడేటట్లు తయారుచేశారు. ప్రస్తుతం కనిపించె మానవతా మూర్తులను పక్కనపెట్టి కనిపించని దైవానికై సాగె ప్రభుత్వాలు కోకొల్లలు. అందరూ సమానమె అన్న బుద్ధుడు, ఆర్థిక సమానత్వం ఉన్ననాడె సమాజంలో సర్వజనులు సమసమాజంలో సమానంగ బతకగలరన్న మార్క్సు పనికి రాడు. అమాయకులను బానిసలుగామార్చి వారితో వెట్టి చాకిరీ చేయించుకోవడానికి మను ధర్మశాస్త్రం కావాలి...!

సెల్: 98855 69394

80 వసంతాల శ్రీలంక కమ్యూనిస్టు పార్టీ

శ్రీలంక రాజధాని కొలంబోలో జులై 3వ తేదీన శ్రీలంక కమ్యూనిస్టు పార్టీ (సిపిఎస్ఎల్) 80వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. వివిధ దేశాలకు చెందిన కమ్యూనిస్టు పార్టీ ప్రతినిధులు ఈ వార్షికోత్సవానికి హాజరయ్యారు. మహారాగమా వద్ద జాతీయయువజన సేవల మందిరంలో మధ్యాహ్నం 2 గంటలకు ఈ వార్షికోత్సవం ప్రారంభమైంది. దక్షిణాసియా దేశాల నుంచి కమ్యూనిస్టు పార్టీలకు చెందిన పలువురు నాయకులు హాజరయ్యారు. భారత కమ్యూనిస్టు పార్టీ తరపున పార్టీ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ, సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు టి.ఎం.మూర్తి, సిపిఐ(ఎం) తరపున సెంట్రల్ కమిటీ సభ్యుడు జి.రామకృష్ణన్, రీటా రామకృష్ణన్, నేపాల్ కమ్యూనిస్టు పార్టీ (యునైటెడ్ సోషలిస్ట్) తరపున మాజీ ప్రధాన మంత్రి మాధవ్‌కుమార్ నేపాల్, అదేవిధంగా నేపాల్ కమ్యూనిస్టు పార్టీ (యునైటెడ్ మార్కిస్ట్, లెనినిస్ట్) తరపున ప్రదీప్‌కుమార్ క్యావాలీ, బంగ్లాదేశ్ కమ్యూనిస్టు పార్టీ తరపున రమణ్ షాహేన్, ఆయన సతీమణి షహకత్ సబరినా, చైనా కమ్యూనిస్టు పార్టీ తరపున ఒక ప్రతినిధి బృందం కూడా ఈ వార్షికోత్సవంలో పాల్గొంది. 2500 మందికిపైగా కమ్యూనిస్టు పార్టీ సభ్యులు, ప్రజాసంఘాల సభ్యులు, వామపక్ష మేధావులు, ప్రొఫెసర్లు, డాక్టర్లు, విద్యావేత్తలు పాల్గొన్నారు.

అనేక సంవత్సరాల పాటు శ్రీలంక మంత్రిగా, రెండు దశాబ్దాలు శ్రీలంక కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన డిఇడబ్ల్యు గుణ శేఖర ఈ 80వ వార్షికోత్సవాన్ని ప్రారంభించారు. శ్రీలంకలో కమ్యూనిస్టు పార్టీ సుదీర్ఘ ప్రయాణాన్ని, చేసిన పోరాటాలను ఆయన వివరించారు. శ్రీలంక పార్లమెంటులో కమ్యూనిస్టు పార్టీ తరపున ప్రజలు ఎన్నుకున్న ఏకైక ప్రతినిధిగా వున్న మతారాయి జిల్లా ఎంపి, పార్టీ ఉపాధ్యక్షుడు వీరసుమన వీరసింఘే స్వాగతోపన్యాసం చేశారు. శ్రీలంక కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జి.వీరసింఘే ఈ వార్షికోత్సవంలో కీలకోపన్యాసం చేశారు. ఈ సందర్భంగా సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ, సిపిఎస్ఎల్‌కు శుభాకాంక్షలు తెలియచేశారు. ప్రారంభోత్సవ సభలో వేదికపై ప్రదర్శించిన శ్రీలంక సాంస్కృతిక నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ నృత్యాలు చేసినవారిలో యంగ్ కమ్యూనిస్టు లీగ్ సభ్యులు కూడా ఉన్నారు. 4వ తేదీ రెండో రోజు ఉదయం విదేశీ ప్రతినిధులు శ్రీలంక కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ జరిగిన సమావేశంలో శ్రీలంక పార్టీ రాజకీయ నాయకత్వంతో విదేశీ ప్రతినిధులు పరస్పర అభిప్రాయాలు పంచుకున్నారు. మధ్యాహ్నం తిరిగి మహాసభలో సదస్సు జరిగింది. దక్షిణాసియా కమ్యూనిస్టు పార్టీ ప్రతినిధులు ఈ సదస్సులో పాల్గన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ తరపున టి.ఎం.మూర్తి ఒక పత్రాన్ని సదస్సుకు సమర్పించారు. శ్రీలంక కమ్యూనిస్టుపార్టీ వ్యవస్థాపకుడు, భారతదేశానికి సుపరిచితుడైన మంచి నాయకుడు డాక్టర్ ఎస్.ఎ. విక్రమ సింఘే విగ్రహం కొలంబోలో పెట్టారు. పీటర్ కెనమన్ కూడా ఆయన సమకాలికుడే. అదేవిధంగా 20 ఏళ్ల పాటు శ్రీలంక కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన పాతతరం నాయకుడు గుణశేఖర హాజరయ్యారు.

శ్రీలంక ఎం.పి. డా. వీరసింఘేతో డా. కె. నారాయణ

ఇప్పుడు ఆయన వయస్సు 90ఏళ్లు.

జాఫ్నా నుండి కమ్యూనిస్టు పార్టీ తమిళ నాయకుల హాజరు

ప్రస్తుతం శ్రీలంక కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ విక్రమసింఘే ఎన్నికయ్యారు. ఆయన వైద్య వృత్తిని వదిలేసి పార్టీ ప్రధాన కార్యదర్శి బాధ్యతలు చేపట్టారు. పార్టీలోకి కొత్తగా యువతరాన్ని ఆకర్షించి వారిని నాయకులుగా తీర్చిదిద్దేందుకు ప్రధానంగా దృష్టి సారించారు. ఈ 80వ వార్షికోత్సవంలో ప్రత్యేక విశేషం ఏమిటంటే, సింహళ భాషలో నాయకులు చేసిన ప్రసంగాలన్నింటినీ విదేశీ ప్రతినిధులకు అర్థమయ్యేవిధంగా ఇంగ్లీషు, తమిళ భాషలో ఏకకాలంలో అనువదించారు. శ్రీలంక పార్టీ సెంట్రల్ కమిటీ సభ్యుడు గణపతి పిళ్ళ తమిళభాషలో ప్రసంగించారు. ఆయన కార్మికసంఘ నాయకుడు కూడా. ఈ విషయంపై ఆరాతీయగా, జాఫ్నా ప్రాంతంలోని తమిళ ప్రజలకు ప్రాతినిధ్యం వహించే పార్టీ నాయకులు కూడా సభలో పాల్గొన్నారు.

జాతి, మత, ప్రాంతీయ ఘర్షణల్లో మునిగిపోయాం : గుణశేఖర సంక్షిప్త ప్రసంగం

వామపక్ష ధోరణులుగల, లండన్‌లో విద్యావంతులైన విద్యార్థులు జాతీయ విముక్తి ప్రయోజనాలతో మన దేశంలో కమ్యూనిస్టు పార్టీని ఏర్పాటు చేశారు. 1935లో శ్రీలంక సమసమాజ్ పార్టీ ఆవిర్భవించింది. శ్రీలంకలో అదే మొట్టమొదటి వామపక్ష భావజాలం గల కమ్యూనిస్టు పార్టీ. దాని వ్యవస్థాపకులు డాక్టర్ విక్రమసింఘే. ఆయన లండన్‌లో విద్యాభ్యాసం పూర్తిచేసుకొని శ్రీలంక తిరిగివచ్చి పార్టీని స్థాపించారు. రెండవ ప్రపంచ యుద్ధం ప్రారంభం కావడంతో 1939లో అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంలో విభేదాలు ఉధృతమయ్యాయి. ఈ అభిప్రాయ బేధాలతో డాక్టర్ విక్రమసింఘే 1940లో సమసమాజ్ పార్టీ నుంచి బయటకు వెళ్ళి పోయారు. 1943 జులై 3న సిలోన్ కమ్యూనిస్టు పార్టీని ప్రారంభించారు. శ్రీలంకలో కమ్యూనిస్టు పార్టీ ప్రత్యక్షంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేక పోయినప్పటికీ ఇక అప్పటి నుండి శ్రీలంక ప్రజల అభ్యున్నతికి, వారి ప్రయోజనాలు కాపాడేందుకు పోరాటాలు కొనసాగిస్తూ వస్తోంది. ఈ పార్టీ ఈనాటివరకు ప్రవర్ధమానమై ప్రజలతో మమేకమై ఈనాడు వార్షికోత్సవం చేసుకుంటున్నది. రాజకీయంగా చూస్తే, శ్రీలంకలో కమ్యూనిస్టు పార్టీ అనుభవాలను చూసినవారు ఎవరైనా రాజకీయ విమర్శకుల విశ్లేషణలు పరిశీలించినా, పార్టీ ఎంతో పరిణతి గల రాజకీయాలు చేస్తోంది.

1945 నుండి 1947 వరకు కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ శ్రీలంక, దేశంలో ఉధృత సమ్మెకు నాయకత్వం వహించింది. ఉద్యమ ఫలితంగా కమ్యూనిస్టు పార్టీ కార్మికులకు అనేక హక్కులను సాధించింది. 8 గంటల పనిదినంతో పాటు కార్మికులకు పెన్షన్, సెలవులు, జీతాల పెంపు వంటి అనేక హక్కులను సాధించడం పార్టీ విజయం. దక్షిణాసియా దేశాలలో స్వాతంత్ర్యం పొందిన దేశాల్లో 75 ఏళ్లు పూర్తి చేసుకుంది. తరచూ మనం మత, ప్రాంతీయ, జాతి సంఘర్షణలను ఎదుర్కొంటూ వస్తున్నాం. స్వాతంత్ర్యం తరువాత స్వేచ్ఛా వాయువులు పీల్చిన దేశాలు శరవేగంగా ప్రగతి సాధిస్తున్నాయి. వియత్నాం, లావోస్, కాంబోడియా వంటి సోషలిస్టు దేశాలు స్వాతంత్ర్యం పొందినప్పటికంటే ఈనాటికి చాలా విస్తారమైన మెరుగుదలను సాధించాయి.

చైనా ప్రపంచంలో రెండవ అతిపెద్ద సూపర్ పవర్‌గా ఆవిర్భవించింది. అమెరికాకు భారీస్థాయిలో పెట్టుబడులు సమకూరుస్తున్న దేశంగా ఎదిగింది. క్యూబా కమ్యూనిస్టు పార్టీ కూడా ప్రజలతో మమేకమైపోయి ఆశ్చర్యం కలిగించే ఫలితాలు సాధించింది. అదేసమయంలో శ్రీలంకలో ఆర్థిక సంక్షోభం చాలా లోతుగా వేళ్ళూనుకుంది. శ్రీలంక దిగుమతులు దేశ ఎగుమతుల కంటే రెండు రెట్లు పెరిగిపోయాయి. ఈ దిగుమతి వస్తువులకు అమెరికా డాలర్లను ఎక్కడినుంచి తెచ్చి చెల్లించగలం? అందుకే పాలకులు అప్పులమీద అప్పులు చేశారు. పాలకులు తమతీరు మార్చుకోలేదు. గత ఏడాది శ్రీలంకలో తిరుగుబాటు జరిగింది. ఈ నిరసనలో పాల్గన్నవారందరికీ అన్ని సౌకర్యాలు సమకూర్చారు. ఆహారం, దుస్తులు వారికి అందుబాటులోకి వచ్చాయి. లక్షలాది అమెరికా డాలర్లు దీనికోసం సమకూర్చారు. ఈ ఖర్చులన్నీ ఎవరు భరించారు?

మనదేశాల్లో అనేక స్వచ్ఛంద సేవా సంస్థలున్నాయి. వాళ్ళు ప్రతిచోటకి ప్రవేశించారు. ప్రజలను రాజకీయాల నుంచి బయటికి తెచ్చి రాజకీయ పోరాటాలు చేపట్టకుండా వారిని నివారించడానికి ఈ స్వచ్ఛంద సేవా గ్రూపులు పూర్తికాలపు పనిగా చేపట్టాయి.

డా. కె. నారాయణ, సీపీఐ జాతీయ కార్యదర్శి

టెకీలలో 2 లక్షల ఉద్యోగులకు ఉద్వాసన

రావుశ్రీ

అమెరికాలో ప్రారంభమైన 2008లో ఆర్థిక మాంద్యం ప్రపంచాన్ని కుదేలు పరిచింది. మళ్లీ గత మూడు సంవత్సరాల నుండి ప్రపంచ దేశాలను వెంటాడుతున్నది. 2019లో ప్రపంచ దేశాలను వణికించిన కరోనావైరస్ దాడికి దాదాపు అన్ని దేశాలు ఆర్థికంగా చితికిపోయి, చిగురుటాకులా వణికిపోయాయి. భారీ ఎత్తున ప్రాణనష్టం కలిగింది. పరిశ్రమలు మూతపడి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కోల్పోయి బతుకులు ఛిద్రంఅయ్యాయి. వివిధదేశాలు, అంతర్జాతీయ సంస్థలు తీసుకున్న నిర్ణయాలతో కుదుటపడుతున్న ప్రజల బ్రతుకులు, వివిధ ఆర్థిక వ్యవస్థలు 2022 ఫిబ్రవరిలో ప్రారంభమైన రష్యా-ఉక్రెయిన్ యుద్ధంతో తిరిగి ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక మాంద్యం ఉగ్రరూపం సంతరించుకుంది. దీంతో ప్రస్తుతం ప్రపంచ ఆర్థిక రంగాన్ని శాసిస్తున్న "సేవారంగం సాఫ్ట్‌వేర్ రంగం" తీవ్ర ఒడిదుడుకుల్ని చవిచూస్తుంది. ముఖ్యంగా ప్రముఖ టెక్‌కంపెనీలు మైక్రోసాఫ్ట్, విప్రో, యాపిల్, గూగుల్, టి.సి.యస్, అమెజాన్ వంటి సంస్థలు ఇటీవల కాలంలో లేఆఫ్‌లు ప్రకటిస్తూ లక్షలసంఖ్యలో ఉద్యోగాలు తొలగిస్తున్నారు. గత మే నెలలో ఒక్క అమెరికాలోనే 80వేల ఉద్యోగులను తొలగిస్తున్నారు. 2023 సంవత్సరం ప్రారంభం నుంచి నేటివరకూ సుమారు 2లక్షలు ఉద్యోగులకు ఉద్వాసన పలికారు.

2023 డిసెంబర్ ముగింపు నాటికి మరో 5 లక్షల ఉద్యోగాలు హుష్ కాకి కానున్నట్లు ప్రపంచ ఆర్థిక సంస్థల నివేదికలు చెబుతున్నాయి. కొవిడ్, రష్యా-ఉక్రెయిన్ యుద్ధంవంటి కారణాలతో ప్రపంచవ్యాప్తంగా ఆర్థికమాంద్యం, ఉద్యోగ, ఉపాధిఅవకాశాలు కోల్పోతున్న ప్రస్తుత పరిస్థితుల్లో, సాఫ్ట్‌వేర్ రంగంలో లేఆఫ్‌లకు మరొక ప్రధానకారణం "ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్(ఏ.ఐ)" అని నిపుణులు తెలియపరుస్తున్నారు. రోబోట్స్, ఛాట్ జీపిటి, ఏ.ఐ వంటి వివిధ విప్లవాత్మక ఆవిష్కరణలతో పనుల్లో వేగవంతం, ఖచ్చితత్వం పెరిగి, మనిషి ఉద్యోగ ఉపాధి అవకాశాలపై తీవ్రప్రభావం చూపుతూ, బతుకులుభారంగా మారుతున్నాయి. ఇటువంటి సమయంలో సంస్థలు, వ్యక్తులు, ప్రభుత్వాలు నూతన అవకాశాలపై దృష్టి పెట్టాలి. నూతన విద్యా విధానాలు ప్రవేశపెట్టాలి. మారుతున్న కాలానికి అనుగుణంగా కెరీర్ గైడెన్స్ అందిపుచ్చుకుని భవిష్యత్తు తీర్చిదిద్దుకోవాలి. ముఖ్యంగా ప్రపంచదేశాలమధ్య శాంతి, సహకారం అవసరం.అంతర్జాతీయంగా ఉన్న ఉగ్రవాదం, వివక్షతలు వంటి సమస్యలపై అన్ని దేశాలు సమిష్టిగా పోరాటం చేయాలి. శాంతి స్థాపనకు కృషి చేయాలి. శాస్త్ర, సాంకేతికతను అందిపుచ్చుకుని భవిష్యత్తు తీర్చి దిద్దుకోవటం ద్వారానే నిరుద్యోగం, ఆర్థిక మాంద్యం, అధిక ధరలు, ద్రవ్యోల్బణం వంటి దుష్పరిణామాలు నుంచి బయటపడగలం.

విద్యపై ప్రచారానికి భిన్నంగా అమలు!



సంగిరెడ్డి హనుమంతరెడ్డి

విద్యా సంస్థలు విద్యార్థులకు, తల్లి దండ్రులకు, పీడిత సమాజానికి బాధ్యత వహించాలి, పాలకులకు కాదు. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, విద్యాసంస్థలు రాజకీయులను తృప్తిపర్చాలంటున్నారు. విద్యార్థులకు అనుకూలంకాని, తల్లిదండ్రులు ఇష్టపడని విద్యావిధానాలను, ప్రభుత్వ పాఠశాలల కంటే ఎక్కువ ఫీజులు వసూలుచేసే ప్రైవేటు విద్యా సంస్థలను ప్రోత్సహిస్తున్నారు. బళ్ళపై పెట్టుబళ్ళకు, సాధించే ఫలితాలకు ప్రతిఫలంగా వాటి ఫీజులు ఉండాలని, తల్లిదండ్రులు ఎక్కువఫీజులు చెల్లించడానికి సిద్ధపడాలని బైడెన్ మద్దతుదారులు వాదిస్తున్నారు. విద్యాబోధనలో విద్యార్థుల, తల్లిదండ్రుల పాత్రను తొలగించారు. విద్యావేత్తలు ప్రజలకు కాక ప్రభుత్వానికి బాధ్యత వహించాలనే చట్టాలను ఇష్టపడుతున్నారు.

"నిధులను ప్రైవేటు విద్యా సంస్థలకు మళ్లించడం ద్వారా ప్రజా విద్యా వ్యవస్థ పునాదులను పెకలించవచ్చు. ప్రైవేటు విద్యాసంస్థల్లో పెట్టుబళ్లకు ప్రాధాన్యతనివ్వాలి. అప్పుడే ప్రతి బిడ్డకు న్యాయమైన విద్య అందుతుంది. అందుకే విద్యా వోచర్లను నేను వ్యతిరేకిస్తున్నాను." అని 2020 ఎన్నికల్లో అధ్యక్ష అభ్యర్థిగా బైడెన్ ప్రచారం చేశారు. అమెరికా బళ్ళలో విద్యార్థులకు ప్రభుత్వ నిధులనిచ్చే ధృవపత్రం విద్యా వోచర్ లేదా స్కూల్ వోచర్. పేద విద్యార్థులకు విద్యావకాశాలు కల్పించడానికి సంఘాలు, డెమోక్రాట్లు ఎందుకు వ్యతిరేకిస్తున్నారని బైడెన్ మద్దతుదారు వాషింగ్టన్ పోస్టు దినపత్రిక సంపాదకవర్గం గతేడాది ప్రశ్నించింది. సమాఖ్య ప్రభుత్వ ఉపకార వేతనాలు ప్రమాదకరమని హెచ్చరించింది. ప్రభుత్వనిధులతో నడిచే ప్రైవేటు బళ్ళ (ఛార్టర్ స్కూల్స్) కోసం బైడెన్ పట్టుపట్టారు. ప్రభుత్వ విద్యాసంస్థలకు సమాఖ్య నిధులనిచ్చే ప్రభుత్వనియమాలను బైడెన్ ప్రభుత్వం వ్యతిరేకించింది. ప్రైవేటువిద్యాసంస్థలపై పోటీలో ప్రభుత్వ విద్యాసంస్థల ఆధిపత్య అవకాశానికి గండికొట్టింది. విద్యావోచర్ల, ప్రభుత్వవిద్యాసంస్థల ప్రత్యామ్నాయ విధానాలకు అడ్డంకులు సృష్టిస్తోంది. విద్యావ్యవస్థ నిర్వహణలో, విద్యా ఫలితాలలో ప్రైవేటు విద్యాసంస్థల పాత్రను పెంచింది. బైడెన్ విద్యా నియమాలు ప్రైవేటు విద్యా సంస్థల చొరబాటుకు అవకాశమిచ్చాయి. "ఆర్థిక బాధ్యత, జవాబు దారీతనం, పారదర్శకతలపై కొత్త నిబంధనలతో దృష్టి కేంద్రీకరించాము. సామూహిక అవసరాల సంగణీకరణ (డిజిటలైజేషన్)ను ఈ క్రమబద్ధీకరణలు సమర్థిస్తాయి. మా చట్టాలు ఛార్టర్ స్కూల్ రంగాన్ని నాశనం చెయ్యవు." అని ఛార్టర్ స్కూల్ ఇన్‌స్టిట్యూషన్ సమావేశంలో అమెరికా విద్యా విభాగ సహాయ కార్యదర్శి (మంత్రి) రాబర్టో రోడ్రిగ్జ్ (బ్రూకింగ్స్) వివరించారు.

ఛార్టర్ స్కూల్స్, సమాఖ్య విద్యావ్యవస్థ ఇతర ప్రత్యామ్నాయాలు

ప్రజలకు జవాబుదారీగా ఉండాలి. "16.6శాతం తల్లిదండ్రులు గతేడాది పిల్లలకు కొత్త పాఠశాలలను ఎన్నుకున్నారు. 11.3శాతం ఆ ఆలోచనలో ఉన్నారు. ఈ ఏడాది 25.8శాతం ఆ పనిలో ఉన్నారు." అని నేషనల్ స్కూల్ ఛాయిస్ అవేర్నెస్ ఫౌండేషన్ తన 2023 జనవరి సర్వేలో ప్రకటించింది. 53.7శాతం తల్లిదండ్రులు పిల్లలను కొత్త బళ్ళలో చేర్చారు లేదా ఆ పనిలో ఉన్నారు. అంటే తల్లిదండ్రులు తమ పిల్లల విద్యాభ్యాసంలో విద్యాసంస్థల జవాబుదారీతనంపై నిరంతర నిఘాపెడుతున్నారు. వివిధఅంశాలను పరిశీలిస్తున్నారు. ప్రత్యామ్నాయ విద్యాసంస్థలను ఎంచుకుంటున్నారు. 45.6శాతం తల్లిదండ్రులు ఇళ్లకు దగ్గరలో ఉన్న సంప్రదాయ ప్రభుత్వ బళ్లను, 38.2శాతం తమ జిల్లాకు, ప్రాంతానికి వెలుపల ఉన్న ప్రభుత్వ పాఠశాలలను,31.5శాతం ఛార్టర్ స్కూళ్లను, 29.1శాతం ప్రైవేటు, మతాధార బళ్లను ఎంచుకున్నారని, 22.9శాతం ఇళ్లలోను, 20.8శాతం ఆన్‌లైన్ తరగతులలో, 4శాతం మైక్రో స్కూలింగ్ లేదా పాడ్ లర్నింగ్‌లో పిల్లలను చదివించారని సర్వే నివేదిక తెలిపింది. (15 లోపు విద్యార్థులు ఉండే మన ఏకోపాధ్యాయ పాఠశాలలను పోలిన బళ్ళను అమెరికాలో మైక్రో స్కూలింగ్ లేదా పాడ్ లెర్నింగ్ అంటారు) సామూహిక అవసరాలను తెలుసుకోడానికి తల్లిదండ్రులు సంగణీకరణ నిపుణులను ఆశ్రయించలేదు. తమ అవసరాలను గుర్తించారు. సొంత నిర్ణయాలు తీసుకున్నారు. అయితే వారిలో పలువురు ఎక్కువ ఎంపిక అవకాశాలను కోరుకున్నారు. 48.1శాతం తల్లిదండ్రులు, 52.8శాతం హిస్పానిక్ (స్పానిష్ భాష మాట్లాడే అమెరికన్లు) తల్లిదండ్రులు, 53.4 శాతం మిలెన్నియల్(1980-'90 ల మధ్య పుట్టిన తరం) తల్లిదండ్రులు, తమ సమూహాలు, కుటుంబఅవసరాలకు తగినట్లు పిల్లలకు విద్యావకాశాలు సమకూర్చడంలేదన్నారు. 3.7 శాతం తల్లిదండ్రులు మాత్రమే తమ సమూహం ఎక్కువ విద్యావకాశాలను అందిస్తోందన్నారు.

ఎక్కువ విద్యావకాశాల కోరిక, పిల్లలను మెరుగైన బళ్ళకు మార్చడం వంటివి విద్యావిభాగంపై అపనమ్మకం, తమసమూహ అవసరాల అవగాహనలకు ఉత్తమ సంకేతాలు. కుటుంబ ప్రాధాన్యతలకు ప్రభుత్వ జవాబుదారీతనాన్ని కోరడం అహంకారం కాదు. తల్లిదండ్రులు పిల్లల చదువులకు పాఠశాలలను ఎంచుకొని మార్చడంలో అనేక ప్రాతిపదికలను పరిగణించడం అసాధారణ ఆలోచన. 2018-19 విద్యాసంవత్సరంలో 36శాతం విద్యార్థుల తల్లిదండ్రులు పిల్లల చదువులకు చాలా పాఠశాలలను పరిశీలించారు. వీరిలో 79శాతం మంది ఉపాధ్యాయుల, ప్రధానాచార్యుల, పాఠశాల సిబ్బంది నాణ్యత ప్రధానమని భావించారు. 71శాతం, విద్యార్థుల భద్రత, క్రమశిక్షణ ముఖ్యమన్నారు. 59శాతంమంది విద్యా సంబంధ కార్యక్రమాలు, బోధనాంశాలపై దృష్టి పెట్టారు. 30శాతం ఇతర పాఠశాలలు మంచివని అభిప్రాయపడ్డారు. పాఠశాలల పనితీరుపై స్థిరంగా, నిరంతరం కొనసాగే పునఃపరిశీలన జవాబుదారీతనం అధ్యయనంలో అభిలషణీయమైన అంశం. తమ పిల్లల చదువులు చక్కగా ఉంటే తల్లిదండ్రులు సంతోషిస్తారు. వారు చదువుతున్న పాఠశాలలు గృహ కేంద్రాలా, ప్రైవేటువా, ప్రభుత్వానివా, ఛార్టర్ స్కూల్లా అని పెద్దగా పట్టించుకోరు. అందుకే 70శాతం ప్రజలు బైడెన్ జిత్తులమారి విద్యా నియమాలకు మద్దతు పలుకుతున్నారు. విద్యా వోచర్లకు, ఉపకార వేతనాలకు తాము సృష్టించే అడ్డంకులు జవాబుదారీ తనం కోసమని రాజకీయులు వాదిస్తున్నారు. ఐతే ఈ అడ్డంకులు జవాబు దారీతనానికి తెద్దెయ్యడానికే గాని పెంచడానికి కాదు. నిజమైన జవాబు దారీతనాన్ని ఎన్నికల ప్రక్రియలో ప్రజలే నిర్ణయించగలరు. విద్యావేత్తలు విద్యార్థులకు, తల్లిదండ్రులకు, ప్రజలకు బాధ్యత వహించాలి. ప్రభుత్వాధినేతలకు కాదు.

ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఫోరం జాతీయ కార్యదర్శి,
9490 20 4545

చత్తీస్‌గఢ్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా బైజ్

యువతకు 50 శాతం పదవులకు నాంది: బాఘెల్

రాయ్‌పూర్: కాంగ్రెస్ పార్టీ చత్తీస్‌గఢ్ రాష్ట్ర అధ్యక్షుడిగా యువనేత దీపక్ బైజ్(42)ను నియమించినట్లు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి భూపేశ్ బాఘెల్ గురువారం చెప్పారు. పార్టీ పదవుల్లో సగానికి పైగా 50 ఏళ్ల లోపు నాయకులకు ఇవ్వాలన్న కాంగ్రెస్ పార్టీ నిర్ణయం చత్తీస్‌గఢ్ నుంచే ప్రారంభమైందని బాఘెల్ చెప్పారు. బస్తర్ పార్లమెంటరీ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న బైజ్‌ను పీసీసీ అధ్యక్షుడిగా పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే బుధవారం నియమించినట్లు తెలిపారు. ఇప్పటి వరకు చత్తీస్‌గఢ్ పీసీసీ అధ్యక్షుడిగా ఎమ్మెల్యే మోహన్ మార్కం పనిచేశారు. బైజ్ నియామక నిర్ణయంపై ఇక్కడ జరిగిన విలేకరుల సమావేశంలో బాఘెల్ మాట్లాడుతూ పార్టీలో కొంతమంది నాయకులకు కొన్ని బాధ్యతలు అప్పగిస్తామని, ఇప్పటి వరకు పీసీసీ అధ్యక్షుడిగా పనిచేసిన మోహన్ మార్కం రెండేళ్ల పదవీకాలం పూర్తయిందని, అన్ని రాష్ట్రాల్లో కాంగ్రెస్ అధ్యక్షులను మారుస్తామని బాఘెల్ తెలిపారు. ఇటీవల రాయ్‌పూర్‌లో జరిగిన కాంగ్రెస్ ప్లీనరీలో 50 ఏళ్ల కన్నా తక్కువ వయస్సుగల నాయకులకు పార్టీలో సగం పదవులు ఇవ్వాలని నిర్ణయించిందని, 42 ఏళ్ల దీపక్‌ను నియమించడం ద్వారా ఈ నిర్ణయం చత్తీస్‌గఢ్ నుంచే ప్రారంభించామన్నారు. బైజ్ నియామకం ఈ ఏడాది చివరిలో జరిగే చత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికలపై మంచి ప్రభావం పడుతుందని బాఘెల్ చెప్పారు. 90 మంది సభ్యులు గల అసెంబ్లీలో కాంగ్రెస్‌కు 71మంది ఉన్న విషయం విదితమే. రాష్ట్ర మంత్రివర్గ విస్తరణపై విలేకరులు ప్రశ్నించగా వేచి చూడండంటూ మాట దాటవేశారు. మార్కం నిర్ణయాలపై బాఘెల్ తీవ్ర అసంతృప్తితో ఉండటంతో ఆయన కొనసాగింపు అనిశ్చితిలో పడింది. గతనెలలో మార్కం కొంతమందికి పార్టీ ప్రధాన కార్యదర్శుల పదవులు కట్టబెడితే...ఆ తర్వాత చత్తీస్‌గఢ్ రాష్ట్ర ఇన్‌చార్జి కుమారి సెల్జా రద్దు చేశారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా గిరిజన నాయకుడిని తొలగించి...గిరిజనేతరుడిని నియమించే సాహసం కాంగ్రెస్ చేయబోదని చాలాకాలంగా ప్రచారం జరుగుతోంది. అయితే, ఇప్పుడు కాంగ్రెస్‌కు బలమైన యువ గిరిజన నేత దొరికారు. యువతలో బైజ్ పట్ల మంచి ఆదరణ, ప్రత్యేకించి గిరిజనుల్లో మంచి పట్టు ఉన్నది.

బహుభార్యత్వంపై నిషేధం!

అసోం సీఎం వెల్లడి

గువహటి: బహుభార్యత్వంపై నిషేధం విధించనున్నట్టు అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ గురువారం వెల్లడించారు. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లోనే ఈ మేరకు బిల్లును ప్రవేశపెట్టనున్నట్టు తెలిపారు. దేశంలో ఉమ్మడి పౌరస్మృతి అమలుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తున్న సమయంలో అసోం ప్రభుత్వ తాజా నిర్ణయం తీవ్ర చర్చనీయాంశమైంది. బహుభార్యత్వంపై నిషేధం అమలు చేయడంలో ఎదురయ్యే న్యాయపరమైన చిక్కులపై అధ్యయనం చేసేందుకు అసోం ప్రభుత్వం ఇప్పటికే నిపుణుల కమిటీని ఏర్పాటుచేసింది. కమిటీ ఇంకా నివేదిక సమర్పించాల్సి ఉన్నది. 'సెప్టెంబర్‌లో జరిగే అసెంబ్లీ సమావేశాల్లోనే బిల్లును ప్రవేశపెడతాం. అప్పటికి సాధ్యపడకపోతే జనవరిలో జరిగే సమావేశాల్లో బిల్లును తీసుకువస్తాం' అని ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ తెలిపారు.

కాంగ్రెస్ ఎన్నికల కసరత్తు

ఉత్తరాఖండ్ నేతలతో అధిష్ఠానం మంతనాలు

బీజేపీ ప్రజావ్యతిరేక విధానాలు ఎండగడదాం: ఖర్గే

న్యూదిల్లీ: రానున్న సార్వత్రిక ఎన్నికలపై కాంగ్రెస్ పార్టీ దృష్టి సారించింది. ఆయా రాష్ట్రాల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, ఎత్తుగడలపై సమీక్షలు జరుపుతోంది. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకత్వాలను సన్నద్ధం చేస్తోంది. ఓ వైపు ప్రతిపక్షాల ఐక్యతపై దృష్టి సారిస్తూనే మరోవైపు సొంతపార్టీ బలోపేతం గురించి చర్చలు జరుపుతోంది. ఇప్పటికే కొన్ని రాష్ట్రాల కాంగ్రెస్ నేతలతో అధిష్ఠానం చర్చలు జరిపింది. తాజాగా ఉత్తరాఖండ్ సీనియర్ నాయకులతో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, మాజీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ గురువారం సమావేశమయ్యారు. రానున్న లోక్‌సభ ఎన్నికలకు సంబంధించిన సన్నద్ధతపై సమీక్షించారు. దీనికి ముందు మహారాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నేతలతో సమావేశం జరిగింది. ఉత్తరాఖండ్ మాజీ ముఖ్యమంత్రి హరీశ్ రావత్, పీసీసీ అధ్యక్షుడు కరణ్ మహరా, ఏఐసీసీ రాష్ట్ర ఇన్‌చార్జి దేవేందర్ యాదవ్ సమావేశంలో పాల్గొన్నారు. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ కూడా హాజరయ్యారు. హిమాలయ పర్వత రాష్ట్రాల పర్యావరణ హిత అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని ఖర్గే స్పష్టంచేశారు. వరద బాధితులకు సాయమందించడంలో ముందుండాలని రాష్ట్ర నాయకులు, కార్యకర్తలకు సూచించారు. రాష్ట్ర ప్రజల వాణిని బలంగా వినిపించాలని నాయకులకు ఖర్గే దిశానిర్దేశం చేశారు. 'దేశభూమిగా పిలిచే ఉత్తరాఖండ్ రాష్ట్రం నేడు అనేక సవాళ్లు ఎదుర్కొంటున్నది. రాష్ట్రానికి చెందిన మన పార్టీ నాయకులు, కార్యకర్తలు బలమైన ప్రతిపక్ష పాత్ర పోషించాలి. బీజేపీ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలు ఎండగట్టాలి. ఉత్తరాఖండ్ ప్రజలంతా ఐక్యంగా ఉండాలన్నది మన లక్ష్యం. అదే సమయంలో రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళదాం. సమాజంలోని బలహీనవర్గాల వాణిని నిరంతరం కాంగ్రెస్ వినిపిస్తోంది' అని ఖర్గే ట్వీట్ చేశారు. వరదలు, కొండచరియలు విరిగిపడటంతో ఉత్తరాఖండ్ ప్రజలు తీవ్ర సంక్షోభంలో ఉన్నారని, వారికి సాయమందించడం మన ప్రధాన కర్తవ్యమని స్పష్టంచేశారు. హిమాలయ పర్వత రాష్ట్రాలకు సంబంధించి వాతావరణ మార్పు, దానివల్ల ఏర్పడే పరిణామాలపై నిర్దిష్టమైన విధానాన్ని మనం రూపొందిస్తున్నామని ఖర్గే తెలిపారు. స్థానిక ప్రజల సమ్మతితోనే అభివృద్ధి పనులు చేపడతామని హామీ ఇచ్చారు.

ఉమ్మడి పౌరస్మృతికి మేం వ్యతిరేకం

- అమలుతో సామాజిక విభజన ముప్పు
- లా కమిషన్‌కు తమిళనాడు సీఎం స్టాలిన్ లేఖ

చెన్నై: అందరికీ ఒకటే సైజు సరిపోతుందన్న పద్ధతిలో ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ)ని ప్రతిపాదించారని, దీనిని పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తెలిపారు. మన సమాజంలో భిన్నసంస్కృతులు ఉన్నాయని చెబుతూనే వైవిధ్యతకు సవాల్ విసరడమే కాకుండా భిన్నత్వంలో ఏకత్వానికి పెద్ద ముప్పుగా యూసీసీ పరిణమిస్తుందని ఆందోళన వ్యక్తంచేశారు. ఈ మేరకు భారత లా కమిషన్ చైర్‌పర్సన్‌కు సమగ్ర లేఖ రాశారు. 'భారతదేశంలో ఉమ్మడి పౌరస్మృతి అమలు ఆలోచనకు తమిళనాడు ప్రభుత్వం పూర్తిగా వ్యతిరేకమని తెలియజేసేందుకు ఈ లేఖ రాస్తున్నా. కొన్ని సంస్కరణలు అవసరమైనప్పటికీ భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకైన భారత్‌లో ఉమ్మడి పౌరస్మృతి అములు పెద్ద ముప్పుగా పరిణమిస్తుంది. రాజ్యాంగంలోని అధికరణ 29 ద్వారా మైనారిటీల హక్కుల పరిరక్షణకు, గౌరవించేందుకు లౌకిక దేశంగా భారత్ గర్విస్తోంది. రాజ్యాంగంలోని ఆరవ షెడ్యూల్ కూడా గిరిజనుల సంప్రదాయాలు, ఆచారాలకు జిల్లా, ప్రాంతీయ మండళ్ల ద్వారా రక్షణకు హామీనిస్తుంది. గిరిజన వర్గాలను ఛిన్నాభిన్నం చేసేదిగానూ వారి సంప్రదాయాలు, ఆచారాలకు, హక్కులను హరించేదిగానూ ఉమ్మడి పౌరస్మృతి ఉంది' అని లేఖలో స్టాలిన్ పేర్కొన్నారు. సామాజిక- ఆర్థిక అసమానతలను పరిగణనలోకి తీసుకోకుండా ఉమ్మడి పౌరస్మృతిని అమలు చేస్తే తీవ్ర పరిణామాలు తప్పబోవని హెచ్చరించారు.

వేర్వేరు వర్గాల్లో అభివృద్ధి, విద్య, అవగాహన వంటివాటివి వేర్వేరు స్థాయిలో ఉంటాయని, అందరికీ ఒకటే సైజు సరిపోతుందన్న పద్ధతిలో ముందుకెళ్లడం మంచిది కాదని, తద్వార అసమానతలు మరింత పెరిగే అవకాశం ఉంటుందని హితవు పలికారు. మతపరంగా సమాజాన్ని చీల్చడమే కాకుండా సామాజికంగా విభజనలు సృష్టించే సామర్థ్యం ఉమ్మడి పౌరస్మృతికి ఉందని స్టాలిన్ ఆందోళన వ్యక్తంచేశారు. ఈ అంశాలను పట్టించుకోకుండా పౌరస్మృతిని అమలు చేస్తే మత వ్యవహారాల్లో ప్రభుత్వం అతిగా స్పందించడమే అవుతుందని, వ్యక్తిగత స్వేచ్ఛపై ఆందోళనకర పరిస్థితులు నెలకొనవచ్చని లేఖలో స్టాలిన్ పేర్కొన్నారు.

26న హాజరు కండి

మోదీ డిగ్రీ వివాదంపై కేజ్రీవాల్‌కు కోర్టు ఆదేశం



అహ్మదాబాద్: ప్రధాని నరేంద్రమోదీ డిగ్రీకి సంబంధించి నేరపూరిత పరువునష్టం కేసులో దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, ఆప్ రాజ్యసభ సభ్యుడు సంజయ్‌సింగ్‌కు కోర్టు గురువారం నోటీసులు జారీ చేసింది. జులై 26న తమ ముందు హాజరు కావాలని ఆదేశించింది. గుజరాత్ యూనివర్సిటీ(జీయూ) ఫిర్యాదు ఆధారంగా ఆప్ నాయకులు కేజ్రీవాల్, సంజయ్‌సింగ్‌పై కేసు నమోదైంది. జులై 13న తమ ముందు హాజరు కావాలని ఆ ఇద్దరు నాయకులను మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు ఆదేశించింది. అయితే, దిల్లీలో భారీ వర్షాల కారణంగా కోర్టుకు హాజరు కాలేకపోయారని కేజ్రీవాల్ తరపు న్యాయవాది మేజిస్ట్రేట్‌కు విన్నవించారు. ఈ అభ్యర్థనను యూనివర్సిటీ తరపు న్యాయవాది వ్యతిరేకించలేదు. అయితే, విచారణ జాప్యమవుతున్నందున తదుపరి విచారణకు వచ్చేలా ఆదేశించాలని కోరారు. హాజరు నుంచి మినహాయింపు పిటిషన్‌ను పరిశీలించిన తర్వాత జులై 26న తన ముందు హాజరు కావాలని కేజ్రీవాల్, సంజయ్‌సింగ్‌ను అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ ఎస్‌జే పంచల్ ఆదేశించారు.

గుజరాత్ మాజీమంత్రికి ఏడేళ్ల జైలు

మెహసన: చీటింగ్ కేసులో గుజరాత్ మాజీమంత్రి, దూధ్‌సాగర్ డెయిరీ మాజీ చైర్మన్ విపుల్ చౌదరికి మెహసన కోర్టు గురువారం ఏడేళ్ల జైలుశిక్ష విధించింది. నిబంధనలకు విరుద్ధంగా మహారాష్ట్ర నుంచి పశువుల మేత సరఫరా చేయడం ద్వారా డెయిరీకి రూ.22.5 కోట్ల నష్టం వాటిల్లినట్లు ఆయనపై కేసు నమోదైంది. అమూల్‌కు చెందిన గుజరాత్ సహకార పాల మార్కెటింగ్ సమాఖ్య చైర్మన్‌గా కూడా చౌదరి పనిచేశారు. ఐపీసీ సెక్షన్ 420 కింద చౌదరి, మరో 14 మందికి మెహసనలోని అదనపు చీఫ్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ వైఆర్ అగర్వాల్ ఏడేళ్ల జైలు శిక్ష ఖరారు చేశారు. 1996లో శంకర్‌సిన్హ వాఘెలా ప్రభుత్వంలో చౌదరి మంత్రిగా పనిచేశారు. గుజరాత్ సహకార రంగంలో ఆయన ప్రముఖుడు. ఇదే కేసులో మరో 15 మందికి కోర్టు ఏడాది నుంచి నాలుగేళ్ల వరకు జైలు శిక్ష విధించింది. దూధ్‌సాగర్ డెయిరీ చైర్మన్‌గా ఉన్న సమయంలో 2014లో చౌదరిపై ఎఫ్‌ఐఆర్ నమోదైంది. పశువుల మేత సరఫరాలో అవినీతికి పాల్పడినట్లు ఆరోపణలు రావడంతో ఆయనను ఆ పదవి నుంచి తొలగించారు.

ఎమ్మెల్యే చెంప పగులగొట్టిన మహిళ

చండీగఢ్: అసాధారణ వర్షాలు, వరదలతో సతమతమవుతున్న హరియాణా ప్రజల్లో తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. తాజాగా జననాయక్ జనతా పార్టీ ఎమ్మెల్యే ఈశ్వర్ సింగ్‌పై ఒక మహిళ చేయి చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వీడియో నెట్‌లో వైరల్‌గా మారింది. ఇటీవల కురుసిన వర్షాలకు ఘగ్గర్ నదిపై ఉన్న చిన్న డ్యామ్ దెబ్బతినడంతో ఘులా ప్రాంతాన్ని వరద ముంచెత్తింది. పరిస్థితిని సమీక్షించేందుకు ఎమ్మెల్యే బుధవారం క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజలు తమ అవస్థలు చెప్పుకునేందుకు ఎమ్మెల్యేను చుట్టుముట్టారు. తమ దీనస్థితికి ఎమ్మెల్యే నిర్లక్ష్యమే కారణమని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇంతలో ఒక మహిళ అకస్మాత్తుగా ముందుకు దూసుకొచ్చి 'ఇప్పుడెందుకు వచ్చావ్' అని ఎమ్మెల్యేపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆయన చెంప ఛెళ్లుమనిపించింది. వెంటనే అప్రమత్తమైన భద్రతా సిబ్బంది ఎమ్మెల్యే చుట్టూ రక్షణగా నిలిచారు. ఈ ఘటనపై ఎమ్మెల్యే ఈశ్వర్ సింగ్ స్పందించారు. "నేను తలుచుకుని ఉంటే డ్యామ్ దెబ్బతినేది కాదని ఆ మహిళ ఆరోపించింది. అది ఒక ప్రకృతి విపత్తని నచ్చజెప్పేందుకు నేను ప్రయత్నించా. గత కొన్ని రోజులుగా రాష్ట్రంలో ఎడతెరపిలేకుండా వర్షాలు కురుస్తున్న విషయాన్ని చెప్పా" అని మీడియాతో ఈశ్వర్‌సింగ్ అన్నారు. ఆమెను తాను క్షమించానని, ఎటువంటి న్యాయపరమైన చర్యలు తీసుకోబోనని చెప్పారు.

యూపీలో ఘోరం...

మరుగుదొడ్డిలోనే ప్రసవం

శిశువు మృతి

లక్నో: ఉత్తరప్రదేశ్‌లో దారుణం చోటుచేసుకుంది. పురిటి నొప్పులతో బాధపడుతున్న గర్భిణికి వైద్యం అందించేందుకు వైద్యులు నిరాకరించారు. ఆస్పత్రిలోని మరుగుదొడ్డికి వెళ్లిన ఆమె అక్కడే శిశువుకు జన్మనిచ్చింది. అయితే శిశువు టాయిలెట్‌లో పడి చనిపోయాడు. ఈ ఘటన ఉత్తరప్రదేశ్‌లోని సోనభద్రలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. సోనభద్ర జిల్లాకు చెందిన రష్మీకి నెలలు నిండడంతో ఆమెకు పురిటినొప్పులు వచ్చాయి. దీంతో ఆమెను కుటుంబ సభ్యులు సోనభద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గర్భిణిని ఆస్పత్రిలో చేర్చుకునేందుకు వైద్యులు నిరాకరించారు. కుటుంబ సభ్యులు ఎంత ప్రాధేయపడినప్పటికీ వైద్యులు వినిపించుకోలేదు. పురిటి నొప్పులు భరించలేక బాధితురాలు అక్కడున్న మరుగుదొడ్డిలోకి వెళ్లింది. అక్కడే శిశువును ప్రసవించింది.

కాసేపటికే శిశువు ప్రాణాలు కోల్పోయాడు. విగతజీవిగా మారిన పసికందును చూసి కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. వైద్యుల నిర్లక్ష్యం వల్లే ఈ ఘటన జరిగిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై జిల్లా ప్రధాన వైద్యాధికారి స్పందించారు. శిశువుకు పోస్టుమార్టం నిర్వహించిన తర్వాత మృతికి గల కారణాలను తేలుస్తామన్నారు.

శిశువు టాయిలెట్‌లో పడి చనిపోయాడా? లేక తల్లి కడుపులోనే మరణించాడా? అన్న విషయం తేలాల్సిన అవసరం ఉందన్నారు. టాయిలెట్‌లో పడి శిశువు చనిపోయినట్లు తేలితే... ఆ సమయంలో విధులలో ఉన్న వైద్యులు, ఇతర సిబ్బందిపై తప్పకుండా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

షిండే ప్రభుత్వంలో మంత్రిపదవుల లొల్లి

అమిత్‌షాతో అజిత్ పవార్, ప్రఫుల్ పటేల్ భేటీ

న్యూదిల్లీ: మహారాష్ట్రలో పాలక శివసేన-బీజేపీ కూటమిలో మంత్రిత్వశాఖ కేటాయింపుపై లొల్లి జరుగుతోంది. ప్రత్యేకించి ఎన్‌సీపీ చీలికవర్గం ప్రభుత్వంలో చేరడంతో ఏక్‌నాథ్ షిండే వర్గం తీవ్ర అసంతృప్తితో ఉంది. తమకు కీలకమైన మంత్రిత్వశాఖలు వస్తాయా...రావా, అసలు తమ వర్గానికి ప్రాధాన్యత ఉంటుందా అనే అనుమానం షిండే వర్గంలో బలపడింది. ఎన్‌సీపీ చీలిక నేత అజిత్ పవార్ వర్గంలోనూ ఇదే గందరగోళం నెలకొంది. ఇలాంటి పరిస్థితుల్లో ఎన్‌సీపీ నేతలు అజిత్ పవార్, ప్రఫుల్ పటేల్ కేంద్ర హోంమంత్రి, బీజేపీ సీనియర్ నేతలతో బుధవారం అర్ధరాత్రి సమావేశమయ్యారు. అజిత్ పవార్ హడావుడిగా 8 మంది తనవర్గం ఎమ్మెల్యేలతో మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేయడంతో మంత్రుల కేటాయింపుపై ప్రతిష్టంభన ఏర్పడింది. అమిత్‌షా, బీజేపీ సీనియర్ నేతలతో భేటీ మర్యాదపూర్వకమేనని, తాము ప్రభుత్వంలో చేరినప్పటి నుంచి బీజేపీ అగ్రనాయకులను కలవలేదని ప్రఫుల్ పటేల్ చెప్పుకొచ్చారు. అత్యంత కీలకమైన ఆర్థిక, జలవనరుల మంత్రిత్వశాఖలను అజిత్‌వర్గం డిమాండ్ చేస్తోంది. ఈ డిమాండ్‌ను శివసేన తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. మంత్రిత్వశాఖల కేటాయింపులో కొన్ని సమస్యలు ఉన్నాయని, గతేడాది ప్రభుత్వం ఏర్పడిన తర్వాత బీజేపీ, శివసేన శాఖలను పంచుకున్నాయని పటేల్ తెలిపారు. ఇప్పుడు తమకు శాఖలు కేటాయించాల్సి ఉన్నందున ఆ రెండు పార్టీలు కొన్నిశాఖలు వదులుకోవాల్సి ఉందని చెప్పారు. ఈ సమస్య వల్లే మంత్రిత్వశాఖల కేటాయింపులో ఇబ్బందులు ఉన్నాయని ఆయన అంగీకరించారు.

విషం చిమ్మిన హిందూ మతోన్మాదులు

దిల్లీ స్టేడియం వేదికగా మరోసారి విద్వేష ప్రసంగాలు

న్యూదిల్లీ : మైనారిటీ ముస్లింలపై హిందూ మతోన్మాద శక్తులు మరోసారి విషం చిమ్మాయి. దేశ రాజధాని న్యూదిల్లీలోని తల్కటోరా స్టేడియం ఇందుకు వేదికగా మారింది. వీహెచ్‌పీ నేత తొగాడియా సహా అనేకమంది నాయకులు ఆ స్టేడియంలో రెచ్చగొడుతూ ఉపన్యాసాలు చేశారు. 'మనం పారిపోకూడదు లేదా చనిపోకూడదు. మన కాలును వారి ఛాతిపై పెట్టి గుణపాఠం చెప్పాలి' అని వీహెచ్‌పీ అంతర్జాతీయ మాజీ అధ్యక్షుడు ప్రవీణ్ తొగాడియా అన్నారు. సభకు హాజరైన మతోన్మాదులు తొగాడియా ప్రసంగాన్ని హర్షధ్వానాలతో స్వాగతించారు. దేశంలో ముస్లిం జనాభాను పెరగనివ్వబోమని నినాదాలు చేశారు. నరేంద్ర మోదీ ప్రభుత్వంపై తొగాడియా విశ్వాసం ప్రకటించారు. రామమందిర నిర్మాణం జరుగుతోందని, ఉమ్మడి పౌరస్మృతి బిల్లు ఒక రూపం దాలుస్తోందని, లోక్‌సభ ఎన్నికలకు ముందే జనాభా నియంత్రణ బిల్లు కూడా సిద్ధమవుతుందని ఆయన తెలిపారు.

అంతరక్షత్రియ హిందూ పరిషత్ ఇటీవల నిర్వహించిన విరాట్ హిందూ సమ్మేళన్‌లో కరడుకట్టిన హిందూత్వవాదులు మాట్లాడుతూ, ముస్లింలు జిహాద్‌కు పాల్పడుతున్నారని ఆరోపించారు. హిందువులు పోరాడితే జిహాదీ పరాజయం పాలవుతుందని చెప్పారు. అయితే మానవత్వం, క్షమాగుణం హిందువుల బలహీనతలని తెలిపారు. ఎవరైనా మన చెంప మీద కొడితే కొట్టిన చేతులు నరకాలని సమీక్షా సింగ్ పిలుపునిచ్చారు. ముస్లింలను పరోక్షంగా ప్రస్తావిస్తూ భారత లౌకిక ప్రజాస్వామ్య వ్యవస్థను పునర్నిర్మించాలన్నది వారి దురుద్దేశపూరిత లక్ష్యమని చెప్పారు. అయితే అఖండ హిందూ భారత్ ఏర్పాటు మన లక్ష్యమని హిందువులను ఉద్దేశించి అన్నారు.

ఉగ్రస్థావరాలపై ఎన్‌ఐఏ దాడులు

శ్రీనగర్: ఉగ్రవాద కుట్ర కేసులో జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్‌ఐఏ) జమ్మూకశ్మీర్‌లోని పుల్వామా, షోపియాన్ జిల్లాల్లోని ఐదు ప్రాంతాల్లో గురువారం దాడులు నిర్వహించిందని అధికారులు తెలిపారు. జమ్మూకశ్మీర్ ఉగ్రవాద కుట్ర కేసులో కొనసాగుతున్న దర్యాప్తులో భాగంగా, పాకిస్తాన్ మద్దతు ఉన్న నిషేధిత ఉగ్రవాద సంస్థలకు చెందిన సంస్థలు, అనుబంధ సంస్థలకు చెందిన ప్రాంగణాలపై మరో మారు దాడులు నిర్వహించినట్లు ఎన్‌ఐఏ అధికార ప్రతినిధి తెలిపారు. టీఆర్‌ఎఫ్, యునైటెడ్ లిబరేషన్ ఫ్రంట్ జమ్ము అండ్ కశ్మీర్ (యుఎల్‌ఎఫ్&కె), ముజాహిదీన్ గజ్వత్-ఉల్-హింద్ (ఎంజిహెచ్), జమ్మూకశ్మీర్ ఫ్రీడమ్ ఫైటర్స్ (జేకెఎఫ్ఎఫ్), కాశ్మీర్ టైగర్స్, పీఏఎఫ్ఎఫ్ తదితర పేర్లతో ఏర్పడిన కొత్త సంస్థల సానుభూతిపరులు, కార్యకర్తల ప్రాంగణాలపై కూడా ఎన్‌ఐఏ దాడులు చేసింది. ఈ సంస్థలు లష్కర్-ఎ-తోయిబా (ఎల్‌ఈటీ), జైష్-ఎ-మొహమ్మద్ (జెఇఎం), హిజ్బ్-ఉల్-ముజాహిదీన్ (హెచ్‌ఎం), అల్-బదర్, అల్-ఖైదా మొదలైన నిషేధిత పాకిస్తాస్ మద్దతుగల సంస్థలకు అనుబంధంగా ఉన్నాయి. సోదాల సమయంలో పెద్ద మొత్తంలో దాడులు, నేరాల సమాచారం ఉన్న అనేక డిజిటల్ పరికరాలను ఎన్‌ఐఏ బృందాలు స్వాధీనం చేసుకున్నాయని ప్రతినిధి చెప్పారు.

సిసోడియా బెయిల్‌పై నేడు సుప్రీంలో విచారణ



న్యూదిల్లీ: సీబీఐ దర్యాప్తు చేస్తున్న దిల్లీ ఎక్సైజ్ పాలసీ కేసులో ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) నేత మనీశ్ సిసోడియా బెయిల్ పిటిషన్‌లు, మనీలాండరింగ్ వ్యవహారంపై సుప్రీంకోర్టు శుక్రవారం విచారణ చేపట్టనుంది. ఈ కేసుల్లో తనకు బెయిల్ మంజూరు చేయడానికి నిరాకరించిన దిల్లీ హైకోర్టు వేర్వేరు ఉత్తర్వులను సవాలు చేస్తూ సిసోడియా వేసిన పిటిషన్‌లను న్యాయమూర్తులు సంజీవ్ ఖన్నా, బేల ఎం త్రివేదిలతో కూడిన ధర్మాసనం విచారించనుంది. జులై 10న, ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం... జులై 14న సిసోడియా అభ్యర్థనలను విచారించేందుకు అంగీకరించింది. సిసోడియా భార్య తీవ్ర అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరినందున బెయిల్ పిటిషన్లపై విచారణ చేపట్టాలని సిసోడియా తరపున సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ సుప్రీంకోర్టును కోరారు. దిల్లీ ఉప ముఖ్యమంత్రిగా పనిచేసిన సిసోడియా ఎక్సైజ్ శాఖను నిర్వహించారు. మద్యం కుంభకోణంలో ఆరోపణలపై ఫిబ్రవరి 26 న సీబీఐ అయన్ను అరెస్టు చేసింది. అప్పటి నుంచి కస్టడీలోనే ఉన్నారు. మార్చి 9న తీహార్ జైలులో ప్రశ్నించిన తర్వాత సీబీఐ నమోదు చేసిన ఎఫ్‌ఐఆర్ ఆధారంగా మనీలాండరింగ్ కేసులో ఈడీ కూడా సిసోడియాను అరెస్టు చేసింది. ఫిబ్రవరి 28న సిసోడియా ఉప ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశారు. ఉపముఖ్యమంత్రిగా, ఎక్సైజ్ శాఖ మంత్రిగా పనిచేసిన ఆయన సాక్షులను ప్రభావితం చేసే సత్తా ఉన్న 'హై ప్రొఫైల్' వ్యక్తి అని పేర్కొంటూ మే 30న సీబీఐ కేసులో ఆయనకు హైకోర్టు బెయిల్ నిరాకరించింది.

ఆన్‌లైన్ గేమింగ్‌పై జీఎస్టీ చట్టానికి సవరణ: కేంద్రం

న్యూదిల్లీ: ఆన్‌లైన్ గేమింగ్, క్యాసినో, గుర్రపు పందేలపై 28 శాతం పన్ను విధిస్తూ జీఎస్టీ కౌన్సిల్ తీసుకున్న నిర్ణయాన్ని అమలు చేసేందుకు పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో జీఎస్టీ చట్టానికి స్పష్టమైన సవరణలు తీసుకు రానున్నట్లు రెవెన్యూ కార్యదర్శి సంజయ్ మల్హోత్రా గురువారం తెలిపారు. వర్షాకాల సమావేశాలు జులై 20న ప్రారంభమై ఆగస్టు 11న ముగుస్తాయి. 'చట్టాన్ని రూపొందించి, పార్లమెంటులో ప్రవేశపెట్టి, వర్షాకాల సమావేశాల్లో ఆమోదింపజేయాలనేది మా ప్రయత్నం' అని పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన చెప్పారు. రాష్ట్ర శాసనసభలు కూడా రాష్ట్ర జీఎస్టీ చట్టాలలో సవరణలను ఆమోదించినప్పుడే అమలులోకి వస్తాయని దీనికి కొంత సమయం పడుతుందని ఆయన అన్నారు. ఆన్‌లైన్ గేమింగ్ కంపెనీలు స్థూల గేమింగ్ రెవెన్యూ (జీజీఆర్)పై తక్కువ రేట్లకు పన్ను చెల్లిస్తున్నాయని, ఇది ఆహారంపై వర్తించే 5 శాతం కంటే తక్కువగా ఉందని ఆయన చెప్పారు. ఆన్‌లైన్ గేమింగ్ కంపెనీలు... గుర్రపు పందేలు, క్యాసినోల టర్నోవర్‌పై 28 శాతం పన్ను విధించాలని వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) కౌన్సిల్ మంగళవారం జరిగిన సమావేశంలో నిర్ణయించింది. పన్ను విధించే క్యాసినోలు, గుర్రపు పందేలు, ఆన్‌లైన్ గేమింగ్‌లను పరిశీలించిన మంత్రుల బృందం సిఫార్సు ఆధారంగా పన్ను రేటు నిర్ణయించారు. మొత్తం విలువపై పన్ను విధించాలని జీఎస్టీ కౌన్సిల్ నిర్ణయించింది.

నెక్స్ట్ వాయిదా

న్యూదిల్లీ: ఎంబీబీఎస్ ఆఖరి సంవత్సరం 2019 బ్యాచ్ విద్యార్థులకు నిర్వహించాల్సిన నేషనల్ ఎగ్జిట్ టెస్ట్ (నెక్స్ట్)ను వాయిదా వేస్తున్నట్టు జాతీయ వైద్య కమిషన్ (ఎన్‌ఎంసీ) గురువారం ప్రకటించింది.

అయితే ఈ నెల 28న నిర్వహించాల్సిన మాక్ నెక్స్ట్ పరీక్ష నిర్వహణపై ఎలాంటి ప్రకటన చేయలేదు. కేంద్ర వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ నుంచి తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు నెక్స్ట్‌ను వాయిదా వేస్తున్నట్టు ఎన్‌ఎంసీ తెలిపింది. నెక్స్ట్ మార్గదర్శకాలను ఇటీవలే ఎన్‌ఎంసీ విడుదల చేసింది. ఏటా రెండు దశల్లో ఈ పరీక్షను నిర్వహిస్తారు.

పీజీ వైద్య కోర్సుల్లో ప్రవేశాలకు, దేశంలో వైద్యుడిగా ప్రాక్టీస్ చేసుకునేందుకు నెక్స్ట్ ఉత్తీర్ణత తప్పనిసరి. విదేశాలకు చెందిన మెడికల్ గ్రాడ్యుయేట్లు భారత్‌లో ప్రాక్టీస్ చేసుకోవాలన్నా నెక్స్ట్‌లో ఉత్తీర్ణత కావాల్సిందే.

బోధనలో సమూల మార్పులు

- ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రూపంలో నాలుగో విప్లవం
- విశ్వవిద్యాలయాల వైస్‌ఛాన్సలర్ల సమావేశంలో సీఎం జగన్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి:
విద్యా బోధనలో సమూల మార్పులకై ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రూపంలో నాలుగో విప్లవం దిశగా అడుగులు వేస్తున్నామని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి చెప్పారు. గురువారం విద్యాశాఖ అధికారులు, విశ్వ విద్యాలయాల వైస్ ఛాన్స్‌లర్లతో తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో సీఎం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ విద్యారంగంలో ఇప్పుడు జరుగుతున్న మార్పులను గమనిస్తే మనం ఒక స్థాయిలో ఉంటే లక్ష్యం ఇంకో స్థాయిలో ఉంది. ఈ గ్యాప్‌ను పూడ్చాలంటే ఏం చేయాలన్న దానిపై ఆలోచనలను పంచుకోవడానికి మీ అందర్నీ ఒక చోటకు పిలిచాను. ఉన్నత విద్యా రంగంలో వైస్‌ఛాన్స్‌లర్లది కీలక పాత్ర. అందుకే మిమ్మల్ని కూడా ఇందులో భాగస్వాములను చేస్తున్నాం. టెక్నాలజీ పరంగా చూస్తే మొదటి రివల్యూషన్ 1784లో స్టీమ్‌తో రైలు ఇంజన్ రూపంలో చూశాం. తర్వాత 100 ఏళ్ల తర్వాత విద్యుత్ రూపంలో మరొక రివల్యూషన్ చూశాం. మూడోది 1960-70 ప్రాంతంలో కంప్యూటర్లు, ఐటీ రంగం రూపేణా మరొక విప్లవం చూశాం. ఇప్పుడు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రూపంలో నాలుగో విప్లవం దిశగా అడుగులు వేస్తున్నామన్నారు. రాబోయే రోజుల్లో విద్యావిధానాన్ని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పూర్తిగా మార్చబోతోందని, ఈ అడుగులో మనం వెనుకబడితే... కేవలం అనుసరించే వారిగానే మనం మిగిలిపోతామన్నారు. సరైన సమయంలో తగిన విధంగా అడుగులు వేయగలిగితే మనం ఈ రంగాల్లో నాయకులం అవుతాం. ఏఐ అభివృద్ధి చెందుతున్న కొద్దీ.. దీన్ని వినియోగించుకుని, సామర్థ్యాన్ని పెంచుకునే వర్గం ఒకరు అయితే, ఏఐని క్రియేట్ చేసేవారు. మరొక వర్గంగా తయారవుతారు. గతంలో స్టీమ్ ఇంజిన్, ఎలక్ట్రిసిటీ, కంప్యూటర్ విప్లవాల్లో మనం వెనకడుగులోనే ఉన్నాం. మనం ఏదీ క్రియేట్ చేసే పరిస్థితిలో లేం. అందుకనే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో మనం క్రియేటర్లుగా మారడం అన్నది చాలా ముఖ్యమైనది. ఈ రంగంలో మనం లీడర్లుగా తయారు కావడం చాలా ముఖ్యం. ఎమర్జింగ్ టెక్నాలజీస్‌లో మనం క్రియేటర్లుగా తయారు కావాలి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ని ఒకవైపు మన విద్యావిధానంలోకి తీసుకువచ్చి విద్యార్థులకు బోధన, నేర్చుకునే సమర్థతను పెంచుకోవడంలో ఎలా వాడుకోవాలి? అన్న కార్యక్రమం చేస్తూనే రెండోవైపున ఏఐ క్రియట్ చేసే స్కిల్స్, టాలెంట్‌ను కూడా మన పిల్లల్లోకి తీసుకుని రావాలి. ఇది కూడా కరిక్యులమ్‌లో భాగం కావాల్సిన అవసరముందని సీఎం వారికి దిశానిర్దేశం చేశారు. జర్మనీ లాంటి దేశంలో నైపుణ్యం ఉన్న మానవవనరుల కొరత ఉందని చెప్పారు. పాశ్చాత్య ప్రపంచం అంతా డెమొగ్రఫిక్ ఇన్‌బ్యాలెన్స్ ఎదుర్కొంటోంది. మనదేశంలో కాని, మన రాష్ట్రంలోకాని సుమారు 70శాతం మంది పనిచేసే వయస్సులో ఉన్నారు. వీరికి సరైన నాలెడ్జ్, స్కిల్స్ ఇవ్వలేకపోతే మనం ప్రపంచానికి మార్గనిర్దేశకులుగా ఉండలే మని, ఈ వాస్తవాన్ని అందరూ గుర్తించాలన్నారు. అందుకే విద్యారంగంలో మార్పులకు మనం శ్రీకారం చుట్టాలి. ఏ రకమైన మార్పులకు శ్రీకారం చుడితే మనం అనుకున్నట్టు ఫలితాలు ఉంటాయి, విద్యారంగంలో ఇంకా మెరుగ్గా ఎలా చేయగలుగుతాం అన్నదానిపై ఆలోచనలు చేయాలని సీఎం కోరారు. నలుగురితో నేను మాట్లాడి నాకు అనిపించిన ఆలోచనలన్నింటినీ వీసీల ముందు ఉంచుతున్నాను. ఈ ఆలోచనలు కార్యాచరణలోకి రావాలి, వీటికి రూపకల్పన జరగాలి. ఇందులో మీ పాత్ర గరిష్టంగా ఉండాలి. ఈ రోజు మనం మొట్టమొదటి అడుగు వేస్తున్నాం. ఈ తొలి అడుగు మన ఆలోచనలను చైతన్యం చేయడం ద్వారా విద్యారంగాన్ని ఇప్పుడున్న స్థాయి నుంచి మెరుగైన స్థాయికి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని సీఎం ఉద్బోధించారు. పిల్లలకు కావాల్సిన కోర్సుల్లో బోధన అందించాల్సిన అవసరం ఉంది. ఆ రకంగా చేయడానికి ప్రతి ఫ్యాకల్టీలో మనం క్రియేట్ చేయగలగాలి. దీనిపై ప్రతి వీసీ కూడా ఆలోచన చేయాలన్నారు. మెడికల్ కోర్సుల బోధనలో కూడా మార్పులు గణనీయంగా రావాల్సి ఉంది. శరీరాన్ని కోసి ఆపరేషన్ చేసే రోజులు పోయాయి. కేవలం కొన్ని రంధ్రాలు చేసి కంప్యూటర్ల ద్వారా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను వాడుకుని ఆపరేషన్ చేసే స్థాయి వచ్చింది. అందుకే వైద్యులకు రోబోటిక్స్, ఏఐలను పాఠ్యప్రణాళికలో, బోధనలో భాగస్వామ్యం చేయాలన్నారు. కేవలం మెడిసిన్‌లో చికిత్సకు సంబంధించిన జ్ఞానం ఇవ్వడమేకాదు, టెక్నాలజీని ఎలా వాడుకోవాలన్న దానిపై పాఠ్యప్రణాళికలో మార్పులు తీసుకురావాలన్నారు. అదేవిధంగా వ్యవసాయం చేసే తీరుకూడా గణనీయంగా మారిపోతోంది. ఇప్పుడొస్తున్న కొత్త టెక్నాలజీని మనం పిల్లలకు నేర్పకపోతే మనం వెనకబడతామన్నారు. ఒక్కో యూనివర్శిటీ ఒక్కో రకంగా కరిక్యులమ్ తయారు చేయలేదు. ఒక్కో మాదిరిగా ఉండలేదు. అందువల్ల మనం చేస్తున్న విజన్ కోసం ఒక హైలెవల్ అకడమిక్ బోర్డు మనకు అవసరం. ప్రపంచంలోనే అత్యుత్తమ ప్రతిభావంతులతో ఈ బోర్డును ఏర్పాటు చేద్దాం. పాఠ్యప్రణాళికలను, బోధన, ప్రశ్నాపత్రాల తీరును కూడా పూర్తిగా మారుద్దాం. వర్చువల్ రియాలిటీ, ఏఐ టెక్నాలజీని పాఠ్య ప్రణాళికలో భాగం చేద్దామని సీఎం వారికి మార్గ నిర్దేశనం చేశారు. ఈసమావేశంలో విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, సీఎస్ డాక్టర్ కె.ఎస్.జవహర్ రెడ్డి, వైద్య ఆరోగ్యశాఖ స్పెషల్ సీఎస్ ఎం టీ కృష్ణబాబు, వ్యవసాయ శాఖ స్పెషల్ సీఎస్ గోపాలకృష్ణ ద్వివేది, పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్, ఉన్నత విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి జె.శ్యామలరావు, ఐటీ శాఖ కార్యదర్శి కోన శశిధర్, కళాశాల విద్యాశాఖ కమిషనర్ పోలా భాస్కర్, ఏపీ హయ్యర్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ చైర్మన్ కె.హేమచంద్రారెడ్డి, ఐ అండ్ పీఆర్ కమిషనర్ టి.విజయ్‌కుమార్‌రెడ్డి, వివిధ విశ్వ విద్యాలయాల వీసీలు ఈ సమావేశానికి హాజరయ్యారు.

వ్యవసాయానికి డ్రోగో డ్రోన్లు

తాడేపల్లి, హైదరాబాద్‌లో తయారీ కేంద్రాలు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి:
భారతదేశంలో ప్రముఖ డ్రోన్ తయారీ టెక్నాలజీ ప్రొవైడర్ డ్రోగో డ్రోన్స్ ప్రైవేట్ లిమిటెడ్ మానవరహిత వైమానిక వాహనం (యూఏవీ) క్రిషి 2.0ను ఆవిష్కరించింది. ఇది 10 కిలోల పేలోడ్ సామర్థ్యంతో రూపొందించబడింది. ఈ డ్రోన్ రోజుకు 30 ఎకరాల్లో క్రిమిసంహారక, పురుగు మందులను పిచికారీ చేస్తుంది. నెలలో 750 నుండి 900 ఎకరాల్లో రైతులు తమ పంటలు కాపాడుకునేలా అవసరమైన మందులను పిచికారీ చేసే అవకాశం ఉంది. డ్రోగో డ్రోన్స్ సంస్థ ఇటీవల కాలంలో సర్వేయింగ్, మ్యాపింగ్‌లలో అందిస్తున్న సేవలను రైతాంగానికి ఉపయోగపడే డ్రోన్ల తయారీవైపు దృష్టి మళ్లించింది. ఈ డ్రోన్ల తయారీకి అవసరమైన సర్టిఫికెట్‌ను కేంద్రం తాజాగా డ్రోగో డ్రోన్స్‌కు అందచేసింది. ఈ డ్రోన్లను హైదరాబాద్‌తో పాటు గుంటూరు జిల్లా తాడేపల్లిలో తయారు చేయనున్నారు. ఇది ఏడాదికి మూడువేల డ్రోన్లను తయారు చేయనుంది. డిమాండ్ ఆధారంగా డ్రోన్ల తయారీని పెంచనుంది. డ్రోగో డ్రోన్స్ సంస్థ సీఈవో యశ్వంత్ బొంతు దీని గురించి తెలియజేస్తూ అవిశ్రాంతంగా పరిశోధన, అభివృద్ధిలో భాగస్వామ్యమైన తమ బృందం అంచనాలకు మించి అద్భుతమైన డ్రోన్‌ను రూపొందించిందని తెలిపారు. క్రిషి 2.0 ఒక ఊహించని మార్పును వ్యవసాయ రంగంలో ఆవిష్కరించడానికి సిద్ధంగా ఉందన్నారు. క్రిమిసంహారక మందులను పిచికారీ చేసే సమయంలో రైతులు ఎదుర్కొనే ఇబ్బందులను తొలగించటంతో పాటు రైతులకు ఖర్చు తగ్గిస్తుందని, సమయం ఆదా అవుతుందని యశ్వంత్ తెలిపారు. డ్రోన్ సేవల రంగం వార్షిక అమ్మకాల టర్నోవర్ వచ్చే మూడేళ్లలో రూ.30వేల కోట్లకు పైగా పెరగవచ్చునని, ఫలితంగా దేశంలో ఐదు లక్షల మందికి ఉపాధి కలుగుతుందని అంచనా వేస్తున్నట్లు యశ్వంత్ తెలిపారు. డ్రోగో సంస్థ ఆంధ్రప్రదేశ్‌లో 26 సేవా కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు.

ప్రభుత్వ ఉద్యోగుల 341 డిమాండ్లు పరిష్కరించాం

సీఎస్ జవహర్ రెడ్డి

విశాలాంధ్ర-విజయవాడ:
రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించి సుమారు 461 డిమాండ్లు, అంశాలు పరిష్కరించాల్సి ఉండగా ఇప్పటికే 341 డిమాండ్లను పరిష్కరించడం జరిగిందని మిగతావి పరిశీలనలో ఉన్నాయని వాటిని కూడా సాధ్యమైనంత తొందరలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్.జవహర్ రెడ్డి చెప్పారు. గురువారం వెలగపూడి రాష్ట్ర సచివాలయంలో ఆంధ్రప్రదేశ్ సివిల్ సర్వీసెస్ జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశం ఆయన అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ ఉద్యోగుల డిమాండ్ల సత్వర పరిష్కారానికి సంబంధిత శాఖల స్థాయిలో ఉద్యోగ సంఘాలతో సమావేశాలు నిర్వహించి పరిష్కరించాలని కోరటంతో వాటిలో చాలా వరకూ అధికారులు పరిష్కరించడం జరిగిందన్నారు. గత ఆరేడు మాసాలుగా ఉద్యోగ సంఘాలతో తరచూ మంత్రివర్గ ఉప సంఘం, అధికారులు సమావేశమై ఆయా అంశాలను చర్చించడం జరుగుతోందన్నారు. వీలైనంత వరకూ ఉద్యోగులకు సంబంధించిన డిమాండ్లను పరిష్కరించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని స్పష్టం చేశారు. కరోనాతో చనిపోయిన ఉద్యోగుల స్థానే వారి కుటుంబాలకు చెందిన వారికి కారుణ్య విధానంలో 1042 ఉద్యోగాలు ఇచ్చేందుకు ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించింది... ఆప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నట్టు జవహర్ రెడ్డి ఉద్యోగ సంఘాలకు స్పష్టం చేశారు. అలాగే కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణకు సంబంధించి ప్రభుత్వం ఇప్పటికే ఆదేశాలు జారీచేసిందని ఆప్రక్రియను త్వరిత గతిన పూర్తి చేసేందుకు కూడా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. ఉద్యోగుల వేతన సవరణకు సంబంధించి మాజీ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి మన్మోహన్ సింగ్ నేతృత్వంలో 12వ పీఆర్సీ కమిటీని కూడా వేసినట్లు సీఎస్ చెప్పారు. ఉద్యోగుల ఆరోగ్య పథకంపై త్వరలో స్టీరింగ్ కమిటీ సమావేశం అవుతుందని వెల్లడించారు. అనంతరం సంబంధిత శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులు వారి వారి శాఖలలో ఉద్యోగుల డిమాండ్ల పరిష్కారానికి తీసుకున్న చర్యలను వివరించారు. ఈసమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు కె.ప్రవీణ్ కుమార్, అజయ్ జైన్, బి.రాజశేఖర్, ఎంటి.కృష్ణబాబు, గోపాలకృష్ణ ద్వివేది,ముఖ్య కార్యదర్శులు చిరంజీవి చౌదరి, జయలక్ష్మి, శశి భూషణ్‌కుమార్, ప్రవీణ్ ప్రకాశ్, శ్యామల రావు, ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే ఉద్యోగ సంఘాల నుండి రాష్ట్ర సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు వెంకట్రామిరెడ్డి, ఏపీ ఎన్జీవోల సంఘం అధ్యక్షులు బండి శ్రీనివాసరావు, ఏపీ రెవెన్యూ సర్వీసెస్ సంఘం అధ్యక్షులు బొప్పరాజు వెంకటేశ్వర్లు, ఏపీ ఎస్టీయూ అధ్యక్షులు సాయి శ్రీనివాస్, పీఆర్‌టీయూ అధ్యక్షులు ఎం.కృష్ణయ్య, యూటీఎఫ్ అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు, ప్రభుత్వ డ్రైవర్ల సంఘం అధ్యక్షులు ఎస్.శ్రీనివాసరావు, ఏపీటీఎఫ్ అధ్యక్షులు జి.హృదయరాజు,ఏపీజీఈఏ జనరల్ సెక్రటరీ జే.ఆస్కార్ రావు, ఆల్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నాల్గవ తరగతి ఉద్యోగుల సెంట్రల్ అసోసియేషన్ల అధ్యక్షులు సి.గోపాలకృష్ణ, ఎస్.మల్లేశ్వరరావు, ఏపీ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు సీహెచ్.శ్రావణ్ కుమార్, ఏపీ వ్యవసాయ విస్తరణ అధికారుల సంఘం అధ్యక్షులు వేణుమాధవ రావు, ఏపీ ఎకనమిక్స్ అండ్ స్టాటిస్టికల్ సబార్డినేట్ సంఘం అధ్యక్షులు రజనీస్ బాబు, ఏపీ జూనియర్ వెటర్నరీ అధికారులు, వెటర్నరీ లైవ్ స్టాకు అధికారుల సంఘం అధ్యక్షులు సేవా నాయక్, ఆయా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

బంధం బలోపేతమే లక్ష్యం

- భారత్-ఫ్రాన్స్ దేశాల వ్యూహాత్మక భాగస్వామ్యానికి 25ఏళ్లు
- పారిస్‌లో మోదీకి ఘన స్వాగతం

పారిస్:
భారత్-ఫ్రాన్స్ మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యానికి ఈ ఏడాదితో 25 ఏళ్లు పూర్తి అయ్యాయి. ఈ సందర్భంగా తమ రెండు దేశాల మధ్య వ్యూహాత్మక బంధాన్ని మరింత బలోపేతం చేసుకోవాలన్నదే తన పారిస్ పర్యటన ఉద్దేశమని భారత ప్రధాని మోదీ తెలిపారు. ఆయన గురువారం ఫ్రాన్స్ రాజధాని పారిస్ చేరుకున్నారు. విమానాశ్రయంలో మోదీకి ఎర్రతివాచీ పర్చి ఫ్రాన్స్ ప్రధాని ఎలిజబెత్ బార్నె ఆత్మీయ స్వాగతం పలికారు. రెండు దేశాల జాతీయ గీతాలాపానతో ఎయిర్‌పోర్టులో గౌరవ వందనాన్ని మోదీ స్వీకరించారు. 'ఫ్రెంచ్ నేషనల్ డే' వేడుకలకు గౌరవ అతిథిగా పాల్గొనాలంటూ ఆ దేశాధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ ఆహ్వానం మేరకు మోదీ ఆ దేశానికి వెళ్లారు. ఆయన అనేక మంది సీఈవోలు, ప్రముఖులతో, భారత సంతతి ప్రజలతో కలుస్తారని భారత విదేశాంగ వ్యవహారాల శాఖ అధికార ప్రతినిధి అరిందమ్ బాగ్చీ ట్వీట్ చేశారు. పారిస్‌కు వెళ్లే ముందు మోదీ మాట్లాడుతూ ద్వైపాక్షిక వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసుకోనున్నట్లు వెల్లడించారు. అధ్యక్షుడు మాక్రాన్‌తో సమావేశమై తమ దేశాల మధ్య 25 ఏళ్లకుపైగా కొనసాగుతున్న బంధాన్ని పటిష్టపర్చుకొనే దిశగా విస్తృత స్థాయి చర్చలు జరపనున్నట్లు మోదీ తెలిపారు. ప్రాదేశిక, అంతర్జాతీయ అంశాలపై ఎప్పుడు కలిసి పని చేస్తామన్నారు. 'భారత్-ఫ్రాన్స్ వ్యూహాత్మక బంధానికి 25 ఏళ్లు. రెండు దేశాల మధ్య బంధం మరింత బలంగా ముందుకు సాగుతుంద'ని మోదీ ఆకాంక్షించారు. రక్షణ, అంతరిక్షం, బ్లూ ఎకానమీ, వాణిజ్యం, పెట్టుబడులు, విద్య రంగంలో సహకారం కొనసాగుతున్నట్లు తెలిపారు. ఫ్రాన్స్ ప్రధాని ఎలిజబెత్ బార్న్, సెనేట్ అధ్యక్షుడు గెరార్డ్ లార్చెర్, నేషనల్ అసెంబ్లీ అధ్యక్షుడు యేల్ బ్రౌన్ పైవెట్‌లతోనూ భేటీ కానున్నట్లు వెల్లడించారు. శుక్రవారం జరిగే ఫ్రెంచ్ నేషనల్ డే లేక బాస్టిల్లె డే వేడుకల్లో మాక్రాన్‌తో కలిసి పాల్గొనున్న నేపథ్యంతో తన ఈ పర్యటన ప్రత్యేకమైనదని మోదీ అన్నారు. నేషనల్ డే పరేడ్‌లో 269 మంది సభ్యుల భారతీయ త్రివిధ దళాల బృందం పాల్గోనుంది. భారతీయ వైమానిక దళానికి చెందిన మూడు రఫేల్ యుద్ధ విమానాలు కూడా ఫ్రెంచ్ జెట్లతో కలిసి విన్యాశాల్లో పాల్గొంటాయి. పారిస్ పర్యటనను ముగించుకొని మోదీ శనివారం అబుదాబీకి బయల్దేరి వెళతారు.

కుప్పకూలిన విండీస్

- తొలి ఇన్నింగ్స్‌లో 150 ఆలౌట్
- ఐదు వికెట్లతో రాణించిన అశ్విన్

డొమినికా:
భారత్-వెస్టిండీస్ క్రికెట్ జట్ల మధ్య బుధవారం ఇక్కడి విండ్సర్‌పార్క్‌లో ప్రారంభమైన తొలి టెస్టులో అశ్విన్, యశస్వి దుమ్ము రేపారు. దీంతో మొదటిరోజు టీమిండియాదే పైచేయి అయింది. అశ్విన్ 5 వికెట్లు తీయగా... టెస్టుల్లో అరంగేట్రం చేసిన యశస్వి జైస్వాల్ 40 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. వెస్టిండీస్‌ను తొలి ఇన్నింగ్స్ లో కేవలం 150 పరుగులకే కుప్పకూల్చిన టీమిండియా... తన మొదటి ఇన్నింగ్స్‌లో తొలిరోజు ఆట ముగిసే సమయానికి వికెట్ కోల్పోకుండా 80 పరుగులు చేసింది. యశస్వి 40, రోహిత్ 30 పరుగులతో అజేయంగా నిలిచారు. తొలి టెస్ట్ ఆడుతున్న యశస్వి.. . విండీస్ గడ్డపై అద్భుతమైన ఆరంభం అందుకోవడం విశేషం.

అశ్విన్ స్పిన్ ఉచ్చు
డబ్ల్యూటీసీ ఫైనల్ తుది జట్టులో చోటు దక్కని అశ్విన్... కసితో వెస్టిండీస్‌పై బౌలింగ్ చేశాడు. 24.3 ఓవర్లలో 60 పరుగులు ఇచ్చి 5 వికెట్లు తీసుకున్నాడు. భారత తరఫున వికెట్ల ఖాతా తెరవడంతోపాటు విండీస్ ఇన్నింగ్స్ కూడా అశ్వినే ముగించడం విశేషం. వెస్టిండీస్ పై అశ్విన్ ఒక ఇన్నింగ్స్ లో ఐదు వికెట్లు తీయడం ఇది ఐదోసారి. అతనికి తోడు జడేజా కూడా 3 వికెట్లు తీయడంతో విండీస్ 150 పరుగులకే కుప్పకూలింది. సిరాజ్, శార్దూల్ చెరొక వికెట్ తీసుకున్నారు. విండీస్ ఇన్నింగ్స్‌లో అలిక్ అథనాజే మాత్రమే 47 పరుగు లతో టాప్ స్కోరర్ గా నిలిచాడు. నిజానికి విండీస్ ఓపెనర్లు చాలా జాగ్రత్తగా ఇన్నింగ్స్ ప్రారంభిం చారు. దీంతో తొలి 12.5 ఓవర్ల పాటు ఆ టీమ్ ఒక్క వికెట్ కూడా కోల్పోలేదు. అయితే పేస్ బౌలర్లను తప్పించి అశ్విన్ ను రంగంలోకి దింప దంతో పరిస్థితి మారిపోయింది. అతడు వచ్చీ రాగానే ఓపెనర్లు బ్రాత్‌వెయిట్ (20), చంద్రపాల్ (12)లను పెవిలియన్ కు పంపించాడు. 38 పరుగులకే ఓపెనర్లను కోల్పోయిన విండీస్.. తర్వాత కోలుకోలేదు. వరుసగా వికెట్లు కోల్పోతూనే ఉంది. చివరికి 150 పరుగులకే ఆలౌటైంది. తర్వాత తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన ఇండియాకు ఓపెనర్లు రోహిత్, యశస్వి జైస్వాల్ మంచి ఆరంభాన్నిచ్చారు. ముఖ్యంగా తొలి టెస్ట్ ఆడుతున్న యశస్వి ఆకట్టుకున్నాడు. మొదట్లో నెమ్మదిగా ఇన్నింగ్స్ ప్రారంభించిన అతడు.. తర్వాత మెల్లగా జోరు పెంచాడు. అటు రోహిత్ కూడా జాగ్రత్తగా ఆడటంతో ఇండియా వికెట్ కోల్పోలేదు. తొలి రోజు ఆట ముగిసే సమయానికి 23 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 80 పరుగులు చేసింది.

ఫ్రాన్స్ నుంచి 26 రఫేల్ విమానాలు

3 స్కార్పీనే జలాంతర్గాముల కొనుగోలుకు భారత్ అంగీకారం

న్యూఢిల్లీ:
ఫ్రాన్స్ నుంచి 26 రఫేల్ నావికా విమానాలు, మరో మూడు స్కార్పీనే జలంతర్గాములను కొనుగోలు చేసేందుకు భారత రక్షణశాఖ అంగీకరించింది. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలకు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నేతృత్వ రక్షణ సేకరణ మండలి (డీఏసీ) గురువారం ఆమోదం తెలిపింది. తద్వార నేవీ సామర్థ్యాన్ని పెంచుతామని రక్షణశాఖ ప్రకటన పేర్కొంది. అంతర్జాతీయ ప్రభుత్వస్థాయి ఒప్పందం (ఐజీఏ) ఆధారిత ఫ్రెంచ్ ప్రభుత్వం నుంచి భారతీయ నేవీకి లాజిస్టిక్ మద్దతు, సిబ్బందికి శిక్షణ, 26 రఫేల్ మెరైన్ ఎయిర్‌క్రాఫ్ట్‌లతో పాటు సంబంధింత అస్త్రాలు, సిమ్యులేటర్, విడిభాగాలపై యాక్సెప్టెన్స్ ఆఫ్ నెసెసిటీ (ఏఓఎన్)ను డీఏసీ ఆమోదించినట్లు అధికారిక ప్రకటన పేర్కొంది. ఇప్పటికే 36 రఫేల్ యుద్ధ విమానాలను వైమానిక దళం కోసం ఫ్రాన్స్ నుంచి భారత్ తెప్పించుకున్న విషయం విదితమే. ఇక స్కార్పీనె జలంతర్గాములను బయ్ (ఇండియన్) విభాగం కింద కొనుగోలు చేయనుంది. మజాగాన్ డాక్ షిప్‌బిల్డర్స్ లిమిటెడ్ (ఎండీఎల్) వీటిని తయారు చేయనుంది. జలంతర్గాముల నిర్మాణ నైపుణ్యాన్ని మరింత పెంపొందించుకునేలా ఎండీఎల్‌కు సహకారాన్ని అందిస్తామని రక్షణశాఖ వెల్లడించింది.

మహిళా క్రికెటర్లకు శుభవార్త

- ఇక నుంచి పురుష జట్లతో సమానంగా పారితోషికం
- ఐసీసీ సంచలన నిర్ణయం

ముంబై:
మహిళా క్రికెట్ జట్లకు ఐసీసీ శుభవార్త చెప్పింది. ఐసీసీ నిర్వహించే అన్ని టోర్నమెంట్లలో పారితోషికం విషయంలో కీలక నిర్ణయం తీసుకుంది. ఐసీసీ నిర్వహించే అన్ని టోర్నీలలో పురుష క్రికెట్ జట్లు, మహిళా క్రికెట్ జట్లకు సమానంగా పారితోషికం ఇవ్వనున్నట్లు ప్రకటించింది. అంతే కాకుండా టెస్ట్ క్రికెట్‌లో విధించే ఓవర్ రేట్ ఆంక్షల్లో కూడా మార్పులు చేసింది. దక్షిణాఫ్రికా లోని డర్బన్‌లో గురువారం జరిగిన ఐసీసీ వార్షిక సమావేశంలో ఐసీసీ ఈ నిర్ణయం తీసుకుంది. 'ఇది మా క్రీడా చరిత్రలో ఒక ముఖ్యమైన క్షణం, ఐసీసీ గ్లోబల్ ఈవెంట్లలో పోటీపడే పురుషులు, మహిళా క్రికెటర్లకు ఇప్పుడు సమానంగా రివార్డులు అందజేయనుండడం నాకు చాలా ఆనందంగా ఉంది' అని ఐసీసీ చైర్మన్ గ్రెగ్ బార్క్లే ఒక ప్రకటనలో తెలిపారు. కాగా ఐసీసీ నిర్ణయాన్ని ప్రశంసిస్తూ, బీసీసీఐ సెక్రటరీ జే షా... 'కొత్త ఉదయానికి నాంది. సమానత్వం సాధికారత యుగం' అంటూ ట్వీట్ చేశారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.